॥ వేదచక్షుః ॥

(మనోజ్యోతిర్విజ్ఞాన శాస్త్రము-1)



జ్యోతిషాచార్య ధర్మవరం శ్రీకాంతాచార్

వేదచక్షుః
మనోవిజ్ఞానశాస్త్ర గ్రంథము

ప్రచురణ : 07 September 2012

ప్రతులు : 1000

ప్రచురణ కర్త :
ధర్మవరం శ్రీకాంతాచార్య
D.No: 2-8-512
శ్రీ గురుప్రాసాద
శ్రీ గురురాఘవేంద్ర కాలని
మంత్రాలయం గ్రామం – 518345

కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్.
vaiswanara@gmail.com

పీఠికా

ప్రతి ఒక్కరికీ తమ జీవితంలో మంచి జీవితమును గడపవలెనని, మనశ్శాంతితో, ఆయురారోగ్యైశ్వర్యములతో జీవితమును నడపవలెనన్న ఆశ స్వాభావికంగా ఉంటుంది కదా! మనజీవితంలో ఏది మంచిది? ఏది సొగసైనది? ఏది విలువైనది? మంచి అంటే ఏమిటి? విలువ తెలుసుకొనుట ఎటుల? జీవనమును సుఖమయం చేయుట ఎటుల? సమాజములో కీర్తి-ప్రతిష్టలు సంపాదించు మార్గమేమిటి? ఉన్నత పదవులు సంపాదించుటకు ఏమి చేయాలి? కష్టాలు ఏ సందర్భములోనూ రాకుండుటకు ఏమి చేయాలి? తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితాన్ని పొందు మార్గమేమిటి? ఇలాంటి వందలాది ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలని కుతూహలం ఎవరికి కలదో వారు శ్రద్ధతో గురుముఖాంతరముగా చదివి తెలుసుకోవలసిన శాస్త్రమంటే అది జ్యోతిషశాస్త్రమే. జ్యోతిషశాస్త్రము ప్రత్యక్షశాస్త్రముగా ప్రఖ్యాతిగాంచినది.

అప్రత్యక్షాణి శాస్త్రాణి వివాదస్తేషు కెవలమ్ ।
ప్రత్యక్షం జ్యోతిషం శాస్త్రం చన్ద్రార్కౌ యత్ర సాక్షిణౌ ॥

లోకంలో ఉన్న అన్ని శాస్త్రాలు కేవలం వాదవివాదాలకే కారణభూతము గా కనబడుత్నాయి. మనకు కనిపించు సూర్యచంద్రులు సాక్షిగా ఉన్నటువంటి జ్యోతిషశాస్త్రము ఎంత సత్యమో వేదసారాన్ని ప్రత్యక్షంగా తెలుసుకొనుటలో అంతే సత్యము అని తాత్పర్యము. జ్యోతిషశాస్త్రము ఒక ప్రత్యక్ష మనఃశాస్త్రము. ప్రాకారప్రధక్షిణ పథము, గర్భగుడి, గోపురము, మహాద్వారను ఇవన్నియూ గుడిలోని విభాగాలు. గుడియొక్క మహాద్వారపు గోపురమును ఎక్కి గోపురపు చివరిబాగంలోని బంగారు కలశాన్ని తాకగల భక్తులు ఒక్కరైతే, గుడిలో ప్రధక్షణముచేసి, దైవ దర్శనము చేసుకొని, ప్రసాదముతో తృప్తిచెందువారు తొంబైతొమ్మిది మంది వుంటారు. ఇదేవిదంగా జ్యోతిషశాస్త్రము ప్రత్యక్షశాస్త్రము, మనఃశాస్త్రము,

మోక్షమార్గమును తెలుపుశాస్త్రము అని ప్రయోజనము పొందువారు ఒక్కరైతే జ్యోతిషశాస్త్రముయొక్క సామాన్య ఫలితాలతో లౌఖిక ప్రయోజనాన్ని పొందువారు తొంభైతొమ్మిది మంది కలరు. జ్యోతిషపండితులు మాత్రమేకాదు, సామాన్యజనులు, సమస్యలతో సతమతమవుతున్నవారు తమతమ జీవితాలను క్రమక్రమంగా సరిదిద్దుకొనుటకు కావలసిన జ్ఞానం జ్యోతిషశాస్త్రంలో లబిస్తుంది. ప్రతిఒక్కరి జీవితంలో ఒక గౌరవం, కర్తవ్య విషయంలో ఒక ఉత్సాహం, ఆపత్కాలంలో ధైర్యం, అనుమానం పుట్టినపుడు విశ్వాసం ఇది మనోజ్యోతిషశాస్త్రమునుండి మనం సంపాదించుకోదగ్గ సంపద.

ఒక ప్రధానమైన విషయాన్ని మనం గుర్తుపెట్టుకోవాలి. జ్యోతిషశాస్త్రములోని అన్ని భాగాలూ అందరికీ ఒకేవిధంగా అర్థమవునవి కావు. జ్యోతిషఫలమును దాని పరిశీలించువానియొక్క యోగ్యతననుసరించి వుంటుంది. వ్యక్తియొక్క శ్రద్ధ, నిజాయతీ, బుద్ధిశక్తి ఏ స్థాయిలో వుంటుందో ఆ స్థాయికి తగిన శాస్త్రార్థము, ఫలము లభిస్తుంది.

జ్యోతిషశాస్త్ర విషయము అతి రహస్యమైనది, లోతైనది, సూక్ష్మమైనది, తికమకలకు గురిచేయునది. జీవనతత్వము ఒక పెద్ద పర్వతములాంటిది. దానిని ఎక్కదలచినవాడు ఒక్కొక్క మెట్టుగా ఎక్కుతూ, అక్కడక్కడ విశ్రాంతి తీసుకొంటూ, అక్కడక్కడి వాతావరణ స్థితిగతులను అలవరచుకొని, అంచెలంచెలుగా పైకి ఎక్కుటకు సిద్ధపడాలి. తొందరపాటు ఇక్కడ పనికిరాదు. తొందరపడితే ఆపార్థమగు ప్రమాదము కలదు. సావధాన చిత్తం, నెమ్మది కలిగిన మనస్సు ఈ రెండూ ఈ జ్యోతిషశాస్త్రాధ్యయనానికి ముందు వుండవలసిన లక్షణాలు.

సత్యము ఒకటి; సత్యదర్శనము వేలకొద్ది. సందేహము, భయము, ధర్మసంకటము, అనిశ్చయమగు భ్రాంతులు చాలామందిని ప్రతిరోజూ భాదిస్తుంటాయి. మనుష్యులకు అలాంటి జీవనప్రశ్నలు అన్ని యుగాలలోనూ అన్ని ప్రదేశాలలోనూ, ఒక రూపంలో కాకపోయినా ఇంకొక రూపంలో వుండేవుంటాయి. అలాంటి ప్రశ్నలకు సమాధానాన్ని సమయానుకూలంగా అందించేదే జ్యోతిషశాస్త్రం. ఇలా జ్యోతిషశాస్త్రం సార్వకాలీకమైనది, సార్వదేశికమయినటువంటి మనోజ్యోతిషశాస్త్రము.

పేద చక్షుః

ఈ పుస్తక రచనలో జ్యోతిషశాస్త్ర విషయాలను సామాన్య జనుల ఆవశ్యకతను దృష్టిలో వుంచుకొని వ్రాయబడినది. అధికమగు శాస్త్రప్రక్రియలకు, తర్క-ప్రతితర్కాలకు, విమర్శలకు ఇక్కడ ఇక్కడ మనకు ముఖ్యం కాదు. ఇది ఒక సామాన్య మనుష్యుడు తనవంటి సామాన్య మనుష్యుడితో సహపాఠిగా కూర్చిని చేసుకొన్నటువంటి సామాన్య అర్థవివరణ అనిగ్రహించగలరు.

మనోజ్యోతిషశాస్త్రము ద్వారా పొందదగు విశేష విషయమేమిటి?

చదువుటకు మనం ఏ గ్రంథాన్ని ఎంచుకున్ననూ అందులోని విశేషాన్ని తెలుసుకొనుటకు నిరీక్షిస్తాము. కథ అంటే మనుష్యుడి స్వభావముయొక్క విచిత్రమైన ఘటనలను నిరీక్షిస్తాము. వీదినాటకమంటే దానిలోని రాగాపేశములను నిరీక్షిస్తాము. పద్యము,పాటలలో శబ్దమాదుర్యాన్ని, ప్రతిధ్వనికోసం నిరీక్షిస్తాము. చరిత్ర అంటే అందులోని దేశవిదేశ వృత్తాంత విషయాలకోసం నిరీక్షిస్తాము. ఇలాగే భౌతిక, రసాయన, గణితశాస్త్రములలో వాటికి సంభందించిన జ్ఞానానికోసం నిరీక్షిస్తాము. మనోజ్యోతిర్విజ్ఞానశాస్త్రముపై మనకు అంటే సామన్యజనులకు గల కుతూహలము ఎట్టిది? మనము ఈశాస్త్రము ద్వార నిరీక్షించదగు విషయ ఏమిటి? మొదలగు ప్రశ్నలకు సమాధానాన్ని ముందు మన మనస్సునకు విశదీకరించినట్లైతే ఆపై ఈ వ్యాసంగము ద్వారా(ఈ పుస్తక రచన) కాలము వ్యర్థమైనదని అలోచన కానరాదు.

జ్యోతిషశాస్త్రము లోకప్రసిద్ధియైనదని, ఈ అత్యాధునికకాలంలో కూడా వేదాంగభాగమైన జ్యోతిషశాస్త్రానికి ఆకర్షణ, ప్రాముఖ్యత వుందనడంలో ఎటువంటి సంశయము లేదు. మనదేశంలో ఎన్నో వేల సంవత్సరాలనుండి ఋషులు, పండితులు జ్యోతిషశాస్త్రాన్ని పూజించుకొని వచ్చారు. విదేశాలలో కూడా ఈ జ్యోతిషశాస్త్రము విశేషాదరణ పొందినది. లగద మహర్షి, వశిష్టాది ఋషులు, పరాశర మహర్షి, వరాహమిరాచార్యులు మొదలైనవారు ఈ శాస్త్రానికి వెలుగునిచ్చారు.

పేద చక్షుః

మనపూర్వీకుల విషయంలో జ్యోతిషశాస్త్రం ప్రత్యక్షశాస్త్రం మరియు మనశ్శాస్త్రం. వారికీ మరియు వందలాది సంవత్సరాల వెనుకటి వారికి సహజీవనం మనకున్నంత కష్టతరముగా వుండేది కాదు. అప్పట్లో వారి ప్రధాన వృత్తి భూవ్యవసాయం మాత్రమే. వర్షం సకాలంలో కురవడం, పంటలు సంవృద్ధిగా పండడం తప్ప ఇంక దేనినీ ఆశించేవారు కాదు. దూరవాణి (Phone), దూరదర్శని (TV), అంతర్జాలము (Internet) మొదలైన సౌకర్యాలు లేనందున వారికి దూరప్రాంతాలలో వున్నవారితో, విదేశాలలో వున్నవారితో సంబందాలు వుండేవి కావు. ప్రజలందరూ పురాతన సాంప్రదాయాలతో జీవించేవారు. ప్రాచీనఆచారాలు, ప్రాచీనధర్మాలు, ప్రాచీనవ్యవస్థలు ఇవే వారికి సర్వస్వం. వాటితోనే తృప్తికరమైన జీవనాన్ని కొనసాగించేవారు. తాత, తండ్రి గడిపిన నెమ్మదియైన, ఆదర్శజీవనమే ప్రశస్థమని విశ్వసించేవారు. కావున ఇహసంసార జీవనము వారికి అతిభారముగా కనిపించేది కాదు. వారి మనస్సు ఎక్కువగా పారమార్తిక విషయాలపై లగ్నమై వుండేది. వారికి అప్పట్లో అవశ్యకత కలిగిన విషయం మోక్షం ఒక్కటే.

ఇప్పుటి జనుల సహజీవనంలో లౌఖిక సుఖమయమగు జీవితం. ఆహార–వస్త్రాదుల సంపాదన, ఉన్నత వుద్యోగావకాశాలు, దేహియని అర్థించడం, అప్పులు చేయడం, అధిక ధనార్జన కోసం రేయింబవళ్ళు అలుపెరగని శ్రమ, క్షణం కూడా తీరికలేని పోరాటం, ఆచారము లేకుండుట, తోటివారితో ఘర్షణ, వర్ణసాంకర్యము, అనగత్యమైన ధనవస్తు సంపాదన, దానికోసం అలుపెరుగని శ్రమ. నియమాల ఉల్లంఘన, నియమములేని ఆహారపు అలవాట్లు మొదలైన అనంత సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ అలుపెరగని సమస్యల మధ్య మోక్షవిచారమునకు తావేది? ఏరోజు సంసారభారం ఆరోజుకే సరిపోతోంది. ఇలాంటి సంధర్భములలో మానసికంగా నెమ్మదియైన జీవనము గడుపుటకు జ్యోతిషశాస్త్రము దారిచూపించగలదా? ప్రతిమనిషీ కోరుకునేది ఈ విధమైన ఉపకారాన్నే. ప్రస్తుతం మన నమ్మకము చెదరి గాలిలో పెట్టిన దీపమువలె కదులుతున్నది. జనులకు మనశ్శాంతి, నెమ్మది కావాలి. భవిషత్తు సందేహములతో ముడుపడియున్నది. దీనిని ఎదుర్కొనుటకు ధైర్యం, ఆత్మవిశ్వాసం కావాలి. వ్యక్తిజీవితములో ఇటువంటి ధైర్యం, వివేకం, శ్రద్ధా, ఆత్మవిశ్వాసము, కర్తవ్యమార్గము మొదలగు అంశాలు సంవృద్ధిచేయుటకు, సమస్యలను ఎదురించి జీవించుటకు ఈ మనోజ్యోతిర్విజ్ఞానశాస్త్రము దారిచూపించగలిగితే అది మనకు

కావాలసిన గ్రంథమే కదా!

మంగళాచరణ

కులదైవం శ్రీనివాసం జ్ఞానానందాది దేహినమ్।
కృపాళుం సర్వశాస్తారం సదా బ్రహ్మాది వందితమ్॥
లక్ష్మీపతిం సమానమ్య మధ్వాది గురువరానపి।
మనోజ్యోతిష్యవిజ్ఞానం సంగ్రహిష్యే యథామతి॥

గ్రంథప్రతిజ్ఞ

జ్యోతిషశాస్త్రముగురించి చాలామంది చాలారకాలైన పుస్తకాలు ప్రచురించారు. మరి ఈ మనోజ్యోతిషశాస్త్ర ప్రచురణలోని విశేషమేమిటి? అన్న ప్రశ్న చాలామందిలో ఉదయిస్తుంది. మంచిది! జ్యోతిషశాస్త్రము గురించి గ్రంథములకు కొరత ఏమియూ లేదు. లగద మహర్షి, వశిష్ట మహర్షి, పరాశర మహర్షి మొదలగు జ్ఞాన సంపన్నులు జ్యోతిషశాస్త్రమును మోక్షసోపానశాస్త్రముగా భావించి, పూజించి వాటియొక్క ప్రాముఖ్యతను లోకానికి చాటిచెప్పారు. ప్రస్తుతం అనేకమంది పండితులు వాటిపై శ్రద్ధవుంచి వాటి ప్రాచుర్యంలో పోషకాలుగా వందలకొద్ది గ్రంథాలు రచించారు. మనదేశంలోని భాషలోనే కాక ఇంగ్లీషు మొదలైన అన్య భాషలలో కూడా లెక్కకు మించినటువంటి పుస్తకాలు ప్రచురించబడ్డాయి ఇంకనూ ప్రచురింపబడుతున్నాయి. ఇలాంటి సంధర్భములో అలాంటి కొత్త ప్రభంధము యొక్క ఆవశ్యకత ఏమిటి?

1. జ్యోతిషశాస్త్రం గ్రహ, నక్షత్ర, రాశుల సహాయంతో సమస్యను అధ్యయనం చేయదగినది. దీనికి పూర్వభాగంగా మనిషి ఒనర్చిన ప్రాచీన కర్మలే సమస్యలకు కారణం అని కర్మసిద్ధాంతం ప్రభోదిస్తోంది. వైధీకవాఙ్మయములోని గరుడపురాణం, భగవద్గీత మరియు ఉపనిషత్తులు మొదలగు జ్ఞానశాస్త్రపురాణాదులు

కర్మసిద్ధాంతాన్ని దృవీకరిస్తున్నాయి. ఈలాంటి సంధర్భాలలో సమస్యలను అధిగమించుటకు భగవధారధనతో పాటు ధర్మాచరణ, సదాచారము, కర్తవ్యకర్మలను నిర్వర్థించడం అన్న విషయాలు ప్రధానాంశాలుగా పేర్కొనబడింది.

2. ఋషి–మునులు జ్యోతిషశాస్త్రాన్ని మనఃశ్శాస్త్రంగా, ప్రత్యక్షజీవనధర్మశాస్త్రంగా పరిగణించి మోక్షగమనమును తెలుసుకొనుటలో ప్రయోజనము పొందేవారు. దీనినే అప్పటిలో దివ్యదృష్టి అనికూడా వ్యవహరించేవారు. ప్రస్తుతం జనులు ఈ అత్యాదునిక కాలంలో లౌఖికసుఖ–భోగాలు తెలుసుకొనుటకు, అనగత్యమగు ధనము, కీర్తి, ప్రతిష్టలు పొందుటకు, శ్రమలేని ఫలితాలను ఆశించుటకు, ప్రారబ్ధకర్మలనుండి తప్పించుకొనుటకు, అదుపులేని కోరికలను–వాంచలను నెరవేర్చుకొనుటకు తగు మార్గాన్ని అన్వేషించుటకు ఈ జ్యోతిషశాస్త్రముయొక్క ప్రయోజం పొందుతున్నారు. లౌఖికభోగములనుద్దేశించి ప్రయోజనము పొందుటయే ప్రస్తుత కాలములోని జనుల అభిలాష. ఇలాంటి సంధర్భములో జనులకు సనాతన ధర్మాన్ని భోదిస్తూ, హితమార్గాన్ని తెలుపుతూ, ధైర్యాన్ని నింపుటయే ఈ ప్రబంధముయొక్క ముఖ్య ఉద్దేశం.

3. ప్రస్తుతం మనకు అందుబాటులోవున్న ప్రతి గ్రంథము విభిన్నమైన రీతులలో అర్థాన్ని వెల్లడిస్తున్నాయి. ఇలాంటి సంధర్భములో మానసిక సమస్యలను అధిగమించుటకు కావలసిన సామాన్య జ్ఞానాన్నిచ్చుటలో ఈ ప్రబంధము సహాయపడుతుంది అని చెప్పవచ్చును.

4. దేవ, గురు, ప్రాజ్ఞుల ద్వారా పొందిన జ్ఞానము, తలస్పర్శియైన విజ్ఞానము ఎల్లప్పుడూ తృప్తినిచ్చునని భగవద్గీతలోని ““జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః”” అను శ్లోకముద్వారా చెప్పబడినది. జ్ఞానమనగా గురుముఖాంతరముగా వినునది లేక పుస్తకము సహాయముతో తెలియునదని అర్థము. విజ్ఞానమనగా స్థలస్పర్శియైన అనుభవము. మనిషికి జ్ఞానంతో కూడిన విజ్ఞానం తృప్తినిస్తుందని(Contentment) తాత్పర్యం. భగవద్గీత, ఉపనిషత్–పురాణాలజ్ఞానంతో కూడిన జ్యోతిర్విజ్ఞానశాస్త్రము మనిషిజీవితంలో తృప్తిని, ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందన్న సత్యమే ప్రధానాంశంగా ఈ ప్రబంధరచనము

చేయబడినది.

6. భగవానుడు భగవద్గీతలో తెలిపిన షడ్విధులు అనగా పుట్టిన మనిషి తప్పనిసరిగా అధ్యయనం చేయవలసిన అధిభూతవిజ్ఞానం, అధ్యాత్మవిజ్ఞానం, అధిదైవవిజ్ఞానం, అధియజ్ఞవిజ్ఞానం, బ్రహ్మవిజ్ఞానం మరియు కర్మవిజ్ఞానమను ఆరు విజ్ఞానశాస్త్రాలు జ్యోతిషశాస్త్రంతో సంభదముకలవి. ఈ మనోజ్యోతిర్విజ్ఞానశాస్త్రంలో పైశాస్త్రాల విశేషాన్ని వివరించబడ్డాయి.

7. మనిషియొక్క మనస్సు, బుద్ధి, ఇంద్రియాల స్థితి గతులను తెలుసుకొనుటకు, ఆత్మస్వభావాన్ని మరియు ఇంద్రియాల పరస్పర సంభంధమును గుర్తించుటలో ఈ ప్రబంధము సహాయవడుతుంది.

8. అనేక జ్యోతిష్కుల పరస్పర భేదాభిప్రాయాలకులోనై సతమతమవుతున్నవారికి ప్రబంధము ద్వారా సామాన్యజ్ఞానము పొందుటకు తోడ్పడగలదు.

ఈ ప్రబంధములోని అంశాలన్నియూ గురు–శిష్యులమధ్య ఏర్పడిన సంభాషణారూపముగా రచించబడినది. ఈ రచనలోని సన్నివేశాలన్నియూ నా శిష్యులు అడిగిన ప్రశ్నలు దానికి నానుండి భగవంతుడు పలికించిన సమాధానాలు. ఈ ప్రబంధములో తెలిపిన ప్రశ్నలు ప్రస్తుత జనుల మనస్సులలో వున్నవే! ఈ ప్రబంధములోని సారాంశమంతయూ భగవద్గీత, ఉపనిషద్పురాణాలనుండి గ్రహించిన జ్ఞానాన్ని జ్యోతిషశాస్త్రమునకు అనుసంధానము చేయుట ద్వారా కలిగిన అనుభవపూర్వక సమాధానాలు. ఈ ప్రబంధము ఈనాటి యువతరానికి అర్థమగునట్లు ఉదాహరణలతో వివరించబడినది. సమగ్రజ్యోతిషశాస్త్ర అధ్యయనమునకు ఈ పుస్తకము ప్రయోజనకారికాజాలదు. జ్యోతిష్కుల పరిభాష మరియు వారు చెప్పిన ఫలమును అర్థంచేసుకొనుటకు కావలసిన సామాన్య జ్ఞానం ఈ పుస్తకమునందు పొందుపరచబడినది. అనుభవాలు పుస్తకాలద్వారా అర్థంచేసుకొనుట కష్టము. కావున సమగ్రజ్యోతిషాధ్యయనము గురుముఖాంతరముగానే అభ్యసించవలెనని గ్రహించవలెను. ఇందులోని

అంశాలన్నీ ఎవరినీ దూషించుటకుగాని, నిందించుటకు కాని వ్రాసినదికాదని మనవి. ఈ ప్రబంధములో తర్క-విమర్శలకు తావులేకుండా జ్ఞానప్రచారమే ప్రధానంగా భావించి భగవదనుగ్రహంతో రచింపబడిన గ్రంథం ఈ **మనోజ్యోతిర్విజ్ఞానశాస్త్రము.** భగవంతుడు నాకు ప్రసాధించిన ఈ చిన్నపాటి జ్ఞానంతో రచింపబడ్డ ఈ పుస్తకాన్ని సావధానచిత్తముతో చదవి, అర్థముచేసుకొని, సత్యాంశమునుగ్రహించి, సమాజాన్ని జాగృతపరచుటలో మీవంతుకృషిని ప్రదర్శిస్తారని ఆశిస్తూ...

ఇట్లు సజ్జనవిధేయుడు
జ్యోతిష్యాచార్య శ్రీకాంతాచార్య ధర్మవరం

1 ప్రశ్న. గురువుగారూ! జ్యోతిషశాస్త్రమునకు మూలం ఏది? మనకు ఈ శాస్త్రం ఎవరివలన ప్రాప్తించిందో తెలుపగలరు?

జ॥

యథా శిఖా మయూరాణాం నాగానాం మణయో యథా
తద్వద్వేదాంగశాస్త్రాణాం జ్యోతిషం మూర్ధని స్థితమ్ ।
శిక్షా వ్యాకరణం చందో నిరుక్తం జ్యోతిషం తథా
కల్పశ్చేతి షడంగాని వేదస్యాహుర్మనీషిణః ॥

తాత్పర్యం: నెమళ్ళకు పించము, నాగులకు మణి ముఖ్యమైనట్లుగా, వేదాంగములలో జ్యోతిషము అతి ప్రధానమైనది అని దీని అర్థం. శిక్ష, వ్యాకరణము, చందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము, అని వేదాంగములు ఆరు. వీనిలో జ్యోతిషము అతి ప్రధానమైనది జ్యోతిషము. ఇవి కాక ధనుర్వేదాది ఉపవేదములు ఉన్నాయి. దర్శపూర్ణమాసాది వేదవిహితమైన యాగములను ఎప్పుడుచేయవలెను? అన్న ప్రశ్న ఉదయించినప్పుడు అమావాస్యా పౌర్ణిమాసీ ఆయన ఋతుపక్ష నక్షత్రాదులను తెలుసుకొను అగత్యము ఏర్పడినది. దీనిని తెలుసుకొనుటకు లగద మహర్షి వలన 36 శ్లోకములతో వేదాంగజ్యోతిషము ఏర్పడినది. అందులో ఇప్పటి జ్యోతిషశాస్త్రమువలె నక్షత్రములు, గ్రహములయొక్క ప్రస్తావనము ఎక్కువగా కనపడదు. అందులో ఎక్కువగా సూర్యచంద్రాదుల ప్రస్తావన కనిపిస్తుంది తక్కిన గ్రహాల ప్రస్తావన ఎక్కడా కనిపించదు. వేదాంగజ్యోతిషము కాలానంతరమున అపారమైన ప్రాముఖ్యాన్ని సంపాదించుకొన్నది. మనదేశంలోనే కాకుండా పాశ్చాత్యదేశాలలో కూడా ప్రాముఖ్యతను సంపాదించుకొన్నది. ఖగోళంలోని విషయాలను తెలుసుకొను ప్రయత్నం ఎక్కువవుతుండడంతో సిద్ధాంతగ్రంథములు ఎక్కువగా ఆవిర్భవించినవి. వేదకాలంలోనే గ్రహాలగతికి మనిషియొక్క జీవనానికి సంబంధం వున్న విషయాన్ని జ్ఞానులు ధృవీకరించారు. చంద్రుడు మనస్సునకు కారకుడని జ్యోతిషం చెబుతుంది. మానసికరోగులకు చంద్రుడి వలన వృద్ధి–క్షయరూపమైన పౌర్ణమి–ఆమావాస్య దినములలో మనస్సు విపరీత–వికారములకు లోనుకావడం వైద్యశాస్త్రం గమనించినది. నేత్రకారకుడైన సూర్యుడిని సూర్యగ్రహణం రోజు చూస్తే నేత్రము హానికి లోనవుతుందని

సర్వసమ్మతము. ప్రయోగాత్మకమైన అనుభవాలవలన పై విషయాల గురించి కొన్ని లక్షల గ్రంథాలు రచనలు చేయబడ్డాయి. ఇప్పటికీ మనలో చాలామంది జ్యోతిషశాస్త్రంపై ఆపారమైన నమ్మకాన్ని కలిగి వున్నారు. ప్రతిసంవత్సరము వందలకొద్దీ గ్రంథాలు, పత్రికలు వేరువేరు భాషలలో అన్ని దేశాలలో ప్రచురించిబడుతున్నాయి.

చన్ద: పాదౌతు వేదస్య హస్త: కల్పోధ పఠ్యతే।
జ్యోతిషామయనం చక్షు: నిరుక్తం శ్రోత్రముచ్యతే॥
శిక్షా ఘ్రాణస్తు వేదస్య ముఖం వ్యాకరణం స్మృతమ్।
తస్మాత్సాంగమధీత్యేవ బ్రహ్మలోకే మహీయతే॥

వేదము అనే శరీరానికి చందస్సు పాదములు. ఎందుకనగా పాదముల మీద శరీరం నిలిచి ఉన్నట్లు చందస్సుల(మంత్రముల) మీద వేదం నిలిచి ఉన్నది. కల్పము అనునది క్రియాభాగం అందుకని కల్పము హస్తములు అన్నారు. జ్యోతిషం కన్నులు. ఉన్న విషయాలను స్పష్టంగా చూపునది జ్యోతిషం. నిరుక్తం చెవులు. శిక్ష నాసిక. ముఖం వ్యాకరణం. అన్ని అవయవములలోకి కన్నులు ఎలా ప్రధానమైనవో వేదభాగమునకు జ్యోతిష్యం అంత ప్రధానమైనది.

స్కంధత్రయాత్మకం జ్యోతిశ్శాస్త్రమేతత్ షడంగవత్ ।
గణితం సంహితా హోరా చేతి స్కంధత్రయం మతమ్ ॥

జ్యోతిషశాస్త్రం ముఖ్యంగా 3 విభాగాలు, అవి గణితం, సంహిత మరియు జ్యోతిషం. వీటినే స్కంధత్రయం అని పిలుస్తారు. ఖగోళంలోని గ్రహాలు, వాటి స్థితిగతులను తెలుసుకొనుటకు ఉపయోగపడే గణితం స్కందం. రాజ్యము, దేశముయొక్క పరిస్థితుల, వాతావరణ విశేషాలు, భూకంపము, ధరలు, సాముహిక శుభాశుభ విషయముల నిర్ధారణ గురించి, వృక్షాయుర్వేద, గజాశ్వాది చికిత్స, వాస్తు విషయములు మొదలైన అనేకవిషయాలను అధ్యయనం చేయడానికి సంహిత (Mundane Astrology)

తోడ్పడుతుంది. గ్రహ కారకత్వాలు, లగ్న-భావకారకత్వ విషయాల గురించి, మనిషియొక్క పూర్వకర్మ మరియు జీవనవిధానాన్ని అధ్యయనం చేయడానికి హోరశాస్త్రం అను తృతీయస్కందం ప్రాముఖ్యత గన్నది. నారదాది పలు మంది మహర్షులు జ్యోతిషశాస్త్ర ప్రవర్తకులని పేరెన్నిక గన్నారు. మహర్షులు సంహితహోరాదులను మొత్తాన్ని క్రోడీకరించి సిద్ధాంతము, సంహిత మరియు హోర ఈ మూడింటి గ్రంథరచనలు చేసి జో్యతిషశాస్త్రానికి గట్టి పునాధిని ఏర్పరచినవారు శ్రీపరాశరమహర్షి మరియు వరాహమిరాచార్యులు. కాలానంతరమున జ్యోతిషశాస్త్రం అతి తక్కువ కాలంలో అభివృద్ధి చెందినది. త్రిస్కందమనెడి జ్యోతిషశాస్త్రం షడంగాలుగా విస్తారము గాంచినది. ఇందులో జాతకం, గోళం, నిమిత్తం, ప్రశ్న, ముహూర్థం మరియు గణితం ఇలా 6 అంగములతో కూడిన జ్యోతిషశాస్త్రం అభివృద్ది చెందినది. ఇందులో గోళము మరియు గణితము సిద్ధాంత గ్రంథమనియు, జాతకము, నిమిత్తము, ప్రశ్న, ముహూర్థములు ఫలము చెప్పుటకు ఫలజ్యోతిషమనియు పరిగణించబడినది. ఇందులో జాతకము మరియు ముహూర్థము యొక్క విషయములు వేరుగావుండుటచే దీనిని విభిన్నశాస్త్రాలుగా పరిగణించారు. నిమిత్తశాస్త్రం ప్రశ్నశాస్త్రంలో అంతర్భావమాయెను. జ్యోతిషశాస్త్రము ప్రాంతాలవారిగా జనులయొక్క నమ్మకాలకనుగుణంగా రచింపబడ్డాయి. ఉదాహరణకు కేరళ మొదలగు ప్రాంతాలలో మరియు చిన్నచిన్న పల్లెటూళ్ళలో భూతగణారాధన అత్యంత భక్తినమ్మకములతో ఆచరించబడుతున్నది. ఇచ్చటి జ్యోతిషశాస్త్రం ఇచ్చట ఆరాధింపబడుతున్న భూతగణాలకు (గ్రామదేవతలకు) నవగ్రహాలకు మధ్య సంబందాన్ని కలుగజేసి, విస్తారంగా ప్రచార ప్రాముఖ్యతలు పొందుతున్నది. ఈ విదంగా జనుల నమ్మకాన్ని సంబందించి ఆయా ప్రదేశాలకు, ఊళ్ళకు జ్యోతిషగ్రంథాల రచనలు చేయబడుతున్నాయి.

2. గురువుగారు! అనాదికాలం నుండి ఇప్పటికీ మన భరతభూమియందు మరియు పాశ్చాత్య దేశములందు జ్యోతిషశాస్త్రమునకు విశేషాదరణ లభిస్తూనే ఉన్నది. మీనుండి జ్యోతిషశాస్త్రము యొక్క విశిష్టతను తెలియగోరుచున్నాను.

జ: జ్యోతిషశాస్త్రం అన్ని శాస్త్రాలకంటె అతి పురాతనమైనది. అనాధికాలంనుంచి ఈ శాస్త్రం వెలుగులో వున్నది. ఆధునిక జ్యోతిష్కులలో ఈ శాస్త్రం ఒక అదృష్టాన్ని తెలివే శాస్త్రమని, కేవలం గ్రహాల ప్రభాంవలనే

అదృష్ట–దురదృష్టాలు కలసివస్తున్నాయని అమితమైన నమ్మకం. ఆంగ్లములో దీనినే **Astrology** అని పిలుస్తారు. ఇది గ్రీకుపదం. **Astro** అనగా గ్రహాలు, నక్షత్రాలు, **logy** అనగా అధ్యయనం చేయడమన్నమాట. ఖగోళంలోని గ్రహాలను, వాటి చలనాలను అధ్యయనము చేయు గ్రహగణిత శాస్త్రమని భావన. మన పూర్వీకుల దృష్టిలో ***జ్యోతి*** అనగా "వెలుగు" ***ఈశ*** అనగా "భగవంతుడు". జ్యోతిషం అనగా భగవంతుడి వెలుగు(మార్గం). భగవంతుడి సృష్టి, స్థితి, లయ, కాలం, కర్మ, కర్మఫలం మొదలగు విషయాలను అవగాహనచేసుకోవడానికి ఉపయోగకరమైన అత్యద్భుతమైన శాస్త్రం ఈ "జ్యోతిషశాస్త్రం".

వేదస్య చక్షుః కిల శాస్త్రమేతత్ప్రధానతాంగేషు తతోఽన్య యుక్తా ।
అంగైర్యుతోఽన్యైరపి పూర్ణమూర్తిశ్చక్షుర్వినా కః పురుషత్వమేతి ॥

"కళ్ళులేనివాడు ఎలా పరిపూర్ణ మానవుడు కాలేడో, ఇతర అంగములకంటే కళ్ళకు ఎంత ప్రాధాన్యత కల్గినదో అలాగే జ్యోతిషశాస్త్రమూ కూడా వేదాలకు కళ్ళు అయినందున ఈ శాస్త్రానికి ఇతర శాస్త్రాలకంటే ప్రాధాన్యత ఎక్కువ కలదు అని అర్థము."

జ్యోతిషశాస్త్రం వేదాలకు కళ్ళవంటిది. మానవ శరీరానికి కళ్ళు ఎంత ప్రధానమో వేదాలలోని సారాన్ని అధ్యయనం చేయుటకు జ్యోతిషశాస్త్రం కళ్ళ వంటిది. మానవ శరీరంలో అన్ని అవయవాలు ఆరోగ్యవంతంగా వుండి కళ్ళు లెకపోతే ఏవిదమైన సమస్యను ఎదుర్కొంటామో అదేవిదంగా జ్యోతిషశాస్త్రం లేని వేదాధ్యయనం అపరిపూర్ణమైనది. వేదవాఙ్మయంలో జ్యోతిషశాస్త్రానికి విశిష్టమైన స్థానం వుంది. కాని ఆధునిక కాలంలో జ్యోతిషశాస్త్రం కేవలం ధనార్జనకోరకే అనట్టు వ్యవహరిస్తున్నారు ఆధునిక పండితులు. జ్యోతిషశాస్త్రం కేవలం లౌఖిక ప్రయోజనాలకు మాత్రమే కాకుండ కాలధర్మం, మానవధర్మం, శాంతి–సంతోష జీవనానికి ఎంతో తోడ్పడుతుంది.

3 ప్రశ్న: గురువుగారు! ఒకే జాతకాన్ని అనేకమంది జ్యోతిష్కులు పరిశీలించినప్పటికీ ఒకే విధమైనటువంటి ఫలము చెప్పకపోవుటకు గల కారణాలు ఏవి?

మనిషియొక్క స్వభావం, ఆలోచనా విధానము భిన్నమైనవి. ఒకరి మనస్సు అనుభవాలు, విషయాసక్తి వేరొకరితో సమానంగా ఉండదు. మనం ఒక గణిత విషయాన్ని తీసుకున్నట్లైయితే 9X2=18 అన్న గణితం సత్యం. అలాగే జాతక విషయాన్ని తీసుకున్నట్లుయితే ఒకే రకమైన గ్రహస్థితి ఏ రెండు జాతకాలలోనూ కనిపించినప్పటికీ అనుభవాలు, ఫలితాలు వేరవుతాయి. దీనికి కారణం జ్యోతిష్కుడిలోని ఆలోచనా విధానం, కర్మ సిద్ధాంతం. ప్రాచీనకాలంలో మహర్షులు, పండితులు ఒకే రకమైనటువంటి వాతావరణంలో విద్యను అభ్యసించేవారు. కావున వారి మనస్థత్వం మరియు ఆలోచనాదోరణి ఒకే విధంగా ఉండేది. కాని ఇప్పటి పరిస్థితి అలా లేదు. ప్రతి ఒక్కరు వేరు వేరు వాతావరణాలలో వేరు వేరు విషయాలలో విధ్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారు. జ్యోతిష్యాన్ని ప్రథమ కర్థవ్యవిద్యగా ఎవరూ అభ్యసించడం లేదు. వయసు మళ్ళిన వారు కాలక్షేపం కోసం, జాతకఫలాలు చెప్పడం వల్ల వచ్చు కీర్తి ధనానికోసం ఈ శాస్త్రాన్ని ఆధునిక ప్రమాణాలతో నేర్చుకుంటున్నారు. జ్యోతిషశాస్త్రంలోని గ్రహ, రాశి, నక్షత్రములను వాటి సంభందించిన విషయాలను మాత్రం అభ్యస్తిస్థున్నారు. వేద, ఉపనిషత్సారభూతమైన ధర్మాన్ని, కర్మసిద్ధాంతాన్ని, భగవంతుడియొక్క ఉనికిని, సదాచార విషయాలను, వర్ణాశ్రమధర్మాలతో కూడిన జ్యోతిషశాస్త్రాన్ని ప్రత్యేకంగా ఎవరూ అభ్యసించడం లేదు. ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసినది ఏమిటంటే జ్యోతిషశాస్త్రం ఆధునిక విజ్ఞానశాస్త్రం కాదు (Modern Science). ఎందుచేతనంటే ఆధునిక శాస్త్రానికి ముఖ్యమైనది సూత్రం (Formula). ఒకరు ఒక సూత్రాన్ని ప్రతిపాధించినట్లైతే ఆ సూత్రం ఎక్కడ ఎన్ని సార్లు ప్రయోగించినా ఒకే ఫలితం ఇవ్వాలి. ఇది ఆధునిక విషయాలకు వర్తిస్తుంది. ఉదాహరణకు $(a+b)^2 = a^2+2ab+b^2$ అను సూత్రం గణితశాస్త్రంలో ఏ సందర్భంలో ఎన్ని సార్లు ప్రయోగించినా ఫలం ఖచ్చితంగా ఒకేలాగ వస్తుంది. కాని జ్యోతిషశాస్త్రంలోని సూత్రాలు అందరికీ, అన్నికాలాలలో ఒకే లాగ వర్తించవు. ఒకేలాగ జాతకాలు ఉన్ననూ ఒకే తండ్రికి జన్మించినా ఒకే జీవనవిధానం వుండబోదు. స్వభావం, బుద్ధి, ఆలోచనాధోరణులలో వ్యత్యాసం కనిపిస్తుంది. ఇక వైధీక వృత్తిలో వున్న బ్రాహ్మణుడు, వైద్యుడు, న్యాయవాది మొదలగు అనేక

కర్తవ్యాలను నిర్వహించువారు జ్యోతిషశాస్త్రం నేర్చుకున్నట్లయితే వారి ఆలోచనా ధోరణికి అనుగుణంగా జ్యోతిషశాస్త్రంలోని సూత్రాలను ఉపయోగించడం మొదలుపెడతారు. కావున వారియొక్క జాతక విశ్లేషన భిన్నంగా ఉంటుంది. అందుకే ప్రాచీనులు జ్యోతిషశాస్త్రాన్ని ఒక పవిత్రమైన శాస్త్రంగా భావించి తమయొక్క ఉపాసనా బలంతో, దైవబలంతో ఫలాఫలాలను విశ్లేషించేవారు. కావున జ్యోతిషశాస్త్ర అధ్యయనానికి, అభ్యాసానికి, ఫల నిర్ధారణకు దైవబలం తోడవ్వాలి. దైవబలంతో మాత్రం జ్యోతిషశాస్త్ర ఫల నిర్ధారణ సాధ్యం.

4 ప్రశ్న. శిష్యుడు: గురువుగారు! చాలా సందర్భాలలో జ్యోతిషులు శని,కేతుదశలు మంచివికావు, గురుదశ మంచిది అని ఫలితాన్ని వ్యక్తపరుస్తూ పృచ్ఛకులను భయబ్రాంతు లను చేస్తుంటారు. ఇదులోని ఆంతర్యమేమిటి?

మంచిప్రశ్నచేసితివి శిష్యోత్తమా! ఇలాంటివి చాలా ప్రశ్నలు మనలో చాలా మందికి ఎదురవుతూ వుంటాయి. మరికొన్ని ప్రశ్నలు చూసినట్లైయితే గ్రహాలు కొందరికి శుభంగాను మరికొందరికి అశుభంగాని ఎందుకు ఫలాన్నిస్తున్నాయి? కొందరి జాతకాలు మాత్రమే గ్రహాలు బలంగా వుండడం లోని ఆంతర్యమేమిటి? దోషాలు ఎలా ఏర్పడతాయి? మనిషికీ మనిషికి మధ్య గ్రహబలాల తారతమ్యమేమిటి? ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ప్రశ్నలు ప్రతి ఒక్కరికీ ఉదయిస్తాయి. దీనికి సమాధానం కర్మసిద్ధాంత మాత్రమే వివరిస్తుంది. ప్రతి జీవునికి తాను ఒనర్చిన శుభ–పాప కర్మల ఆధారంగా, అనుగుణంగా సుఖ–ధుఃఖాదులు అనుభవించవలసి వుంటుంది. కలియుగ కాలధర్మం ప్రకారం గతజన్మలలో చేసిన పాపం ఈ జన్మలోను(ప్రస్తుత), ప్రస్తుతం చేస్తున్న శుభ–పాప క్రియలకు మరుజన్మలోను(రాబోవు జన్మలో) అనుభవించవలసి వుంటుంది. జీవుడు చేసిన మంచిపనులు మరుజన్మలో పుణ్యంగాను, చెడుపనులు పాపం(దోషం)గాను గుర్తించవచ్చు. కావున జీవుడు తాను చేసినటువంటి పుణ్య–పాపకర్మలను తానే అనుభవించవలసి వుంటుంది. ఈ శుభ–పాప కర్మలను తెలుసుకొను ఏకైక సాధనం జ్యోతిషశాస్త్రం. జ్యోతిషశాస్త్రం ముఖ్యంగా కాలం మరియు కర్మల ఆధారంగా పనిచేస్తుంది.

జాతకం = జీవుడి జనన కాలం + జీవుడి ప్రారబ్ద కర్మ.

ఇక గ్రహాల విషయానికి వస్తే, కాలాన్ని సూచించే సూచికలు వంటివి గ్రహాలు. మనము కాలాన్ని (Time) తెలుసుకోవడానికి గోడగడియారం, చేతిగడియారం ఉపయోగిస్తాం. గడియారంలోని సూచికల సహాయంతో గంటలు, నిమిషాలు, సెకెనులను గుర్తిస్తాం. అంటే గడియారంలోని సూచికలు కేవలం గంటలు, నిమిషాలు లాంటి కాల విలువలను తెలుసుకోవడానికి మాత్రం ఉపయోగపడుతుంది. కాని సమయానుగుణంగా చేయు పనులకు గడియారంలోని సూచికలు భాధ్యతవహించదు. ఇదేవిదంగా గ్రహాలు గడియారంలోని సూచకలలాగే రాశులలో సంచరిస్తూ కాలాన్ని తెలియజస్తాయి. గడియారంనందు కేవలం మనకు మూడు సూచికలు వుంటాయి(గంటలు, నిమిషాలు, సెకెనులు) కాని ఈ విశ్వగడియారంలో గ్రహాలైన రవి, చంద్రుడు, బుదుడు, శుక్రుడు, కుజుడు, గురువు, శని ఈ ఏడుసూచికలు మరియు రాహువు, కేతువు అను రెండు చాయాగ్రహాలు సూచికలుగా వ్యవహరిస్తాయి. ఈ గ్రహాలద్వారా సమయం మనకు మాత్రమే కాకుండా భూమితో సహ 3 లోకాలకు సమయాన్నందిస్తుంది. హోర (Hour), లగ్నం(2Hours), రోజులు, పక్షములు, మాసములు. ఋతువులు, ఆయనములు, సంవత్సరములు, యుగములు, మహాయుగములు, మన్వంతరములను ఈ విశ్వగడియారం సహాయంతో గుర్తించవచ్చు. గ్రహాలు సమయసూచికలుగా ఇక్కడ వ్యవహరిస్తాయి. జీవుడియొక్క సుఖదుఃఖాలకు గ్రహాలు కారణము కాదు, జీవుడు చేయు కర్మలకు గ్రహాలు ఎటువంటి భాధ్యత వహించరు. ఈ విషయాన్ని మనం గట్టిగా మననం చేసుకోవాలి. జీవుడుచేసిన పూర్వకర్మలే సుఖదుఃఖాలకు కారణములవుతున్నాయని జ్ఞానుల వచనం. ఈ విషయాన్ని తెలుసుకున్నట్లైతే మనకు గ్రహాలవిషయంలో తారతమ్యభేదాభిప్రాయాలుండవు, భయపడవలసిన అవసరం అంతకన్నావుండదు. ఇక దోషం విషయానుకొస్తే జన్మాంతరంలోకాని, పూర్వజన్మంలోకాని చేసిన పాపం జాతకంలో దోషంగా వ్యవహరిస్తుంది.

ఇక తారతమ్య విషయానికి వస్తే ప్రతి ఒకమనిషీ ఒకే రకమైన, ఒకే ప్రమాణం కలిగిన మంచిపనికాని చెడుపని కాని చేయలేడు కదా! ప్రతిఒక్కరూ చేసేపని పరస్పరం భిన్నంగా వుంటాయి. కావున వారివారి కర్మల ప్రమాణం బట్టి జాతకంలోని శుభ-అశుభ విషయాలపై బలాబలాలు కలిగి వుంటాయి.

5 ప్రశ్న: గురువుగారూ! ఇప్పటిదాకా గ్రహాలు కాలాన్ని తెలియజేసే సూచికలని తెలుసుకున్నాను. మరి ఈ గ్రహాలు సూచించే సమయానికి మన కర్మలకు గల సంబందమేమిటి?

మనం ఇంతవరకు మనిషి అనుభవిస్తున్న సుఖదుఃఖాలకు ప్రాచీనకర్మలే కారణమని, గ్రహాలు కేవలం సమయాన్ని మాత్రమే సూచిస్తాయని చెప్పుకున్నాం. జీవుడు చేసిన శుభ–పాప కర్మలను తెలుసుకొనుటకు, ప్రాయశ్చితాదులను చేసుకొనుటకు, అనుకూల–ప్రతికూల కాలాలను తెలుసుకొనుటకు, మోక్షసాధనకు భగవంతుడు ఇచ్చిన మార్గం జ్యోతిషశాస్త్రం. పై విషయాలను భగవంతుడు గ్రహాలకు తెలిపిన కారకత్వముల ఆధారంగా, గ్రహభలాలననుసరించి శుభ–పాప కర్మల తీవ్రతను గుర్తించవచ్చు.

ఒక విదంగా చెప్పలంటే బడిపిల్లలకు పాఠశాలయందు ఇచ్చు Progress Report లాంటిది ఈ జాతకం. పిల్లలయొక్క ప్రతిభను సంవత్సరాంతమున పరీక్షచేసి వారిప్రతిభకు గుర్తుగా ప్రతిభాధృవీకరణ పత్రాన్ని (Progress Report) పిల్లలకు అందజేస్తారు. ఆ Progress Report ఆధారంగా పై చదువులు మరియు ఉద్యోగావకాశాలు కల్పించబడతాయి. మంచి ప్రతిభకలిగిన విద్యార్థికి ఉనతవిద్యకు అవకాశం మరియు మంచిహోదాకలిగిన ఉద్యోగం వరిస్తుంది. ప్రతిభలేని విద్యార్థికి అవకాశాలులేక కష్టతరమైన జీవితాన్ని గడపవలసి వుంటుంది. అదే విదంగా సత్కర్మలను ఆచరిస్తూ, అందరిహితమునూ కోరుకొంటూ, ధర్మానికి అనుగుణంగా నడుచుకుంటూ, తల్లిదండ్రులను, గురువులను, వయసులో పెద్దవారిని గౌరవిస్తూ, తనకు నిర్దేశించిన కర్తవ్యాన్ని సకాలంలో నిజాయతీగా నెరవేరుస్తూ, దైవాన్ని నిత్యమూ ఆరాధించే మనిషికి ఎన్నిసార్లు భూమిమీద పుట్టినా గ్రహాలు శుభంగా వుండి దేశ, కాల, పరిస్థితులకనుగుణంగా అనుభవించవలసిన మంచి కాలాన్ని మరియు ఫలాన్ని సూచిస్తాయి. జాతకంకూడా Progress Report లాంటిదే. క్రితం జన్మలో కనభరచిన ప్రతిభకు ధృవీకరణపత్రం లాంటిది. దుష్కర్మలను ఆచరిస్తూ, వ్యక్తిగతమైన విషయాలకు ఎక్కువప్రాధాన్యత ఇస్తూ, పరులను పీడించడం, పెద్దలను ద్వేషించడం, శాస్త్రాలను, భగవంతుడిని దూషించే మనిషి తన ప్రతిభను కోల్పోయినట్టే. పాప ఫలాన్ని మరుజన్మలో అనుభవింపవలసి వుంటుంది. గ్రహలు వీటిని దోషాలుగా సూచిస్తాయి. అంటే క్రితం జన్మలో లేదా

జన్మాంతరములో నీవు ఈ చెడుపనులు చేసావు అని సూచిస్తాయే తప్ప ఆ గ్రహాలుకాని, భగవంతుడుకాని వాటికి భాధ్యతవహించడు. మనిషి చేయు మంచి–చెడు పనులకు సూచకాలుగా మాత్రం వ్యవహరిస్తారు. బృహజ్జాతకములోనూ వరామిరాచార్యులు ఇలా తెలిపారు.

కర్మార్జితం పూర్వభవే సదాది యత్తస్య పక్తిం సమభివ్యనక్తి॥

అనగా పూర్వజన్మలో మనము చేసిన శుభ–పాప–మిశ్రమ కర్మలయొక్క ఫలాన్ని వాటిని అనుభవించుకాలాన్ని గురించిన జ్ఞానాన్ని ఈ గ్రహాలు తెలియజేస్తాయి. చెట్టుతోపాటు కలుపుమొక్కలూ కూడా పెరిగి చెట్టుకు హాని కల్గించునట్లే అన్నిశాస్త్రాల విషయంలో కూడా కొన్ని హానికరమైన అంశాలు చేరి శాస్త్రానికి, సమాజానికి హానికరంగా మారుస్తున్నయి. దైవజ్ఞుడు భగవంతుడిచ్చిన విచక్షణా జ్ఞానంతో గ్రహించవలసి వుంటుంది.

6 వ ప్రశ్న: గురువుగారు! ఆధునిక కాలంలో జ్యోతిషశాస్త్రం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయగలరు?

అన్ని సంసార, వ్యవహారములను వదలి, అడవికిపోయి తపస్సులో నిమగ్నమై, ప్రాపంచిక విషయాలందు మమతానురాగలకు సదాకాలం దూరమై, ముక్తికోసం పరితపిస్తున్న సామాన్యఋషిమునులు సైతం జ్యోతిష్కుడు కనిపిస్తే అనేక విషయాలను తెలుసుకొనుటకు కుతూహలంకలిగివుంటారు. సంసారం జడమని ఉత్సాహంకోల్పోయిన సాదారణ మానవులకు, ఐహిక బోగాలకు అలవాటుపడి, యంత్రముల మధ్య తాము యంత్రములై, మానవత్వాన్ని, విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయిన వారికి ప్రతి చిన్న విషయంలోనూ సమస్యలేర్పడతాయి. తనయొక్క పని అనుకూలత–ప్రతికూలతల గురించి, తాను ఎంచుకొన్న మార్గాన్ని గురించి, దానియొక్క శుభాశుభఫలితాల గురించి, తాను ఎంచుకున్న మార్గంలో ఎదురుపడు సమస్యల గురించి, సమస్యలకు గురిచేయువారి గురించి, ధనార్జన, మనశ్శాంతి, భార్య, పిల్లలప్రాప్తి–అప్రాప్తి గురించి, అవి ప్రాప్తించు సమయం, సమస్యలకు గల కారణాలు, సమస్యల కారణంగా ఏర్పడిన పరిణామాలు, దాని నివారణకు చేయు మానవప్రయత్నం మరియు దైవప్రయత్నాలు, ఈ ప్రయత్నంలో ఇతరులు అందించు

సహకారం మరియు అసహకారము, వృత్తివిద్యాదులందు ప్రతికూలత, దైవికంగా నెరవర్చు కార్యానికి సంబంధించిన ఉపదేశాలు ఇలాంటి వందలాది సమస్యలు, సందేహాలు, ఒడిదుడుగులు జీవితంలో ప్రతిక్షణమూ ఎదురవుతుంటాయి. ఈ సమస్యలలో కొన్నింటిని తనయొక్క స్వంతబుద్ధితోనూ, మరికొన్ని జ్యోతిష్కుల పరిహారాలతో సమస్యలను దూరం చేసుకుంటుంటాడు. వేదాంగజ్యోతిషానంతరం వెలుగులోకివచ్చి అత్యంత ప్రాముఖ్యతను సంపాదించుకొన్న జ్యోతిషశాస్త్రం మానవుడికి ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొను ధైర్యాన్ని నింపగలుగుతోందనడంలో సందేహము లేదు. మనిషిలోవున్న నిరాశను నిర్మూలించి ఆత్మవిశ్వాసాన్ని పెంచగలుతోంది. మనిషియొక్క ఐహికసుఖశాంతుల గురించి వాటి అనుభవయోగ్యత, పరిణామల గురించి, సాధకుడి మోక్షసాధన మొదలగు విషయాలను వివరించగలుగుతోంది. ఈవిధంగా జ్యోతిషశాస్త్రం ప్రత్యక్షవిజ్ఞానశాస్త్రంగా ప్రముఖస్థానాన్ని, ప్రాముఖ్యాన్ని సంపాదించికున్నది.

మనిషియొక్క శరీరంలో కళ్ళకున్న స్థానం, ఆవశ్యకథ యెటువంటిదో అదేవిదంగా జ్యోతిషశాస్త్రం కూడా వేదాలలో చెప్పబడిన జ్ఞానాన్ని స్థలస్పర్శంగా తెలుసుకొని అనుభూతిచెందడానికి సహకరిస్తుంది(Exclusive Knowledge). అధ్యాత్మిక దృక్పదంతో వ్యవహరించబడే జ్యోతిషశాస్త్రం మనోవైజ్ఞానిక కోణంలో మన సమస్యలకు తగిన ఉపాయాన్ని చూపుతోంది. సమస్యల తీవ్రతను తగ్గించి వాటిని ధైర్యంగా ఎదుర్కొనుటకు కావలసిన ఆత్మవిశ్వాసాన్ని, సంకల్పాన్ని పెంపొందిస్తోంది.

ధర్మం (Set of Rules) అనగా మనిషి మానసికంగాను శారీరకంగాను శాశ్వతమైన సంతోషాన్ని, శాంతిని పొందుటకు ఏర్పరచుకున్న సరిహద్దులు, కట్టుబాట్లని చెప్పుకోవాలి. మన పూర్వీకులైన జ్ఞానులు తమయొక్క దివ్యశక్తితో ధర్మానికి గట్టి పునాదులువేశారు. మానవధర్మం, కాలధర్మం, ఆపద్ధర్మములకు అనుగుణంగా చెప్పబడిన సూచనలను దేశకాలపరిస్థితులకు అనుగుణంగా మనము నడుచుకొనగలిగితే మనిషికి ఎటువంటి సమస్యలు ఎదురుపడవు. పై తెలిపిన ధర్మాలకు విపరీతంగా నడుచుకొంటే సమస్యలు ఎదురై వాటి తీవ్రతకూడా అధికమగుటలో సందేహం లేదు. మన జ్యోతిషశాస్త్రం మరియు కర్మసిద్ధాంతం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మనిషిని జాగృతిగొలుపుతుంది. మనిషిచేసిన తప్పిదములను తెలియజేసి సరిదిద్దుకొనుటకు హితమైన మార్గాన్ని చూపుతుంది.

జ్యోతిషశాస్త్రం ముఖ్యంగా కాలంతో ముడిపడివుంటుంది. కాలం అనాది అనగా ఆది లేనిదని

అర్థం. కాలానికి అన్నివిషయాలు ముడిపడివుంటుంది. దీన్ని బట్టి చూస్తే జ్యోతిషశాస్త్రం అన్నిశాస్త్రాలకు, సృష్టిలోని సమస్థవిషయాలకు సంబంధం కలిగివున్నదని తెలుస్తుంది. అంటే జ్యోతిషశాస్త్రం ద్వారా మనం సమస్థవిషయాలను అధ్యనం చేయవచ్చు. ఈ జ్యోతిషశాస్త్రమే కృత, త్రేత, పూర్వయుగాలలో దివ్యదృష్టిగా జ్ఞానులకు కాలాన్ని, ధర్మకర్మ విచారాలను తెలుసుకొనుటకు తోడ్పడింది. ముఖ్యంగా మనిషియొక్క స్వభావాన్ని, మనస్సును, తన సాధనామార్గ విషయాలను తెలుసుకొనుటకు, తాను భూమిపైకి ఎందుకువచ్చాడన్న కర్తవ్యాన్ని తెలుసుకొనుటకు, తన ప్రవృత్తిని తెలుసుకొనుటకు, వేదంలోని సారాన్ని, ధర్మశాస్త్ర సందేశాలను అనుభూతిచెందడానికి, దేశ, కాల, పరిస్థుతులకనుగుణంగా సత్కర్మలను వొనర్చుటకు, దుష్కర్మలను తెలుసుకొని ప్రాయశ్చితం చేసుకొనుటకు జ్యోతిషశాస్త్రం అన్నిశాస్త్రాలకన్నా ఎక్కువగా తోడ్పడుతుంది.

7 ప్రశ్న: గురువుగారు! చాలాచోట్ల జ్యోతిషశాస్త్రం మనశ్శాస్త్రంగా, విజ్ఞానశాస్త్రంగా వివరించబడినది. దీని ఆంతర్యమేమిటి?

హిందూ వైదికవిజ్ఞానశాస్త్రాలు అతిప్రాచీనమైనవి. అవి ఋషులు, గురువులు, మునులు అధ్యాత్మిక చింతన ద్వారా వెలుగులోకి వచ్చి సృష్టిమొదలగు కాలధర్మాలను తెలిపే అత్యద్భుతమైనశాస్త్రములుగా పేరుప్రఖ్యాతలు గాంచినవి. వైదిక విజ్ఞానశాస్త్రాలన్నికూడా జీవుడియొక్క మానసికస్థితిని ప్రభావితంచేస్తాయి. వైదికవిజ్ఞానశాస్త్రాన్ని ౬ విభాగాలుగా విభజించారు. జీవుడికి అధ్యాత్మిక సంబంధాన్ని, కాలస్వరూపాన్ని, భగవంతుడి సర్వోత్తమత్వాన్ని తెలుపడంలో ఈ **6** ప్రసిద్ధిగాంచినవి.

1. **అదిభూతవిజ్ఞానం**
2. **అధ్యాత్మవిజ్ఞానం**
3. **అధిదైవవిజ్ఞానం**
4. **అదియజ్ఞవిజ్ఞానం**
5. **బ్రహ్మావిజ్ఞానం**
6. **కర్మవిజ్ఞానం**

1. అదిభూతవిజ్ఞానం (Material Science)

అదిభూతవిజ్ఞానమనగా పాంచభూతముల యొక్క కలయికతో/మిశ్రమం తో (భూమి, నీరు, వాయు, అగ్ని, ఆకాశం) ఏర్పడిన జడ, చేతనపదార్థాల సముదాయం. అధిభూతవిజ్ఞానం ద్వారా జడ, చేతన వస్తువుల యొక్క భౌతికలక్షణాలను తెలుసుకొనవచ్చు. ఉదాహరణకు మానవశరీరాన్ని తీసుకొన్నట్లైతే చర్మం, మాంసపు ముద్ద, ఎముకలు ఇవన్ని కూడా పృథ్వీ(భూమి)తత్వం యొక్క ప్రమాణంతో ఏర్పడినది. రక్తం జలతత్వ పధార్థాలచే ఏర్పడినది. మనం పీల్చుకొనే గాలి వాయుతత్వాన్ని కలిగియుంటుంది. మన శరీరంలోని ఉష్ణం అగ్నితత్వాన్ని కలిగియుంటుంది. మన శరీరంలోని ఖాళీప్రదేశం అనగా మనము పీల్చుకొనే గాలి స్వేచ్ఛగా ప్రయాణించడానికి కావలసిన ప్రదేశం ఆకాశతత్వాన్ని కలిగియుంటుంది. మనయొక్క శరీరాన్ని నిశితంగా పరిశీలించి చూసినట్లైతే పంచతత్వాలుకలిగిన (అగ్ని, జలం, గాలి, భూమి మరియు ఆకాశతత్వాలు) ఈ శరీరంలో జీవుడు వున్నంతకాలం (బతికివున్నంతకాలం) కలసికట్టుగా వుంటుంది. దీనినే వ్యావహారిక భాషలో ఐదు ఒకటి అవడం అని అంటాం . అదేవిదంగా జీవుడు ఈ శరీరాన్ని విడిచిపెట్టి వెళ్ళినప్పుడు శ్వాసప్రక్రియ ఆగిపోతుంది. అనగా శ్వాసించేగాలి వాయువులో కలసిపోతుంది. మనశరీరంలో వున్న వేడి (అగ్నితత్వం) బయటి వాతావరణంలో కలసిపోయి శరీరం చల్లబడుతుంది. శరీరంచల్లబడగానే జలతత్వమైన రక్తం ఘనీభవిస్తుంది(గడ్డగట్టుతుంది). శరీరంలోని ఖాళీ అంతా (మూసుకుపోతుంది) ఆకాశతత్వంలో కలసిపోతుంది. కాలక్రమేణా భౌతికశరీరం మట్టిలో కలసిపోతుంది. దీనినే పంచత్వాన్ని పొందడం లేదా మరణం అంటాం అనగా శరీరం పంచభూతాలలో కలసిపోతుంది.

అదేవిదంగా సృష్టిలో భౌతికంగా ఏర్పడ్డ (పుట్టిన) ప్రతియొక్క జడ, జీవ పధార్థాలు కాలానుగుణంగా గతించి పంచభూతాలలో కలవక తప్పదు. ఇదే సృష్టి ధర్మం. ఈ విషయాల గురించి తెలుపునదే భౌతిక విజ్ఞాన శాస్త్రం. దీనిని ఆధారంగా చేసుకొని పైద్యశాస్త్రం (ఆయుర్వేదం, యోగా..మొ.వి) అధ్యయనం చేయవచ్చు.

2. అధ్యాత్మవిజ్ఞానం (Metha Physics)

అధ్యాత్మవిజ్ఞానమనగా జీవుడి భౌతిక శరీరాన్నిప్రభావితంచేసే ఆత్మ, మనస్సు, బుద్ధి, జ్ఞానం, చిత్తం మొ॥ విషయాలనుఅధ్యయనంచేయడం. సమాజం నందు వ్యక్తిని గుర్తించడానికి ముఖ్యంగా మనిషి శరీరానికే ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది. కాని శరీరం జడం. సూక్ష్మంగా ఆలోచించినట్లైతే మృతశరీరముకూడా ఒక శరీరమే కాని అందులో మనిషిని ఎవరూ గుర్తించరు. కావున మనస్సు, బుద్ధి అత్యంతముఖ్యమైన వస్తువులుగా మనం గ్రహించాలి. ఇచ్చట మనస్సు అనేది కూడా ఒక అనీఎ–ఎబీబింఫ లాంటిది. దానికి స్వయంగా అలోచించే శక్తిలేదు. ఉదాహరణకు మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు చదువుకొనే పాఠాలలో కళ్ళు చూస్తుంది అన్న విషయాన్ని చదువుకున్నాం. కాని చదువు, జ్ఞానం, వయస్సు పెరిగినకొద్దీ అందులో మర్మం మారుతుంది. అంటే పెద్దయ్యాక నేను చూస్తున్నాను, కళ్ళసహాయంతో చూస్తున్నాను అని జ్ఞానంలో పరివర్తన ఏర్పడుతుంది. అదేవిదంగా మనం కళ్ళసహాయంతో చూస్తాము, చెవుల సహాయంతో వింటాము, మనస్సు సహాయంతో ఆలోచిస్తామన్నమాట. అంటే మనస్సే ఆలోచించదు, మనస్సు సహాయంతో ఆలోచిస్తాము. ఇక్కడ మనస్సు, బుద్ధికూడా ఒక వస్తువువలె వ్యవహరిస్తుంది. ముఖ్యంగా కాలానుగుణంగా శరీరం మార్పు చెందినా, మనస్సుయొక్క ఆలోచనా పరిజ్ఞానం అభివృద్ధి చెందినా, బుద్ధి కుశలతలో నేర్పరి అయినా నేను అన్న పదం ఎక్కడా మారదు. మనం ఎన్ని జన్మలెత్తినా, ఏ జన్మలో వున్న ఈ నేను అన్న పదం శాశ్వతంగా వుంటుంది. ఇదే ఆత్మయొక్క స్వభావమని గుర్తించాలి.. మనిషి అతనియొక్క స్వభావం, వైఖరి, సమయసంధర్భాలని బట్టి ఏవిదంగా అలోచిస్తాడు ఈ విషయాలను మనం ఈ యొక్క అధ్యాత్మశాస్త్రం ద్వారా అధ్యయనం చేయవచ్చు

3. అదిధైవవిజ్ఞానం

జీవుడియొక్క భౌతిక శరీరం, మనస్సు, బుద్ధి మొదలైన ప్రతి ఇంద్రియాలను దైవశక్తి ఆధీనంలో పనిచేస్తాయని తెలుసుకోవడం అదిదైవ విజ్ఞానంలోని స్వారస్యం. జీవుడి యొక్క మనస్సు, బుద్ధి, ఆత్మ అన్నీకూడా స్వయంగా తమ కార్యాలను నిర్వర్తించలేవు. ఉదాహరణకు మనకళ్ళు ఎంత ఆరోగ్యంగా ఉన్నా చీకటిలో కనిపించదు. వెలుగులేని చోట కళ్ళకు పని వుండదు. ఇక్కడ కళ్ళు పనిచేయాలంటే

వెలుగు కావాలి. వెలుగుని అందించే దైవశక్తులలో సూర్యుడు అతి ముఖ్యమైన వాడు. సూర్యుడు వెలుగును ప్రసరింపజేస్తే, ఆ వెలుగు సహాయంతో కళ్ళు వస్తువులను చూడగలుగుతుంది. అనగా కళ్ళను ప్రాభవితంచేసే దైవశక్తి సూర్యుడు. అదేవిదంగా చెవులకు ? చంద్రుడు, ముక్కు – అశ్వినిదేవతలు, నాలుక ? వరుణుడు, జీర్ణక్రియ ? అగ్ని, చేతులు ? ఇంద్రుడు, కాళ్ళు ? శని...ఈ విదంగా ప్రతి ఒక్క ఇంద్రియాన్ని నియంత్రించు దేవతాశక్తిని గురించి అధ్యనంచేయు శాస్త్రం అధి–దైవ విజ్ఞానం.

4. అధియజ్ఞవిజ్ఞానం

అది–దైవ విజ్ఞానం నందు మనం జీవుడియొక్క ప్రతి ఒక్క ఇంద్రియభాగాలను నియంత్రింపగల దేవతాశక్తిని గురించి తెలుసుకున్నాం. ఆ దేవతాశక్తి ఎవరి ఆజ్ఞతో పనిచేస్తుందని తెలుసుకోవడం అదియజ్ఞవిజ్ఞానం. ఉదాహరణకు కళ్ళకు కారకుడు సూర్యుడు, చేతులకు కారకుడు ఇంద్రుడు, కాళ్ళకు శని మనకు కళ్లలో ఏదైనా దూళిపడిందనుకుందా వెంటనే చేతులతో మూసివేస్తాం, కాళ్ళకు ముల్లు గుచ్చుకుందనుకోండి వెంటనే చేతులు ముల్లుని తీయడానికి ప్రయత్నిస్తుంది. ఇందులో జాగ్రత్తగా పరిశీలిస్తే కళ్ళకు కారకుడైన సూర్యుడికి–చేతులకు కారకుడైన ఇంద్రుడికి మధ్య ఎంత సమస్వయం. ఇలా సమన్వయంచేయడానికి మూలకారకుడు భగవంతుడు. భగవంతుడి గురించి అధ్యయం చేసే విజ్ఞాన శాస్త్రం అధియజ్ఞవిజ్ఞానం.

5. బ్రహ్మవిజ్ఞానం

జీవుడియొక్క భౌతికశరీరాన్ని, అధ్యాత్మిక ప్రయాణాన్ని ప్రభావితంచేసే భగవంతుడే సృష్టిలోని సమస్త జీవ, జడ పదార్థాలను ప్రభావితం చేస్తున్నాడని తెలుసుకోవడం. మనలోని ఇంద్రియాలను నియంత్రించే తాత్వికదేవతాశక్తిని కూడా నియంత్రించే శక్తిగల భగవంతుడు ఈ సృష్టిలోని సమస్థ జీవులను, ప్రాణులను, వస్తువులను స్వతంత్రంగా నియంత్రించగలుగుతున్నాడని తెలిపే శాస్త్రం బ్రహ్మవిజ్ఞానం. ఇందులో భగంతుడియొక్క పరమార్థతత్వాన్ని, సర్వతంత్రస్వాతంత్రత్వాన్ని,సర్వోత్తమత్వాన్ని అధ్యయనం చేయడం తెలుపుతుంది.

6. కర్మవిజ్ఞానం

ఇంతవరకు పైచూసిన అన్ని విజ్ఞానశాస్త్రాల ఆధారంగా మన భౌతిక శరీరాన్ని నియంత్రించగల ఇంద్రియాలు, ఇంద్రియాలను నియంత్రింపగలిగే దేవతాశక్తి, దేవతాశక్తిని సైతం నియంత్రింపగలిగే భగవంతుని స్వతంత్ర ఇచ్ఛాపూరితమైనక్రియ, అతనియొక్క ఉనికి తెలుసుకున్నాం. ఇప్పుడు మనకు ఉదయించే ప్రశ్న ఏమిటంటే భగవంతుడు మరియు దేవతాశక్తులు మనల్ని ఎందుకు నియంత్రింపజేస్తున్నారు. దీనికి కారణం అనాది కర్మ. జీవుడియొక్క పుణ్య-పాప కర్మలనాధారంగా జీవుడిపై నియంత్రణ ఉంటుంది. దీనికి ఒక చక్కటి ఉదాహరణ చూద్దాం. ఒక ఏనుగు కర్నూలునుండి హైదరాబాద్ మార్గం గుండా హైదరాబాద్ దిశగా కాలినడకన ప్రయాణిస్తున్నదని అనుకుందాం. ఆ ఏనుగు మీద పది చీమలు ఏనుగుపై నడుచుకుంటూ హైదరాబాద్ దిశగా ప్రయాణిస్తున్నాయి. ఇప్పుడు హైదరాబాద్ వచ్చిందనుకుందాం! ఎవరి నడకవల్ల హైదరాబాద్ వచ్చింది? ఏనుగునడకవల్ల హైదరాబాద్ వచ్చిందిగాను చీమల నడకవల్ల కాదు. చీమలు ఏనుగుపై తమ దిశమార్చినా అనగా కర్నూలు దిశగా ఏనుగుపై ప్రయాణించినా ఏనుగు వెళ్లిన దిశకే చీమలు చేరుకుంటాయి. అట్లే ఏనుగు కాలచక్రం లాంటిది. మనం కాలచక్రంలో ఇరుక్కున్న చీమలవంటివారం. కాలచక్ర దిశ ఏవిధంగా వుంటుందో మన గమ్యం కూడా అటూపైపే. మనం దిశమార్చి చీమలలాగా మొండికేసినా కాలచక్రం ఏదిశగా ప్రయాణిస్తుందో అదే మన గమ్యస్థానం అవుతుంది. ఈ పరమార్థాన్ని తెలుసుకోవడమే కర్మవిజ్ఞానంయొక్క ముఖ్య ఉద్దేశం.

జ్యోతిషశాస్త్రం ఈ ఆరు విజ్ఞానశాస్త్రాల ఆధారంగా, అనుసందించి పనిచేస్తుంది. కావున జీవుడియొక్క కర్మవిషయాల దగ్గరనుండి భౌతిక శరీరంతో అనుభవించు సుఖదుఃఖాలవరకు మనము అన్ని విషయాలను అధ్యయనం చేయవచ్చు అనగా జ్యోతిషశాస్త్రం సమస్థ శాస్త్రాల అధ్యయనంతో ముడిపడి ఉన్న గొప్ప విజ్ఞానశాస్త్రం ఇది. అందుకే జ్యోతిషశాస్త్రాన్ని **ప్రత్యక్షం జ్యోతిషం శాస్త్రం"** అన్నారు. జ్యోతిషశాస్త్రం ఆధారంగా అధ్యాత్మిక కోణంలో అధ్యయనం చేయగలిగితే భగవంతుడి ఉనికిని, పరమార్థతత్వాన్ని, జీవుడి భాద్యతలను తెలుసుకొని మోక్షసాధన దిశగా ప్రయాణించవచ్చు.

8. జీవుడియొక్క సుఖ–దుఃఖ తారతమ్యములకు కారణమేమిటి?

మనిషియొక్క సుఖ–దుఃఖాలకు పూర్వకర్మయే కారణం. కర్మానుసారముగా శరీరాన్ని, బంధాన్ని జీవుడు పొందుతున్నాడు. శుభకర్మలు చేసినయెడల శుభఫలాన్ని, పాపకర్మలద్వారా చెడు ఫలాన్ని అనుభవిస్తున్నాడు. ఈ పుణ్య–పాప కర్మల నిష్పత్తి మనిషి–మనిషిలో వ్యత్యాసం వుంటుంది. ఈ జన్మలో సుఖ–సంతోషములతో తూగుతున్నవాడు క్రితం జన్మలో పుణ్యకార్యాలను చేశాడనియు, ధరిద్రం అనుభవిస్తున్న వాడు పాపం చేశాడనియు శాస్త్రప్రకారంగా తెలియవలెను. మానసిక సమస్యలకు కూడా ఇదే విధమైన సంభంధం కలిగి వుంటుంది. ఈ శుభాశుభ కర్మలనే మనం జాతకం ద్వారా పరిశీలించి తెలుసుకోవచ్చు. మనకు పాఠశాలలో సంవత్సరా ంతమున ఇచ్చు ప్రథిభా పత్రమన్న మాట ఈ జాతకం (ఖఎనీణఎంబబ ఖీంఎనీఎబి). జాతకంలోని గ్రహాలు జీవుడు చేసిన పూర్వ–కర్మలను, ప్రస్తుత జన్మలో అనుభవించవలసిన శేషఫలాన్ని తెలియజేస్తుంది. పరిశీలిస్తే అందరి జాతకాలు ఒకేలా వుండవు కాదా? అలాగే ప్రతి ఒక్కరి కర్మ కూడా వేరు వేరు నిష్పత్తులలో తారతమ్యం కలిగివుంటాయి.

౯. జీవుడియొక్క శుభ–పాప కర్మలకు కారణం గ్రహమా లేక దైవమా?

మనలో వాడుకలో వున్న నానుడి శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు , భగవంతుడే అన్ని విషయాలకు కారణం. ఇలా వల్లిస్తూ పోతే అనేక విషయాలు, ప్రశ్నలు తలెత్తుతాయి. మనము చేసే శుభాశుభకర్మలకు ఎవరు భాద్యులు. మనవు చేసే మంచిపని మరియు చెడువని ఎవరి ప్రేరణతో, ఎవరి అధీనంలో, ఎవరి ప్రోత్సాహంతో జరుగుతున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలి.

ప్రకృతిలో జరుగు సమస్త వ్యాపారాలు భగవంతుడి శక్తి, ప్రేరణతో జరుగుతున్నాయని వేదోపనిషతులు చెప్తున్నాయి. కావున భగవంతుడు సర్వతంత్రస్వతంత్రుడనడంలో సందేహం లేదు. కాని ఇక్కడ మనకు ఇంకొక ప్రశ్న ఉదయిస్తుంది. అదేమిటంటే. మనల్ని సమస్త ప్రకృతిని సృష్టించిన భగవంతుడు మనచేత మంచిపనులు మాత్రమే చేయించవచ్చుకదా? మనచేత చెడుపనులు ఎందుకు చేయిస్తున్నాడు? చెడుపనులు చేసినందుకు శిక్ష యెందుకు విధిస్తున్నాడు? ఇలాంటి వందలాది ప్రశ్నలు ఉదయిస్తాయి. దీనిని తెలుసుకోవాలంటే ఈ క్రింది ఉదాహరణలు చూడాలి.

ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడు పిల్లలందరికీ ఒకే రకమైన పఠ్యాంశాన్ని భోదించినా కొంతమంది విధ్యార్థులు మాత్రమే విషయాన్ని గ్రహించి ప్రతిభను పొందుతారు. మరికొంత మంది అర్థంకాక తలపట్టుకుంటారు. ఇక్కడ గమనించినట్లైతే విద్యార్థి తన స్వంత దోషం వలన ప్రతిభను పొందలేక పోవడం జరుగుతుంది. ప్రతిభకనబరచడానికి, కనబరచకపోవడానికి ఉపాధ్యాయుడు కారణం కాడు. అతడు అందరికీ ఒకే లాగ పాఠాలు బాగా చెప్పినా కొంతమంది మాత్రమే ఉత్తీర్ణత పొందుతారు. ఇక్కడ ఇంకొక ప్రశ్న ఉదయిస్తుంది. ప్రతిభ కనబరచడానికి కనభరచకపోవడానికి కూడా దైవమే కారణము కదా? భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఈ ప్రశ్నకు స్పష్టంగా సమాధానాన్ని అందించాడు.

న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।
న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥

"నేను ఎవరిచే ఏవిదమైన కర్మలను చేయించను, ఎవరి కర్మఫలమునకు నేను కారకుడిని కాదు. వారి వారి స్వభావానుసారముగా కర్మలు జరుగుచున్నవి"."

– శ్రీకృష్ణ భగవానుడు

పై తాత్పర్యం ఆధారంగా చూస్తే మనిషియొక్క స్వభావానుసారంగా కర్మలు జరుగుతాయి. మనిషికి ఈ స్వభావం భగవంతుడు ఇచ్చినది కాదు. ఆత్మస్వభావం అనాది. మంచి స్వభావము కలిగిన వాడు మంచి కర్మలను, చెడు స్వభావము కలిగినవాడు చెడు కర్మలను చేస్తాడు. ఈ కర్మలు అతిక్రమించి జనులకు హాని కలుగకుండా భగవంతుడు ముఖ్యపాత్ర పోషిస్తాడు. మనిషియొక్క వికృత చేష్టలతో ధర్మము లోపించినపుడు భగవంతుడే అవతరించి ధర్మాన్ని సంరక్షిస్తాడు.

ఉదాహరణకు ఒక తోటమాలిని గమనించినట్లైతే అతడు తన తోటలోని అన్ని రకములైన చెట్లకు ఒకే రకమైనటువంటి నీటిని, ఎరువులను వేస్తాడు. కాని స్వభావానుసారముగా చెట్లు ఫలాన్నిస్తాయి. మామిడిపండుకు తీపి స్వభావము కలిగివుంటుంది, మిరపకాయకు కారపు స్వభావము కలిగి వుంటుంది, చింతపండుకు పుల్లని స్వభావము కలిగివుంటుంది. మామిడిపండుకు తోటమాలి కారము కలిగిన

నీటిని వేసినా అది తియ్యటి ఫలాన్నే ఇస్తుంది. ఇచ్చట తోటమాలి పాత్ర ఏమిటి? తోటమాలి విత్తనాలను భూమిలో నాటి మొలకెత్తుటకు కారణమయ్యాడు. ఒకవేళ విత్తనము నాటకున్నచో ఆ విత్తనము విత్తనమువలె వుండి వృధా అయ్యేది. విత్తనముయొక్క స్వభావము వ్యక్తమయ్యేదు కాదు.

అదే విధంగా భగవంతుడు జీవుడు అనే విత్తనాన్ని సృష్టికి తెచ్చి ఆ జీవియొక్క స్వభావము వ్యక్తమగుటకు, ఫలాన్ని అనుభవించుటకు కారణమయ్యాడు. భగవంతుడు అందరికీ ఒకేవిధమైన బుద్ధిని, మనస్సును ఇచ్చినప్పటికీ జీవుడు తన స్వభావానుసారముగా వాటిని ఉపయోగించి కర్మలు చేస్తాడు. వాటికి భగవంతుడు కారణము కాడు. భగవంతుడు ఎవరి చేత శుభ–పాప కర్మలను చేయించడు అన్న సత్యాన్ని గ్రహించాలి.

10. గురువుగారు! జ్యోతిష్కుడికి లేదా జ్యోతిషశాస్త్రమును అభ్యసించదలచినవారికి ఉండవలసిన లక్షణములు ఏమిటో వివరించగలరు.

జీవుడి సమస్యలను శాస్త్రశ్రద్ధతో జ్యోతిషశాస్త్రాన్ని అనుసరించి లౌకిక విచక్షణ, వివేక ప్రజ్ఞతో బుద్ధిని ఉపయోగించి హితమైన మార్గాన్ని చూపించగలిగేవాడు నిజమైన జ్యోతిష్కుడు. వేదకాలమునుండి 18 సంఖ్యకు చాలా ప్రాముఖ్యత కలిగినది. దీనినే సంఖ్యాశాస్త్రము ప్రకారము 'జయం'"అని పిలుస్తారు, అంటే అన్ని విషయాలలోనూ "జయం అన్నమాట. మహాభారతమునకు వేదవ్యాసులవారు పెట్టినపేరు జయోనామక ఇతిహాసోయమ్". మనం పరిశీలించినట్లైతే మహాభారతంలోని పర్వాలు 18, రామాయణంలోని కాండలు 18, భగవద్గీతలోని అధ్యాయాలు 18, ప్రధానమైన పురాణాలు 18, ఉపపురాణలు 18, కురుక్షేత్రంలో పాల్గొన్న సైనికుల సంఖ్య 18 హక్షోయిణి, కురుక్షేత్ర సంగ్రామం 18 రోజులు జరిగినది. 18 వున్నచోట జయం కలిగినది. అనగా ధర్మానికి జయం. ధర్మానికి కట్టుబడినవారికి, ఆచరించువారికి జయమని దీనె అర్థం. ఇక్కడ కూడా ధర్మానికి కట్టుబడి జ్యోతిషశాస్త్రాన్ని అధ్యయనం చేయువారికి జయం కలగాలంటే ఈ క్రింద తెలిపిన 18 లక్షణాలు కలిగి వుండాలి.

1. సమస్యలతో సతమతమవుతున్నవారికి హితమార్గము చూపగల జ్యోతిష్కుడు ధర్మాధర్మములు తెలిసి వుండాలి. శాస్త్రశ్రద్ధకు లోబడిన స్వంతబుద్ధితో, విచక్షణా జ్ఞానంతో ఏధి ధర్మం-ఏధి అధర్మం, న్యాయాన్యాయాలు, సుఖదుఃఖాలు మొదలగు అంశాలలో తలస్పర్శియైన అనుభవాన్ని కలిగివుండాలి. పై విషయాలను బాగా తెలిసినవాడు శాస్త్రానికి, కాలానికి, దైవానికి లోబడి సహాయ సహకారాలనందించి భగవంతుడు తనకు నిర్దేశించిన దైవ కార్యాన్ని శ్రద్ధతో నెరవేర్చగలడు.

2. గురువుయొక్క అనుగ్రహంతో అభ్యసించిన శాస్త్రజ్ఞానం మరియు వ్యావహారిక విజ్ఞానం కలిగివుండాలి. జ్ఞానమనగా చదువుట ద్వారా, సత్పురుషులు చెప్పిన విషయాన్ని వినుటద్వారా కలుగు అనుభవం. విజ్ఞానమనగా తలస్పర్శియైన, ప్రత్యక్షమైన అనుభూతి. తాను చదివి, విన్న దానిని తన అంతరంగంలోని అనుభవాలతో కలసిన అనుభూతి (Exclusive Knowledge). జ్ఞాన-విజ్ఞానము కలిగినవాడి తృప్తిని కలిగివుండి సమస్యతో వున్నవారికి హితము పలుకగలడు. జ్ఞానం మరియు విజ్ఞానంలో ఏది లోపమైనను హితమార్గాన్ని తెలియజేయలేడు. జ్యోతిష్కుడు కేవలం జ్యోతిషశాస్త్రాన్నే కాకుండా భగవద్గీత-ఉపనిషత్తుల సారం, పురాణ-ఇతిహాసాల ద్వారా ధర్మాధర్మ విషయాలు తెలిసి వుండాలి. ఇవి మనిషియొక్క వివేకాన్ని, విచక్షణా జ్ఞానాన్ని వెంపొందిస్తాయి.

3. గురువులయందు, ఆధిత్యాది నవగ్రహదేవతలయందు, ఇంద్రాది దేవతలయందు, భగవంతుడియందు అమితమైన భక్తిని (ప్రేమను) కలిగియొండవలెను. భక్తి కలిగిన వారికి మాత్రం భగవంతుడియొక్క ఉనికిని, శక్తిని, సృష్టిమార్గాన్ని అర్థం చేసుకోగలుగు శక్తి కలిగివుంటుంది. నిత్యమూ సదాచారవ్రతుడై దేవతార్చనవిధినిగావిస్తూ, శాస్త్రాధ్యయనం చేస్తూ, తాను నేర్చుకున్న జ్ఞానాన్ని ప్రామాణికంగా నలుగురికి ఉపయోగపడునట్లు కర్తవ్యకర్మలను చేయువాడికి దైవబలం ఎప్పుడూ వెన్నంటి వుంటుంది. సదాచారములేనివాడు ఎన్ని శాస్త్రాలు చదివినా ప్రయోజనం వుండదు. భగవంతుడియొక్క ఉనికిని, సమస్యలకు నివారణోపాయాన్ని తెలియరాలేడు.

4. జ్యోతిష్కుడు ఐహికభోగాల విషయంలో తృప్తిని, శాస్త్రాధ్యయన విషయంలో అతృప్తిని కలిగివుండాలి. అర్థ, కామాల విషయంలో తృప్తిని కానరానివాడు ఐహిక సుఖ–భోగాలకోసం పృచ్ఛకులను వంచనకు గురిచేయు ప్రమాధము కలదు. కావున ఇచ్చట జ్యోతిష్కుడికి ఇంద్రియ నిగ్రహం అతి ప్రధానమైనది. ఇంద్రియాలను నియంత్రణ చేయలేనివాడు సమస్యలను తలస్పర్శిగా అధ్యయనం చేయలేడు. సమస్యలను అవగతం చేసుకోలేనివాడు నివారణోపాయాలను తెలియరాలేడు. కావున జ్యోతిష్కుడు ముఖ్యంగా ప్రాపంచిక విషయభోగాలపై నియంత్రణను కలిగివుండాలి.

5. జ్యోతిష్కుడికి ప్రధానంగా ప్రజ్ఞా శక్తిని కలిగి వుండాలి. గురువు ద్వారా నేర్చిన విద్యను, పుస్తకం ద్వారా అధ్యయనం చేసి, మంచి విషయాలను తన మస్తకంలో (Memory) పదిలంగా భద్రపరచుకోవాలి. లేనిచో సంధర్భానుసారంగా పుస్తకం చూడడం కాని వేరొకరిపై ఆధారపడవలసి వస్తుంది.

6. జ్యోతిష్కుడికి వుండవలసిన మరియొక లక్షణం మేధాశక్తి. మేధాశక్తి అనగా మస్తకంలో పదిలంగా భద్రపరచిన సమాచారాన్ని సంధర్భానుసారంగా వెలికి తీయడం. దీనినే స్మరణశక్తి అని కూడా అంటాం. స్మరణశక్తి పుష్కలంగా కలవాడు సమస్యలను వేగంగా గ్రహించి పృచ్ఛకుడిలో ఆత్మ విశ్వాసం, ధైర్యం నింపడానికి దోహదపడతాడు. లేనిచో సమయానికి తగిన నిర్ణయాన్ని తీసుకోలేడు.

7. జ్యోతిష్కుడికి తాను అభ్యసించిన శాస్త్రంపై, తన అనుభవాలపై విశ్వాసం కలిగివుండాలి. లేనిచో విపరీతజ్ఞానం కలిగిన వితండవాదులచే, హేతువాదులచే శాస్త్రముపై అవిశ్వాసము కలుగు ప్రమాదము కలదు. గురువు చూపిన మార్గంపై, హిందూ ధర్మశాస్త్రంపై ఎల్లప్పుడూ విశ్వాసాన్ని కలిగి ఆస్తికుడుగావుండాలి.

8. శాస్త్రశ్రద్ధకు లోబడిన స్వతంత్రబుద్ధితో, విచక్షణా జ్ఞానంతో పృచ్ఛకులవద్ద వ్యవహరించవలసి వుంటుంది. లేనిచో వారు అడుగు ప్రశ్నలకు, వారు క్రితం కలసిన జ్యోతిష్కుల ఫలాఫల భేదాల ద్వారా విషయాన్ని ప్రక్కదారి పట్టించగలరు. కావున స్వతంత్రబుద్ధిని ఉపయోగించి ధర్మాధర్మ, న్యాయాన్యాయ విచక్షణలతో

వ్యవహరించవలసివుంటుంది. దీనినే స్థితిశక్తి అంటారు (Conviction).

9. సమస్త జీవరాశులను సమ దృష్ఠితో చూడగలుగు గుణాన్ని కలిగివుండాలి, పెంపొందించుకో గలగాలి. తను, మన, ధన భేదంలేకుండా అందరినీ సమానంగా చూడగలుగు యోగశక్తిని పెంపొందించుకోవాలి. తనవారు, పరాయివాళ్ళను భేదాభిప్రాయం ఉండకూడదు. సమస్యను అన్ని కోణాలలో అధ్యయనం చేసినతరువాతనే ఫల నిర్ణయానికి రావాలి.

10. జ్యోతిష్కుడు ప్రాణశక్తిని కలిగివుండాలి (Devine Power). తన వర్ణాశ్రమానికి తగిన కర్తవ్యకర్మలను నెరవేరుస్తూ, ఎల్లప్పుడూ దైవధ్యానంతో ధర్మానికిలోబడి పరోపకారం, ధానం చేస్తూ, ధ్యానంతో తనయొక్క కర్తవ్యాన్ని అన్వేషించగలిగే వాడికి ప్రాణశక్తి అధికంగా వుంటుంది. ప్రాణశక్తి కలవాడు సమస్యలకు తక్షణమే స్పందించి నివారణోపాయాన్ని అందిచగలడు, తనయొక్క ప్రాణశక్తి ద్వారా సమస్యలను దూరం చేయగలడు. మధ్యపానం, స్త్రీవ్యామోహం, అనగత్యమైన ధనార్జన, కీర్తి–ప్రతిష్టలకోసం ప్రాకులాడువారికి ప్రాణశక్తి చాలా తక్కువగా వుంటుంది. ఇలాంటివారు శాస్త్రాన్ని అభ్యసించి, గ్రహాల సహాయంతో సమస్యలను తెలుసుకొన్ననూ వాటికి శాశ్వత నివారణోపాయాలను తెలుసుకొనజాలరు.

11. జ్యోతిష్కుడు శారీరకంగా, మానసికంగా కూడా దృడంగా వుండాలి. ఒకవేళ జ్యోతిష్కుడు రోగపీడితుడైన, మానసికసమస్యలతో భాధపడుతున్నను సమస్యలకు పరిష్కారం కానరాలేరు. ఎంతటి బుద్ధి, విచక్షణా శక్తి కలిగిననూ మానసిక, శారీరక ఆరోగ్యంలేని వారు శాపగ్రస్తులతో సమానం.

12. సమస్యలను చక్కగా వినగలిగే గుణం కలిగివుండాలి. ఎవరూ ఏది చెప్పినా శ్రద్ధగా ముందు వినాలి. దీనినే "శ్రవణం" అంటాం.

13. విన్నవిషయాన్ని శాస్త్రశ్రద్దకు లోబడిన బుద్ధితో మననం చేయాలి. సత్యాసత్య విషయాలను గ్రహించాలి.

దీనినే మననం అంటాం.

14. మననం చేసిన మంచి విషయాలను ఆచరణకు తీసుకురావాలి. దీనినే "ధారణము అంటాము.

15. మంచి స్వభావం, మానవత్వం కలిగియుండాలి

16. శీలం, మంచి వ్యక్తిత్వం, సంస్కారవంతుడై వుండాలి

17. నిరంతరము శాస్త్రాధ్యయనం చేస్తూ కొత్తకొత్త విషయాలను తెలుసుకోవాలి. ధర్మశాస్త్రాలను, ఉపనిషత్తులను, పురాణాలను గురుముఖంగా అధ్యయనం చేయాలి

18. స్వర్వగతుడు, సర్వసమర్థుడు, సర్వజ్ఞుడు అయిన భగవంతుడియొక్క మహత్యాన్ని పురాణ, ఉపనిషత్తుల ఆధారంగా తెలుసుకోగలగాలి. కర్మసిద్ధాంతాన్ని తెలుసుకొని కాలధర్మానికి లోబడి, మానవధర్మాన్ని పరిపాలిస్తూ, కర్తవ్యకర్మలను చేస్తూ జీవనాన్ని సాగించాలి.

11. జ్యోతిషశాస్త్రం అభ్యసించడం వలన కలుగు లాభమేమి? జ్యోతిషశాస్త్రమును ఎవరైనా నేర్చుకొనవచ్చునా?

అధ్యేతవ్యం బ్రాహ్మణై రేవ తస్మాత్ జ్యోతిశ్శాస్త్రం పుణ్యమేతద్రహస్యమ్ ।
ఏతద్బుద్ధ్వా సమ్యగాప్నోతి తస్మాదర్థం ధర్మం మోక్షమగ్ర్యం యశశ్చ ॥

బ్రాహ్మణుడి ద్వారా ఈ శాస్త్రము అధ్యయనము చేయతగ్గది. జ్యోతిషశాస్త్రము పుణ్యప్రదమూ అతి రహస్యమూ అయినది. ఈ విషయాన్ని తెలుసుకొని అధ్యయనం చేసినట్లైతే దీనివలన ధర్మార్థాది చతుర్విద ఫలమూ, యశస్సూ లభిస్తాయి.

ప్రాచీనకాలంలో జ్యోతిషశాస్త్రాన్ని సద్గురువును ఆశ్రయించి అమితమైన శ్రద్ధతో నేర్చుకొనేవారు. జ్యోతిషశాస్త్రాధ్యయనం ఒక్కటే కాక ఉపనిషత్తులు, పురాణవాఙ్మయము, ధార్మికవిషయచింతన, ఆయుర్వేదము మొదలగు అంశాలను గురుముఖాంతరముగా అభ్యసించేవారు. పూర్వకాలంలో ఇప్పటివలె

జ్యోతిషశాస్త్రం ప్రత్యేకమైన విభాగం వుండేది కాదు. తిథి, వార, నక్షత్రము మొదలగు దినపంచాగవిషయములు తెలుసుకొనుటకు చిన్నవయసునుండే గురువు ద్వారా శాస్త్రం భోదించబడేది. అన్ని శాస్త్రాలతో పాటు జ్యోతిషశాస్త్రాన్ని ప్రధానంగా తప్పనిసరిగా అభ్యసించవలసినదే. అప్పట్లో కాలాన్ని, రోజులను తెలుసుకొను యంత్రాలు లేకపోవుటచే సమయాన్ని తెలుసుకొనుట తప్పనిసరిగా జ్యోతిషశాస్త్రాన్ని అభ్యసించేవారు. జ్యోతిషశాస్త్రం అన్ని విజ్ఞానశాస్త్రాలతో కలిసివుండేది. జ్యోతిషశాస్త్రమును అధ్యయనము చేయునప్పుడు వారికి పుస్తకాలు, గ్రంథాలయాలు, అంతర్జాలము వంటి సదుపాయాలు వుండేవి కావు. సమస్య ఏర్పడినట్లైతే గురువు తన తపోశక్తితో వారి సమస్యలకు పరిష్కార మార్గాన్నందించేవారు.

అప్పట్లో జ్యోతిషశాస్త్ర ఉపయోగం ఒక నిర్దిష్టమైన పరిమితిని కలిగివుండేది. శిశుజననం, జాతకకర్మలు చేయుటకు, జననకాల నక్షత్రదోషములను తెలుసుకొనుటకు, నామకరణం, అన్నప్రాశన, కేశఖండనం, విధ్యారంభం చేయుటకు ఉపయుక్త మూహూర్తములను నిర్ణయించుటకు, వధూవరుల వివాహ పొంతనము, జాతకపరిశీలన, అన్యోన్య దాంపత్యం, వివాహ ముహూర్తం, సంతానం మొదలగు విషయాలను పరిశీలించుటకు, విశేషంగా వర్షాధారం, పంటలు, రాజ్యసంక్షేమం, వ్యక్తిగత ఆరోగ్యం మొదలగు విషయాలను జ్యోతిషశాస్త్రము ఆధారంగా తెలుసుకొనుటకు ఈ శాస్త్రాన్ని అధ్యయనం చేసేవారు. జ్ఞానులు కూడా వేదాలకు కళ్ళైనటువంటి జ్యోతిషశాస్త్రాన్ని ప్రత్యక్షశాస్త్రంగా విశ్వసించి దాని సహాయంతో వేదాలలోని సారాన్ని, కర్మసంబంధ విషయాలను ప్రత్యక్షముగా అనుభవానికి తీసుకునేవారు. భగవదారాధన, ధార్మిక విషయచింతన, మోక్షమార్గానికై జ్యోతిషశాస్త్రం సహాయంతో అన్వేషించేవారు. దీనినే పురాతనకాలంలో దివ్యదృష్ఠిగా వ్యవహరించేవారు.

కాని ఇప్పటి కాల పరిస్థితులను చూస్తే ప్రాచీనకాలానికి భిన్నమైన వాతావరణం కొనసాగుతున్నది. జ్యోతిషశాస్త్రము ఒక ప్రత్యేకమైన విభాగముగా విడదీయబడింది. అందులోనూ జాతకం, ప్రశ్న, సిద్ధాంతగణితం మొదలగు విషయనికొక్క ప్రత్యేక విభాగం ఏర్పడినది. ఆధునిక కాలంలో జ్యోతిషశాస్త్రాన్ని గురువులేకపోయినను పుస్తకాల ద్వారా అపైధీకమైన వాతావరణంలో నేర్చుకోబడుతోంది. కావున

జ్యోతిషశాస్త్రాన్ని నేర్చుకోదలచినవారికి శాస్త్రజ్ఞానం, సదాచారము, ధార్మికప్రజ్ఞ లేకపోయినను అభ్యసించుటకు అవకాశము కలదు. ధర్మనిరతి, సదాచరము, వైదీకవృత్తిలో సంతృప్తికరమగు జీవితము గడుపు గురువు లేకుండుటచే ఏ అర్హత, గుణము లేకపోయిననూ, ఏ మత–జాతివారైననూ, ఎలాంటి వృత్తిచేస్తున్నవారైననూ తమదైన శైలిలో నేర్చుకొనుటకు ప్రస్తుతకాలం దోహదపడుతోంది. వినయం, విధేయత, సంస్కారం, శ్రద్ధ, భక్తి లేకపోయినను కేవలం ధనసంపాదనయే ప్రధానాంశంగా శాస్త్రాన్ని అభ్యసించుటకు చాలా పాఠశాలలు, కళాశాలలు ఆవిర్భవించాయి. మనిషిజీవితాన్ని సమగ్రంగా తెలియజేసే జీవనధర్మశాస్త్రాన్ని, సమస్యలకు కారణాలు తెలియజేసే కర్మవిజ్ఞానశాస్త్రాన్ని అధ్యయనం చేయకపోయినా గ్రహాలు, నక్షత్రాలు, రాశులు, లగ్నం మొదలైన గ్రహగణిత సంబంధమైన అంశాలను మాత్రమే లోతుగా పరిశీలిస్తూ ఫలనిర్ణయాన్ని ఖచ్చితంగా ధృవీకరించు పద్ధతి ప్రస్తుత ఆచరణలో, అందుబాటులో వున్నది. గ్రహాలు, నక్షత్రాలు మొదలగు అంశాలు కాలాన్ని, కాలబలాన్ని మాత్రమే తెలియజేస్తాయి, వ్యక్తిగత సమస్యలకు గ్రహాలు కారణము కాదని, గ్రహాలు కేవలం కాలాన్ని, కాలబలాన్ని తెలియజేసే సూచికలని, వ్యక్తిగత సమస్యలకు పూర్వకర్మయే ప్రధాన కారణమన్న సత్యాన్ని మరచింది ఆధునిక జ్యోతిషశాస్త్ర పద్ధతి. కావున జ్యోతిష్కుడి శాస్త్రజ్ఞానంలోని అపూర్ణతవల్ల వ్యక్తిగత సమస్యలకు ఖచ్చితమైన కారణాలను, వాటిని అధిగమించుటకు పరిష్కారమార్గాన్ని అందించుటలో విఫలమవుతున్నారు. విఫలతకు గల కారణం జ్యోతిషశాస్త్రంలోనే అపూర్ణతకలదని ప్రచారం గావించి చేతులుదులుపుకుంటున్నారు చాలామంది ఆధునిక జ్యోతిష్కులు.

ఇక ప్రశ్నల(సమస్యల) విషయానికి వస్తే జ్యోతిష్కుడిని అడగదగిన ప్రశ్నఏదో, అడగకూడని ప్రశ్నఏదో కూడా తెలియని, విచక్షణాజ్ఞాన లేని అవస్థలో వున్నారు ప్రస్తుత జనులందరూ. కాలంతో పరుగులుతీస్తూ, తీరికలేని, మనశ్శాంతిలేని యాంత్రికజీవితము గడుపుతూ, మనస్సు అత్యాశ–దురాశలతో నింపి, ఎల్లప్పుడూ తనకు ఇష్టమైనవాటిని కోరుకుంటూ, తనకు హితమైనవాటిని గుర్తించుట మరచి, ఐహికసుఖభోగాలను విడువలేక జీవనమును కొనసాగిస్తున్నాడు. పరిమితులులేని, సరిహద్దులులేని, మరింత వేగమైన జీవతాన్ని ఆశించే మనిషి తన అజ్ఞానంతో అనగత్యమైన ధన/వస్తు/కీర్తి సంపాదించు మార్గంలో ఎదురయ్యే ప్రతి చిన్న విషయాన్ని పెద్ద సమస్యగా భావించి, మనస్సును కలవరపెడుతూ,

సమాధానానికోసం ప్రయత్నించక పాపభయంతో దేవాలయాలను, అర్చకులను, జ్యోతిష్కులను ఆశ్రయిస్తున్నాడు. ఆధునిక విజ్ఞానంపై ఎక్కువ అధ్యయనం చేస్తూ బుద్ధిశక్తిని, స్మరణశక్తిని కోల్పోయి సామన్య విచక్షణా జ్ఞానంతో పరిష్కరించుకోదగ్గ విషయాలనుకూడా పరిష్కరించుకోలేని పరిస్థితికి చేరుకున్నాడు. అనగత్యమైన, అసంధర్భమైన విషయాలకోసం జ్యోతిష్కుడిని ఆశ్రయిస్తున్నాడు. తనకు అనుకూలమైన సమయంలో జ్యోతిష్కుడు ఎక్కడ వున్నా, ఏపరిస్థితిలో వున్నా, వినయం విధేయత లేక (తెలియక) నేరుగాగాని, ఉత్తరాలు, దూరవాణి (ఫోన్), ఈ–మైల్ ద్వారాగాని సంప్రదిస్తున్నాడు. ఇక ప్రశ్నలవిషయానికి వస్తే ఏది కష్టమో ఏది సుఖమో, ఏది సమస్య తెచ్చిపెడుతుందో, ఏది హితాన్నిస్తుందో తెలియక ఇష్టానుసారంగా సమస్యల వర్షం కురిపిస్తూ తికమక పెడుతుంటారు మరికొందరు. శిశు జననమవగానే ఇంజినీరు అవుతాడా లేక డాక్టరు అవుతాడా? అయితే ఏ సంవత్సరములో అవుతాడు? అతని ధనార్జన, ఆస్తిపాస్తులు మొదలగు అనగత్య విషయాలను విసుగుపుట్టేటట్లు ప్రశ్నిస్తారు. విద్య విషయంలో కూడా తన సంకల్పమునకు ప్రాధాన్యత ఇవ్వకుండా జ్యోతిష్కుడిని ఆశ్రయించి ఏ చదువు చదివితే భవిష్యత్తులో ఎక్కువ సంపాదించగలడు? మంచి ఉద్యోగం సంపాదించగలడా? అంటే శ్రమ తక్కువగా చేసి ఆదాయం ఎక్కువ వచ్చే ఉద్యోగం అన్నమాట. ఇక వివాహవిషయానికి వస్తే అడిగే ప్రశ్నలు అలాంటివిలాంటివి కావు. వివాహము ఏ తేదీన అవుతుంది, ఎవరితో అవుతుంది? ఆస్తిపాస్తులు కలిగివుంటాయా? సౌంధర్యవతియైన కన్యను పొందాలంటే ఏమి చేయాలి? ఏ దిక్కున ప్రయత్నించాలి? ఎవరిని ఆశ్రయించాలి? కోరుకున్న అమ్మాయితోనే అవుతుందా? అత్తమామల బెడదలేని, ఆచారవిచారాలకు తావులేని ఇంటిలో వరుడు/వదువు దొరుకవచ్చా? నాకు విడాకులు వస్తుందా? రావాలంటే ఏ పూజ చేయాలి? ఎన్ని రోజులలో విడాకులు వస్తుంది? మళ్ళీ ఎన్నిరోజులలో రెండవ వివాహమవుతుంది? రెండవ వివాహము ఏవిదంగా వుంటుంది? ముఖముపై వచ్చు మొటిమల పరిష్కారానికి ఏమి చేయాలి? ఏ హోమం చేయాలి? ఉన్నపళంగా ప్రమోషన్ రావాలంటే ఏ జపం, స్తోత్రం చేయాలి? ఏ రత్నాన్ని ధరించాలి? బంగారంలో ధరించాలా లేక వెండిలో ధరించాలా? ఏ జపం చేయాలి? నేనే చేయాలా లేదా వేరొకరితో చేయించవచ్చా? స్తోత్రము నేనే చదవాలా? తల్లితండ్రులు చదివినా పరవా లేదా? ఇలాంటి వివేకములేని అనేక లౌకికభోగాలకు సంబంధించిన ప్రశ్నలు పొడుస్తారు. ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు దైవజ్ఞుడు

వెతకాలంటే ప్రస్తుత కాలపరిస్థితిని అర్థంచేసుకొని, మనోవైజ్ఞానిక శాస్త్రజ్ఞానం ద్వారా వారిలో జ్ఞానాన్ని, చైతన్యాన్ని, ధైర్యాన్ని, సమస్యలపై అవగాహనను పెంచవలసివుంటుంది. ఆత్మవిశ్వాసాన్ని నింపి మానసికస్థితిని ఉత్తేజపరచి సమస్యలకు ఎదురునిలుచుటకు మనఃశాస్త్రముయొక్క ప్రయోజనము తప్పనిసరిగా జ్యోతిష్కునికి అవసరం. మనఃశాస్త్రానికి సంభందించిన జ్ఞానం మనకు భగవద్గీత మరియు ఉపనిషత్తుల ద్వారా లభిస్తుంది. కావున జ్యోతిషశాస్త్రంతో పాటు వేదసారం, ధార్మికవిషయాలు, కర్మసిద్ధాంతం, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు మొదలగు విషయాలపై గట్టి పట్టు కలిగివుండాలి. జ్యోతిషశాస్త్రాధ్యయనం ఒక్కటే సరిపోదు. స్వతంత్రబుద్ధికి అందని సమస్యలను, విషయాలను అధ్యయనం చేయుటకు మార్గం వేదం ఒక్కటే. మరే ఇతర ఆధారములూ లేవు. కావున ధర్మాచరణ, సదాచారము, వినయము, వివేకమూ, శ్రద్ధా, భక్తులుగల బ్రాహ్మణుడు చక్కగా, పూర్ణంగా ఈ శాస్త్రాన్ని అధ్యయనం చేయగలడు.

12. గురువుగారు! జ్యోతిషశాస్త్రము శ్రద్ధ, భక్తి మొదలైన గుణాలతో నేర్చుకోదగినదని వివరించారు. మరి మీరు పేర్కొన్న గుణాలు కలిగిన వేరెవరైనా ఈ జ్యోతిషశాస్త్రాన్ని నేర్చుకోవచ్చా? లేక బ్రాహ్మణుడికి మాత్రమే అవకాశముగలదా? వివరించగలరు.

మంచిప్రశ్న. శాస్త్రవిషయాలలో బ్రహ్మణుడు అని ప్రస్తావన వచ్చినపుడు అది వర్ణప్రకారం విభజించబడినదని గ్రహించాలి. శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఈ విధంగా పలికాడు–

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।
తస్య కర్తారమపి మాం విద్ధ్యకర్తారమవ్యయమ్ ॥

తాత్పర్యం: జీవుడియొక్క వర్ణం ఆధారంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అను నాలుగు విధాల జనులు సమాజంలో వున్నారు. అంటే ఇక్కడ జాతియొక్క ప్రస్తావన రాలేదు. జాతి అనగా జననం, మనిషి

పుట్టుక నుండి గ్రహించబడేది. వర్ణం అనగా జీవుడియొక్క స్వాభావిక గుణాన్ని ఆధారంగా తెలియబడేది. ఈ రెండింటికి చాలా భేదం కలదు. బ్రాహ్మణవర్ణం కలవాడు భగవదారాధన, అర్చన, అధ్యయనం, శాస్త్రభోదనపై మిక్కిలి తపన కలిగియుంటాడు. ఇతనికి కీర్తి–ప్రతిష్టలమీద, పదవులమీద, ఐహిక భోగాలమీద వ్యామోహం వుండదు. ఇతడు కేవలం జ్ఞానసంపాదనము, దీనజనోద్ధరణకోసం పరితపిస్తాడు. అలాంటి గుణముగలిగిన వాడే బ్రాహ్మణుడు. క్షత్రియుడు అనగా భయభ్రాంతికి లోనైన వారికి అభయమిచ్చి రక్షించువాడు. ఇతడు బ్రాహ్మణుడి సహాయసహకారాలతో జనులరక్షణయే ప్రధాన కర్తవ్యం కలవాడు. వైశ్యుడనగా సమాజానికి కావలసిన ఆహారాన్ని సంవృద్దిగా అందించేవాడు. శూద్రుడనగా కష్టాలకు లోనైనవాడికి సేవ చేయువాడు. ఇలా సమాజ శ్రేయస్సుకోసం ఈ నాలుగు వర్ణాలవారు అవసరం. ఈ నాలుగు వర్ణాలవారు అన్ని జాతులలోనూ, అన్ని మతాలలోనూ కలరు. బ్రాహ్మణుడంటే భగవంతుడినెరిగినవాడని అర్థం. తాము సంపాదించిన జ్ఞానాన్ని ప్రతిఫలాన్ని ఆశించకుండా సమాజశ్రేయస్సుకు దారపోయువాడని గ్రహించాలి. ఈ గుణం కలిగిన వాడు ఏజాతిలోవున్నను, ఏమతమువాడైననూ వర్ణం ఆధారంగా శ్రీ కృష్ణుడి దృష్టిలో బ్రాహ్మణుడే. ఇక్కడ జాతి పద్ధతికి తావులేదు. సదాచారము, ధర్మనిరతి, ప్రాణికోటిపై దయ, సంస్కారము, స్వార్థరాహిత్యము, శ్రద్ధ, భక్తి, మేధ, వివేక ప్రజ్ఞలు గలవాడు ఎవరైనా శాస్త్రాధ్యయనానికి అర్హులని జ్ఞానుల ఉద్దేశం. ప్రస్తుత కాలపరిస్థితులలో జ్యోతిషశాస్త్రాన్ని చాలామంది అధ్యయనం చేస్తున్నారు. జ్ఞానులు తెలిపిన లక్షణములుగల జ్యోతిష్కుడి జాతక పరిశీలనకు, ఏవిధమైన అర్హతపొందకుండా కేవలం జ్యోతిషశాస్త్రాన్ని శాస్త్రీయంగా నేర్చినవాడి పరిశీలనలో చాలా వ్యత్యాసం వుంటుందని గ్రహించాలి.

13. గురువుగారు! మరి ప్రస్తుత కాలపరిస్థితులలో మంచి జ్యోతిష్కుడిని గుర్తించి, సమస్యల నివారణామార్గం పొందుట ఎటుల?

శిష్యా! సంధర్భానికి తగిన ప్రశ్నను అడిగావు. ఇది కర్మసిద్ధాంతానికి లోబడిన సంగతి. సదాచారముతో, భగవంతుడిని నమ్మి, ధార్మికమైన జీవితమును గడుపువానికి భగవంతుడు స్వతహా మంచి–చెడ్డలను

గమనిస్తుంటాడు. ఆపత్కాలములో సమస్యల పరిష్కారానికి సద్గురువులను కలిసేలా చేస్తాడు. గురువుయొక్క సలహాతో సమస్యలబారినుండి దూరమవుతాడు. దీనికి సత్కామకర్మములు, ధార్మికజీవనం ప్రధానం. అనాచారము, ధర్మాన్ని వర్జించి అనగత్యమైన కర్మలను నిర్వర్తిస్తూ స్వంతలాభాన్ని చూసుకొనేవానికి అతడి కర్మకు తగ్గ గురువును ముడిపెడతాడు. అతనియొక్క సలహాలతో అధోముఖం పట్టిస్తాడు, కష్టనష్టాలకు గురిచేస్తాడు. ఇందులో గ్రహింపదగ్గ విషయమేమిటంటే ఎల్లప్పుడూ మానవధర్మాన్నాచరిస్తూ, మానవత్వంతో, ప్రాణికోటియందు దయగలిగిన జీవనం సాగించువాడికి దైవమే శ్రీరామరక్ష అవుతుంది. చేయకూడని పనులు చేస్తూ, అన్యాయమార్గంలో సంపాదన గావిస్తూ, ప్రాణికోటిపట్ల దయలేని మానవుడు ఆపత్కాలంలో ఎన్ని పూజలు, హోమాలు, జపాలు చేసినా ప్రారబ్ధకర్మమును అనుభవించక తప్పదు. తప్పుతెలుసుకొని శరణుకోరినవారికి కష్టనష్టములయొక్క తీవ్రత తగ్గవచ్చేగాని దుష్కర్మలు చేసినందుకు వచ్చిన కష్టముల నుండి పూర్తిగా తప్పించుకొనుట అసాధ్యం. కర్మమును అనుభవించే తీరవలెను. కర్మమును అనుభవించు సమయమున భగవంతుడిని భక్తి, శ్రద్ధలతో ఆశ్రయించినట్లైతే భగవంతుడు అతనికి సంతోషాన్ని, ఆనందాన్ని ప్రసాదిస్తాడు. భగవదనుగ్రహము మనిషియొక్క సుకర్మఫలమును ఆనందముగా అనుభవించుటకు తోడ్పడుతుంది.

సమాజాన్ని ప్రక్కదారి పట్టించువారికి, స్వంతసుఖాలకోసం వంచన చేయువారికి, అనగత్యమైన ధనంకోసం అత్యమూల్యమైన సమయాన్ని వృధాచేయువారికి, ఎల్లప్పుడూ శారీరక వాంఛలను తీర్చుకొనువారికి, ధర్మాచరణ, సదాచారముపై ఉదాసీనముగా వ్యవహరించువారికి, సమస్యలలో వున్న వ్యక్తికి సహాయపడనివారికి, అధికారం దుర్వినియోగం చేయువారికి, దుర్వ్యసనాలకు లోనైనవారికి భగవంతుడు ప్రత్యేకమైన మార్గాన్ని కల్పిస్తాడు. ఆ మార్గంలో ఎదుటపడు ప్రతియొక్క వస్తువు, మనిషి కష్టనష్టాలను, ప్రతికూలమైన వాతావరణాన్ని కలుగజేస్తాడు.

కావున మంచి జ్యోతిష్కుడు దొరకాలన్నా, అతని సహాయం తీసుకోవాలన్నా మొదట మనం మంచి మార్గంలో నడుచుకుంటూ వుండాలి. లేనిచో మంచి గురువుగానూ, సత్పురుషుగానూ ఉన్న

జ్యోతిష్కులను పొందలేము. ప్రతిఒక్కరూ తమ వర్ణాశ్రమానికి తగిన కర్మలను చేస్తూ, తగిన ప్రతిఫలాన్ని ఆశిస్తూ, గృహనిర్వహణ మరియు రక్షణకు అవసరమయ్యే ధనాన్ని మాత్రం సంపాదిస్తూ, అనగత్యమైన ధనాన్ని దానం చేస్తూ, అమితమైన సుఖాలను వర్జిస్తూ, సదా పరోపకారాన్ని కోరుకుంటూ సహజీవనం చేసేవారికి సమస్యలు సామాన్యముగా కానేరవు, ఒకవేళ వచ్చిననూ మహాత్ములైన గురువుల దర్శనం, మరియు అమూల్యమైన సలహాల ద్వారా సమస్యలను గట్టెక్కుటకు త్వరితంగా మార్గం కనిపిస్తుంది. అలాంటివారికి సమయానికి మంచి జ్యోతిష్కుడి పరిచయం ఏర్పడుతుంది. కావున మనకు ధార్మికసహజీవనమే శ్రేష్టమైనదని గ్రహించాలి. అలాంటివారికే మంచి జ్యోతిష్కుడిని సంప్రదించు అవకాశము కలుగుతుంది.

14. గురువుగారు! జ్యోతిషశాస్త్రాధారంగా సమస్యలను ఖచ్చితంగా అధ్యయనం చేయుట సాధ్యమా?

ఇది కష్టసాధ్యమే! కాని దానికి పరిమితులు కలవు. జ్యోతిషశాస్త్రం ద్వారా విషయాన్ని ఖచ్చితంగా అధ్యయనం చేసినా కాలధర్మాన్ని అనుసరించి ఫలము చెప్పవలసివుంటుంది. శాస్త్రశ్రద్ధకు లోబడిన బుద్ధితో ఫలనిర్ధారణము చేసినా దానిపై దైవశక్తి ప్రభావం పరిపూర్ణంగా వుంటుంది. దీనికి ఉదాహరణగా ఒక చిన్న కథను చెప్పదల్చాను. శ్రద్ధగా విను.



పూర్వంలో యమధర్మరాజు శ్రీ మహావిష్ణువుయొక్క దర్శనార్థమై వైకుంటమునకు బయలుదేరెను. వైకుంటముయొక్క ముఖద్వారమున గరుక్మంతుడు కావలాగా ఉన్నాడు. యమధర్మరాజు గరుక్మంతుడితో కొద్దిసేపు సంభాషించి శ్రీహరిని దర్శించుటకు వచ్చివున్నానని శ్రీహరికి తన ఆగమన విషయమును తెలుపమని కోరాడు. గరుత్మంతుడు వైకుంఠమునకు ప్రవేశించి యమధర్మరాజు వచ్చిన సమాచారమును విన్నవించాడు. భగవంతుడు దర్శనమునకు అనుమతించమని ఆదేశించాడు. గరుక్మంతుడు శ్రీహరి

సన్నిదినుండి తిరిగివచ్చి యముడిని శ్రీహరి దర్శనమునకు వెళ్ళమని అనుమతించెను. గరుక్మంతుడుతిరిగివచ్చు సమయమున నరకలోకాధిపతియైన యమధర్మరాజు వైకుంఠముఖద్వారముపై కూర్చొని వున్న ఒక పక్షిని తదేకంగా, ధీర్ఘాలోచనతో చూస్తుండడం గమనించాడు. యమధర్మరాజు వైకుంఠద్వారం ప్రవేశించగానే గరుక్మంతుని మనస్సులో ఒక ఆలోచన మొదలయ్యింది. యమధర్మరాజు ఆ పక్షిని తదేకంగా ఎందుకు చూస్తున్నాడు? అని ఆలోచించసాగాడు. కొద్దిసేపటి తరువాత తన మనస్సులో సమాధానం తట్టింది. నరకలోకాధిపతికి ప్రాణములను హరించుటయే ప్రథమ కర్తవ్యము. ఈ పక్షియొక్క ప్రాణములను తీసుకుపోవుటకు కాబోలు కూర్చొని వున్న పక్షిని తదేకంగా చూస్తున్నాడు. నేను ఎలాగైనా ఈ పక్షిని రక్షించవలెను అదే నా యొక్క ప్రస్తుత కర్తవ్యము అని అలోచించ సాగాడు. వెంటనే ఆ పక్షిని తన వెంటతీసుకొని ఏడు సముద్రముల అవతలగల ఒక మఱ్ఱిచెట్టు తొర్రలో దాచి ఏమీ ఎరుగనట్టు వచ్చి ముఖద్వారము వద్ద సంతోషంగా నిల్చున్నాడు.

శ్రీహరిని దర్శించుకొని యమధర్మరాజు ముఖద్వారము వద్దకు చేరి పక్షిని గమనించడం మొదలుపెట్టాడు. పక్షి కనిపించకపోవడంతో నిల్చొనివున్న గరుక్మంతుడిని "కాసేపటిక్రితం ఇక్కడ ఒక పక్షివున్నది, ఇప్పుడు అది కన్పించడంలేదు? ఎటు వెళ్ళింది?" అని ప్రశ్నించాడు? దానికి గరుక్మంతుడు తనకేమీ తెలియదని, తాను అసలు పక్షిమొహమే చూడలేదని సమాధానం చెప్పాడు. సమాధానం విన్న యమధర్మరాజు కొద్దినిమిషములు తన దివ్యదృష్టితో అలోచించి, విషయం తెలుసుకొని సంతోషము పట్టలేక నవ్వుకొంటూ యమపురికి తిరుగుప్రయాణం పట్టాడు. యముడు ఎందుకు ఇలా నవ్వుకున్నాడో గరుక్మంతునికి అర్థంకాకపోవడంతో యమధర్మరాజువద్దకు వెళ్ళి నవ్వడానికిగల కారణాన్ని వివరించమని ప్రాధేయపడ్డాడు. దానికి యమధర్మరాజు ప్రశాంతంగా సమాధానాన్ని గరుడుడికి ఇలా తెలియజేసాడు గరుడా ముఖద్వారముపై కూర్చొనివున్న పక్షి ఏడుసముద్రాల అవతలగల ఒక మఱ్ఱిచెట్టు, ఆచెట్టు తొఱ్ఱలో ఒక మార్జాలము (పిల్లి) వున్నది. ఆ మార్జాలమునకు ఆహారంగా ఈ పక్షి తన దేహాన్ని సమర్పిస్తుందని, ప్రాణాలు విడుస్తుందని శ్రీహరియొక్క సంకల్పం. నేను శ్రీహరిని దర్శించుటకు వెళ్ళునపుడు ఆపక్షికేసిచూసి ఇది ఏడు సముద్రాల అవతల చెట్టుతొఱ్ఱలోవున్న పిల్లికి ఆహారం ఎలా అవుతుందా అని

దీర్ఘంగా ఆలోచించసాగాను. ఈ కార్యానికి శ్రీహరి నిన్ను ప్రేరేపించినాడు. పక్షిని రక్షించాలని సంకల్పించి నీవు దానిని ఏడుసముద్రాల అవతల వున్న చెట్టు తొఱ్ఱలో దాచావు కాని శ్రీహరి సంకల్పం ప్రకారం ఈ పక్షి పిల్లికి ఆహారమయ్యింది. అని వివరించాడు. దానికి గరుక్మంతుడుసిగ్గుతో తలదించుకొని పశ్చాత్తాపంచెందాడు.

శ్రీహరియొక్క శక్తికి, సంకల్పానికి వ్యతిరేకంగా ఆలోచించి భంగపడ్డాను. శ్రీహరి ఒక్కడే సత్య సంకల్పుడని మరచి వ్యవహరించానని శ్రీహరియొక్క దివ్యపాదములపై శిరస్సు వుంచి క్షమించమని వేడుకున్నాడు. పరమదయాళు, సర్వగతుడు, సర్వసమర్థుడు మరియు సర్వజ్ఞుడు అయిన శ్రీహరి దర్శనమిచ్చి నీవు నిమ్మిత్తమాత్రుడవు. జీవులయొక్క స్వభావము మరియు కర్మలననుసరించి సృష్టి, స్థితి, లయాదులు జరుగుతున్నయని వివరించాడు. ఈ కథవలన-***తానొకటి తలస్తే దైవమొకటి తలంచును*** అన్న వాఖ్యాన్ని ప్రతి ఒక్క మనుజుడు తెలుసుకోవలెను. గరుక్మంతుడు మరియు నరకలోకాధిపతియైన యమధర్మరాజు ఊహించలేని సత్యాన్ని సామాన్య మానవమాత్రులమైన మనం ఖచ్చితంగా ఊహించగలగడం సాధ్యమా? అని ప్రతిఒక్క జ్యోతిష్కుడు తమను తాము ప్రశ్నించుకొంటే ఏది మంచిది, ఏది విధి అన్న జ్ఞానం బోధపడుతుంది. విచక్షణాజ్ఞానంతో దేనిని జ్యోతిషం ద్వారా చెప్పవచ్చు దేనిని చెప్పడం నిషిద్ధం అని కూడా తెలుస్తుంది. జ్యోతిషంలో ఈ ధర్మాధర్మముల విచక్షణ జ్ఞానంలేకుండా సూక్ష్మఫలమును చెప్పరాదు. భగవంతుని ఆశీర్వాదముతో, గురువుయొక్క అనుగ్రహముతో జాతకమును స్థూలంగా పరిశీలించి ఫలము చెప్పవలెను

15. గురువుగారు! కాలానుగుణంగా మనిషి వడు సమస్యలను అధ్యయనం చేయుటకు జ్యోతిషశాస్త్రము మాత్రమేకాక ఏన్నోవిధానాలు, శాస్త్రాలు అవతరించాయి. తపోశక్తితో గ్రహగణిత సంభంధములేకుండానే ఎందరో సత్పురుషులు, మునులు పరిష్కారోపాయాన్ని తెలిపేవారు. ఇందులో ఏది గొప్పది? గ్రహగణిత జ్యోతిషశాస్త్రమా? తపోశక్తితో ముడిపడిన అన్యశాస్త్రములా? తెలియజేయగలరు.

శిష్యా! ఈ ప్రశ్న ఈ సంధర్భములో అప్రస్తుతము. శాస్త్రవిషయాలలో, కార్యాచరణలో గొప్ప అన్న పదాన్ని మరచిపోవాలి. అన్నిశాస్త్రాల సారం ఆనందమయమగు జీవితాన్ని గడుపుతూ, భగవదారాధనచే మోక్షాన్ని పొందుటయే ముఖ్య లక్ష్యంగా వెలిసాయి. సదాచారము, ధర్మాచరణ మరియు సమాజశ్రేయస్సే ముఖ్యమయినప్పుడు గొప్ప అన్న పదం ఉపయోగించుటలో అర్థం లేదు. దీనికి కూడా ఒక చిన్న కథను ఉదాహరణగా చెబుతాను. శ్రద్ధగా విని ఆంతర్యాన్ని గ్రహించు.

పూర్వము ఏడేడులోకాలకు వెలుగును ప్రసాదించే సూర్యుడికి, దిక్పాలకులైనటువంటి ప్రవహ వాయుదేవునికి మద్య పోటీ మొదలయ్యింది. వారిరువురిలో ఎవరు బలవంతులన్న సమస్య ఏర్పడింది. ఈ సమస్యను పరిష్కరించుకొనుటకు వారివురి మద్య పోటి ఒకటి నిర్వహించుకొన్నారు. అదే సమయానికి భూలోకంలో ఒక గొఱ్ఱెలకాపరి గొఱ్ఱెలను మేపుతూ కొండప్రాంతములో సంచరించడం సూర్యుడు, వాయుదేవుడు గమనించారు. అతను ఒక తెల్లటి వస్త్రమును శరీరముపై కప్పుకొని గొఱ్ఱెలను తోలుతూ కొండప్రాంతంలో కూనిరాగాలుతీస్తూ వెళ్తున్నాడు. పోటి ఏమనగా ఎవరు తన బలంతో ఆ గొఱ్ఱెలకాపరిపై వున్న వస్త్రాన్ని తొలగించగలరో వారు మహాబలవంతులని పరీక్ష పెట్టుకున్నారు.

పోటీ మొదలయ్యింది. మొదట వాయుదేవుడు శరవేగంతో గాలిని వీచడం ప్రారంభించాడు. కొండప్రాంతములో ఉన్నట్లుండి పెద్దహోరుగాలి మొదలయ్యింది. గొఱ్ఱెలకాపరి ఉన్నట్టుండి మొదలైన ఎదురుగాలికి స్పందించి చెట్టు చాటుకు పరుగులుతీశాడు. వాయుదేవుడు తనప్రతాపాన్ని పెంచాడు. హోరుగాలి దుమారంగా మారింది. గొఱ్ఱెలకాపరిని ఉన్నట్టుండి చుట్టుముట్టింది. తన తెల్లటివస్త్రము గాలికి నిలువలేక అతని నుంచి దూరంగా ఎగరసాగింది. గొఱ్ఱెలకాపరి గట్టిగా లాగుతూ పెనుగులాడాడు. వాయుదేవుడు తన బలాన్నంతా ప్రయోగించి వస్త్రాన్ని అతని ఒంటిమీదనుంచి తొలగించడానికి ప్రయత్నించాడు. గొఱ్ఱెల కాపరి చలికి వణుకుతూ ఈదురుగాలికి బెదరి ఒక బండరాయిక్రింద తలదాచుకున్నాడు. వాయుదేవుడుశాంతించి తన ఓటమిని అంగీకరించాడు. పోటిపరీక్షలో తనవంతుగా సూర్యుడు బరిలోకిదిగాడు. ఉన్నట్టుండి వేడిసెగలను వెదజల్లాడు. దానితొ గొఱ్ఱెల కాపరికి చెమటలు

పట్టాయి. సూర్యుడు తన వేడి ఉద్రుతాన్ని పెంచసాగాడు. దానితో ఉక్కపోతకు తట్టుకోలేక గొర్రెలకాపరి ఒంటిమీదవున్న వస్త్రాన్ని తొలగించి సంచిలో వేసుకున్నాడు. సూర్యుడు పోటిపరీక్షలో జయం తనదేనని గర్వంతో విర్రవీగసాగాడు.

అఖిలాండకోటిబ్రహ్మాండనాయకుడు, సర్వతంత్రస్వతంత్రుడు, సర్వగతుడు, సర్వసమర్థుడు అయిన శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. శక్తిని పరులకు ఉపయోగపడేలా ఉపయోగించాలికాని పరులకు కీడుచేయడానికి కాదని జ్ఞానోపదేశం చేశాడు. మీ ఇద్దరి బలప్రదర్శనతో గొర్రెలకాపరి భయగ్రస్తుడై అనారోగ్యముతో రోగగ్రస్తుడైనాడని, ఒకరికొకరు బలప్రదర్శనగావిస్తే సృష్టి తలక్రిందులౌతుందని, ఎవరికర్తవ్యాన్ని వారు నెరవేర్చాలని ధర్మోపదేశాన్ని చేశాడు. సూర్యుడు–వాయుదేవుడు తమ అజ్ఞానానికి సిగ్గుతో తలవంచి శ్రీహరిని శరణుకోరి తమ విధులను యథావిధిగా నిర్వర్తించుటకు బయలుదేరారు.

ఇదేవిధంగా మనుష్యులైన మనము కూడా మానవత్వంతో భగవంతుడు మనకు నిర్దేశించిన కర్తవ్యాన్ని తెలుసుకొని దానిని అమలపరచాలి. ఏకారణంతో అయినా ఇంకొకరితో మనల్ని పోల్చుకోవడం, గొప్పలకు పోవడం మంచిది కాదు. మనల్ని సృష్టించిన భగవంతుడే గీతలో **స్వధర్మే నిధనం శ్రేయః.** అని అన్నాడు. కావున ఎవరి ధర్మాన్ని వారు నిర్వర్తించడం అన్ని విధాల శ్రేయస్కరం అన్న నీతిని గ్రహించాలి.

16. గురువుగారు! జ్యోతిషశాస్త్ర విషయంలో ఒక ప్రశ్న ప్రతీసారీ ఎదురవుతుంది. జాతక పరిశీలన చేసిన పిదప సత్యాసత్య నిర్ణయాలు ఏవిదంగా చేయాలి? కొన్ని సంధర్బాలలో నిజము చెప్పవలసి వస్తుంది. నిజము చెప్పినచో పృచ్ఛకుడి సమస్య మరింత అధికమవుతుంది. ఇలాంటి సంధర్భములో జ్యోతిష్కుడి కర్తవ్యమేమిటి?

మంచిప్రశ్న! ఇక్కడ మనం ముందుగా సత్యంయొక్క నిర్వచనాన్ని తెలుసుకోవాలి. సత్యం అంటే ఏమిటి? నిజం చెప్పడమా? అలా అనుకుంటే పొరబాటు. సత్యం అంటే నిజం చెప్పడమని అర్థం కాదు.

ఏ విషయం చెప్పడంతో ఇతరుల మనస్సుకు, హృదయానికి ఆనందం కలుగుతుందో, హితము కలుగుతుందో దానిని సత్యం అంటాము. అది అబద్ధమైనా సరే స్వార్థం చూసుకోకుండా ఇంకొకరి హితముకోరినట్లైతే అది సత్యం అవుతుంది. మనం చెప్పే విషయం నిజమయినప్పటికీ ఇంకొకరికి మనస్సును గాయపరచినట్లైతే దానిని అసత్యంగా పరిగణించబడుతుందని శ్రీకృష్ణుడు భగవద్గీతలో అర్జునుడికి వివరించాడు.

ఇక్కడ జ్యోతిషఫలాని వివరించునప్పుడు కూడా ఇదే పద్ధతిని ఆచరించాలి. వ్యక్తి జాతకము కఠోరమైన ఫలమును తెలియజేసినప్పటికీ దానిని నెమ్మదిగా శాంతంగా పృచ్ఛకుడి హృదయానికి గాయం కాకుండా హితముపలకాలి అదే జ్యోతిష్కుడి ప్రథమ కర్తవ్యం. ఈ సత్యాసత్య నిర్వచనాలను మరచి ఉన్నది ఉన్నట్లుగా చెప్పి పృచ్ఛకుడి సమస్యను మరింత తీవ్రము చేసినట్లైతే అది అసత్యానికి సమానమవుతుందని గ్రహించాలి. ఎల్లప్పుడూ సత్యమునే పలకాలి. కేవలం జ్యోతిషశాస్త్ర విషయంలో మాత్రమే కాదు ***సత్యమేవ జయతే*** అన్న మాటను అన్ని సంధర్భాలలోనూ మరువకూడదు. ఇలా సత్యంయొక్క నిర్వచనం తెలిసినట్లైతే సత్యం చెప్పడం పెద్ద కష్టమేమి కాదు.

ఇచ్చట గమనింపినట్లైతే సత్యం యొక్క నిర్వచనం భగవద్గీతనుండి తీసుకోబడినది. అలాగే ధర్మం, న్యాయం, అహింస మొదలగు విషయాల నిర్వచనం తెలిసినట్లైతే ఆచరించడం పెద్ద కష్టమైన పనేమే కాదు. అందుకే పరిపూర్ణజ్యోతిషశాస్త్ర ఫలాధ్యయనానికి జ్యోతిషంతో పాటు అన్నిశాస్త్ర విషయాలు కూడా తప్పనిసరి అని క్షుణ్ణంగా తెలియాలి.

17. గురువుగారు! ప్రస్తుత కాలంలో జ్యోతిష్యశాస్త్ర సేవలు మరియు ప్రచారం చాలా ఎక్కువగా వుంది. ఇంటర్నెట్ ద్వారా టెలివిజన్ ద్వారా ఎంతోమంది పండితులు జాతకాల గురించి, ప్రకృతిలో సంభవించు వైపరిత్యాల గురించి, ధరించవలసిన రత్నాల,వాస్తువాస్తవ్యాల గురించి తమదైన శైలిలో వ్యవహరిస్తున్నారు. వీటిపై మీ అభిప్రాయాన్ని తెలియజేయగలరు.

శిష్యా! మంచిప్రశ్న వేశావు.

అధ్యేతవ్యం బ్రాహ్మణై రేవ తస్మాత్ జ్యోతిశ్యాస్త్రం పుణ్యమేతద్రహస్యమ్ ।
ఏతద్బుధ్వా సమ్యగాప్నోతి తస్మాదర్థం ధర్మం మోక్షమగ్ర్యం యశశ్చ ॥

బ్రాహ్మణుడి ద్వారా ఈ శాస్త్రము అధ్యయనము చేయతగ్గది. జ్యోతిషశాస్త్రము పుణ్యప్రదమూ అతి రహస్యమూ అయినది. ఈ విషయాన్ని తెలుసుకొని అధ్యయనం చేసినట్లైతే దీనివలన ధర్మార్థాది చతుర్విధ ఫలములూ, యశస్సూ లభిస్తుందని శాస్త్రవచనం. కావున జ్యోతిషశాస్త్రం అతి రహస్యమైనది. సంధర్భానుసారంగా అవసరమున్న చోట మాత్రం జ్యోతిషశాస్త్ర ప్రయోజనాన్ని పొందదగినది. లౌకిక వాంఛాలైన అనగత్యమైన భోగాలకోసం ఈ అమౌల్యమైన శాస్త్రము ఉపయోగించుట భావ్యం కాదు.

కింకర్మకిమకర్మేతి కవయోఽత్రాపి మోహితాః॥

– ఏది కర్మ? ఏది అకర్మ? ఏది వికర్మ? ఏది ధర్మం? ఏది అధర్మం? అని ఖచ్చితంగా నిర్ధారించగలిగే పండితుడు ఇంతవరకూ పుట్టలేదు అని భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించాడు. ఎంత శాస్త్రజ్ఞానం పొందినా కూడా అందులోని సత్యాసత్య విషయాలను, ధర్మసూక్ష్మాలను అయోగ్యులు సరిగా కనిపెట్టలేరు.

సమస్యతో సతమవుతన్న వ్యక్తి భక్తి–శ్రద్ధలతో జ్యోతిష్కుడిని అశ్రయించి, శుభసూచకాలైన పూలు, ఫళ్ళు, చందనతాంబూలాదులను సమర్పించి దైవాన్ని స్మరించుకుంటూ మిక్కిలి వినయంతో తన సమస్యను జ్యోతిష్కుడికి వివరించాలి. జ్యోతిష్కుడు మీరు ప్రశ్న అడిగిన సమయాన్ని, మీజాతకాన్ని పరిశీలించి శాస్త్రశ్రద్ధతో సమస్యను పూర్తిగా అవగాహనపరచుకొని, హితమార్గాన్ని తెలియజేస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ చేయవలసిన నివారణోపాయాలను తెలియజేస్తాడు. భగవద్భక్తితో, జ్యోతిష్కుడి సలహాను

శ్రద్ధతో నిర్వర్తించినయెడల సర్వశుభమూకలుగును. అనారోగ్యముతో వున్నప్పుడు మాత్రమే మనం వైధ్యుడిని ఆశ్రయిస్తాము. అదే విదంగా సమస్యవున్నప్పుడు, శుభకార్యాల విషయంలో మాత్రమే జ్యోతిష్కుడిని ఆశ్రయించాలి. అనగత్యమైన ధనార్జన, శారీరక సుఖాల విషయాల తెలుసుకొనుటకు జ్యోతిష్కుడిని ఆశ్రయించరాదు. జ్యోతిష్కుడు కూడా పైవిదమైన ప్రాపంచిక విషయాలను, సుఖభోగాలగురించి ప్రశ్న అడిగిననూ వారికి శాశ్వతసంతోషాన్నిచ్చు హితమైన ధర్మమార్గాన్ని మాత్రమే తెలియజేయాలి. పృచ్ఛకుడు అడిగిన ప్రశ్నలో సత్యాంశాన్ని, నాణ్యతను పరిశీలించకుండా గ్రహపరిశీలన చేయరాదు. అలా చేసినయెడల అటువంటిప్రశ్నలకు దైవబలం తోడవదు, కాలధర్మం అనుకూలించదు. ముందు తాత్కాలిక సుఖాన్ని అందించినా చివరికి పాపకార్యానికి, దుఃఖానికి, నరకానికి కారణమవుతుంది. లౌఖికభోగాపేక్ష, ధనార్జన, కీర్తిప్రతిష్టలే ముఖ్యోద్దేశంగా ఈనాటి ప్రచారసాధనాలు ముందంజలో వున్నాయి. ఈ విషయాన్ని గ్రహించాలి.

18. ఆధునిక కాలంలో రత్నాలను ధరించుటద్వారా సమస్యల పరిష్కారం అవుతాయని జ్యోతిషశాస్త్ర వండితులు తెలియజేస్తున్నారు? సమస్యలనుండి బయటువడుటకు రత్నాలు నిజంగా దారి చూపగలదా?

రత్నాలు, రాళ్ల విషయానికి వస్తే మనప్రాచీనులు ఎప్పుడూ ఇలాంటి నివారణోపాయాలు ప్రోత్సహించలేదు. రత్నాలు, రాళ్ళు, యంత్రాలు మన కర్మలను మార్చలేవు. రాళ్ళు, రత్నాలు వేసుకోకపోయిన అనుకూలమైన సమయం వచ్చినప్పుడు మంచి జరగక తప్పదు. రత్నాలు వాడినంత మాత్రాన రాబోవు ముప్పు రాకతప్పదు. రత్నాలు, రాళ్ళు భగవంతుడి మీదనుండి శ్రద్ధ, భక్తులనుండి దూరం చేసి విశ్వాసాన్ని కోల్పోయేలా చేస్తాయి. రత్నాలపై, రాళ్ళపై విశ్వాసాన్ని కలిగించి సత్వరఫలాలకోసం అరాటవడేలా చేస్తాయి. ఇవి తాత్కాలిక ఆనందాన్నిచ్చినా సమస్యలకు శాశ్వత పరిష్కారాలను చూపలేవు. సమస్యలు వచ్చినప్పుడు గురువును, దైవాన్ని అశ్రయించడం తప్ప వేరే మార్గమూ ఏదీ లేదు. నవగ్రహాలు కూడా కాలాన్ని తెలిపే సూచకాలు మాత్రమే. మనిషియొక్క కర్మలను తెలియజేస్తాయే గాని శాసించలేవు, కర్తవ్యాన్ని నియంత్రించలేవు. ప్రతిమనిషికి ప్రాచీన కర్మములే సమస్యలకు కారణమవుతున్నాయి అన్న సత్యాన్ని గ్రహించాలి. మనిషి ఎల్లప్పుడూ తనపై ఆత్మవిశ్వాసాన్ని కలిగివుండాలి, దైవాన్ని ఎల్లప్పుడూ ఆరాధించాలి. గురువులు

దైవానుగ్రహంతో సమస్యల నుండి బయటపడగల జ్ఞానాన్ని మనకు ప్రసాదిస్తారు.

19. గురువుగారు! సమస్యలనివారణకు పూజలు, హోమాలు, జపాలు చేయుటవలన శీఘ్రఫలమును పొందవచ్చును అని అనేకమంది జ్యోతిష్కులు తమ సలహాలలో తెలియజేస్తున్నారు. వీటి ఆంతర్యాన్ని తెలియజేయగలరు?

జాతకాన్ని పరిశీలించే చాలామందికి తాముచెప్పిన సలహాలు ఖచ్చితంగా పనిచేయగలదని , తమ స్వానుభవానికి రాకపోయిననూ పృచ్ఛకులకు వాటి ఆచరణకు సంబంధించిన అంశాలను విశదీకరించుటయు వెన్నతోపెట్టిన విద్యగా మారింది. పృచ్ఛకులు కూడా జ్యోతిష్కుడు తెలిపిన మంత్రపఠనం, జపం, హోమం మొదలగునవి అర్థంకాకపోయినా పుణ్యకార్యమని భావించి ఆచరిస్తారు. అదిమంచిదే కాని వాటిలో ఒక ప్రమాదమున్నది. మంత్రపఠనంలో కేవలం అక్షరాలు ఉచ్చారణ ద్వారా, గుడిలో విగ్రహానికి సమర్పించు పాలు, నెయ్యి, తేనె, పళ్ళ ద్వారా, హోమంలో ఉపయోగించు సమిదెలు, నెయ్యి మొదలగు హోమద్రవ్యాల ద్వారా సమస్తపాపాలు పరిహారమగునని ధైర్యము కలుగు సంభవము కలదు. మనలో విశేషముగా నామస్మరణము, నామసంకీర్తన మొదలగు అంశాలు అత్యంత ఆదరణలో వున్నాయి, ప్రశంశించబడ్డాయి. నామస్మరణము, గ్రంథపారాయణము కేవలం సాధనాలు మాత్రమే. దేనికి సాధనం? మన మనస్సును భగవంతుడిపైపు త్రిప్పుటకు సాధనాలు. మనస్సు భగవంతుడిపైపు పెట్టక చేయు పూజ, హోమము, జపము నిష్ఫలమగును. దుష్కార్యము గావించి దానియొక్క దోషము అతను చేయు పూజ, హోమాదుల ఆచరణతో నివారణయైనదని భ్రాంతిపడు ప్రమాదముకలదు. **పత్రం, పుష్పం, ఫలం తోయం** అని భగద్గీతలో చెప్పినట్లు భగవంతుడిపై శ్రద్ధాభక్తులతో, ప్రేమతో, మిక్కిలి వినయంతో ఫలముకాని, పత్రముగాని సమర్పించిననూ అనుగ్రహించెదనని భగవానుడు భగవద్గీతలో పేర్కొన్నాడు. పాపకార్యములు చేస్తూ సమస్యలను అధిగమించుటకు వేలకొద్దీ పుష్పములు, కడవలకొద్దీ పాలు, నెయ్యితో అభిషేకించినా ఏమి ఫలం? అది నిష్ఫలం మాత్రమే. కావున మనస్సులో భగవంతుడిని ధ్యానిస్తూ చేయదగు ప్రతి కార్యమూ భగవంతుడికి చేరుతుంది. యాంత్రికమైన పూజలు ప్రయోజనాన్నందించలేవు. శ్రద్ధతో కలిగిన పూజ, హోమం, జపం ప్రధానం. సంఖ్య ముఖ్యం కాదు.

మనస్సులో భగవద్భక్తి ప్రధానం.

యాంత్రికజీవనమునకు అలవాటుపడిన ఈ నాటి జనులు శ్రద్ధభక్తులు మనస్సులో నింపడంలో విఫలమవుతున్నారు. యాంత్రికమయిన ఉపాయాలతో భగవదారాధన గావిస్తున్నారు. ***అధ్యాత్మికత*** అన్న పదం అరుదు అయినది. మానసిక స్థితి కేవలం విషయభోగాలపైనే దృష్టి సారిస్తున్నది. విగ్రహారాధనపైన, స్వామివారికి అభిషేకం చేయునపుడు ఎంతపాలు పోశారు, ఏఏ పళ్ళూ అభిషేకానికి ఉపయోగించారు? ఎంత బంగారం భగవంతుడి విగ్రహంపై అలంకరించారు? ఎన్ని రకాల పూలను అలంకరణకు వినియోగించారు? మొదలైన భావ్యాసంబందిత విషయాలపైనే దృష్టిని కలిగివుంటారు కాని భగవంతుడి గుణగణాలను, అతడు మానవాళికి చేయు ఉపకారం ఇవన్నియూ మననంచేస్తూ స్మరించు పూజచేయువారు అరుదు. ఇక్కడ శాశ్వతమైన ఆనందానికి, సమస్యలనుండి రక్షణపొందడానికి జ్ఞానపూర్వక భక్తియే ప్రధాన మార్గం.

భగవంతుడిపై భక్తి కేవలం పూలు, పళ్ళు, వస్త్ర–అభరణాలంకారలతో వచ్చు లక్షణం కాదు. అది భగవంతుడిపై గల జ్ఞానంతో ముడిపడినది. మన భాషాశాస్త్రం ప్రకారం భక్తి అనగా అత్యంతప్రేమ అని అర్థం. మనిషిలో ఆ ప్రేమ వయస్సును బట్టి పద ప్రయోగం మారుతుంది. ఉదాహరణకు చిన్నపిల్లల పైగల ప్రేమను **వాత్సల్యం** అంటాం, సమానమైన వయస్సుగలవారిపై గల ప్రేమను **స్నేహం** అంటాం, వయస్సులో పెద్దవారిపై గల ప్రేమను **గౌరవం** అంటాం, ముఖ్యంగా కనిపించని మహానుభావులపై గల ప్రేమను **భక్తి** అని తెలుసుకోవాలి. ఇక్కడ మనం మనపిల్లలపట్ల, స్నేహితులపట్ల, పెద్దలపట్ల ఏవిధమైన ప్రేమ కలిగియుంటామో దానికంటే మిక్కిలి ప్రేమను భగవంతుడిపై కూడా కలిగియుండాలి అదే నిజమైన భక్తి. ఈ విదమైన ప్రేమను భగవంతుడిమీద కలగాలంటే భగవంతుడిని, అతడ సర్వోత్తమత్వాన్ని శ్రద్ధతో అధ్యయనం చేసి అతని మహాత్మ్యజ్ఞాన్ని బాగా తెలుసుకోవలసి వుంటుంది. ఇప్పుడు కొన్ని అంశాలను పరిశీలిద్దాం.

మన జీవితంలో ఒక చిన్న సహాయాన్ని చేసిన స్నేహితుడిపై అమితమైన ప్రేమను కలిగి వుంటాం. సహాయం చేసిన వారిని జీవితాంతము మరచిపోలేము. అదేవిదంగా భగవంతుడు మనకు కనిపించకుండా, మనకు తెలియకుండా ఎంతో సహాయ సహకారాలనందిస్తున్నాడు. మనకు ఉదయం నిద్రలేవగాని కాఫీ త్రాగే అలవాటుందనుకుందాం! కాఫీ తయారుచేయాలంటే పాలు, కాఫీపొడి, చక్కెర మొదలగు పధార్థాలు కావాలి. వాటన్నిటిని ఎవరు మనకు అందిస్తున్నారు. పాలకోసం భగవంతుడు గోవును సృష్టించాడు, పాలు పితుకుటకు మనిషిని పోషిస్తున్నాడు, ఎక్కడో కొండప్రాంతాలలో కాఫీతోటలను కర్షకులచే పండిస్తున్నాడు. కార్మికులచే కాఫీపొడీని తయారుచేయించి, మన ఇంటిదాకా తెచ్చే ఏర్పాటు చేస్తున్నాడు. ఇలా ప్రతిరోజూ, ప్రతిఒక్కరి మంచిచెడ్డలూ చూస్తున్నాడు. మనం ప్రతిరోజూ తీసుకొనే ఆహారపదార్థాలు ఎవరు తయారుచేయిస్తున్నారు? మనం సుఖంగా రాత్రి నిద్రించాలంటే ఫ్యాన్, ఎ.సి. కావలసిన విద్యుత్తును రేయింబవళ్ళు ఎవరు తయారుచేయించి అందిస్తున్నారు? మనము కంటితో చూస్తాము, చెవితో వింటాము, చేయితో చేస్తాము, కాళ్ళతో నడస్తాము, ఇవన్ని భగవంతుడు మనకు ఇచ్చిన మరవలేని వరములే, మనము ప్రతిక్షణం అడుతున్న ఊపిరికూడా అతనిదే, ఆతనిలేదే ఒక అడుగు కూడాముందు వేయలేము. ఇలా చెప్పుకుంటూ పోతే పుట్టినప్పటినుండీ మరణించునంతవరకూ ప్రతి ఒక్క సంధర్భములో మనకు కావలసినవి, హితమైనవాటిని సమకూర్చుతూ మన నుండీ ఏవిధమైన ఫలాన్ని ఆశించని మంచి నేస్తం భగవంతుడు మాత్రమే కదా! అలాంటి స్నేహితుడిపై (భగవంతుడిపై) ఎలాంటి భక్తి (ప్రేమ) కలిగియుండాలి? ఇలా ప్రతిరోజూ, ప్రతిక్షణం మనం భగవంతుడి గురించి జ్ఞానం సంపాదించగలిగితే భక్తి తనంతటతానుగా కలుగుతుంది. ఎవరి ప్రోత్సాహ, సహాయసహకారాలు అవసరం లేదు. భక్తి ధనముతోనో, పూజతోనో, సాంప్రదాయంతోనో వచ్చునది కాదు. జ్ఞానముతోను అనుభవముతోను వచ్చునదని గ్రహించాలి. ఇలాంటి భక్తి భగవంతుడిపై కలిగినట్లైతే మనసమస్యలకు పరిష్కారం దొరికినట్లే.

20. **గురువుగారు! చాలా మట్టుకు వార్తాపత్రికలు, టెలివిజన్ చానల్సు యుగాంతమని, మనిషిమనుగడ అంతరించు సమయం ఆసన్నమయినదని భయబ్రాంతులను కలుగజేస్తున్నారు. ఇది ఎంతవరకూ సత్యం? వివరించగలరు?**

మంచిప్రశ్న! యుగాంతము, ప్రళయము మొదలగు అంశాలను అధ్యయనం చేయునప్పుడు వాటికి సంబంధించిన పూర్వజ్ఞానాన్ని తెలుసుకోవాలి. యుగమంటే ఏమిటి? యుగానికి గలప్రమాణమేది? ఇప్పుడు ఏ యుగములో వున్నాము? ఇప్పుడు ఎన్ని సంవత్సరాలు గతించాయి? సృష్టి ఆరంభమునుండి ఇది ఎన్నవ యుగము? మొదలగు అంశాలను దృష్టిలో వుంచుకోవాలి. పై విషయాలను ఇప్పుడు మనం పరిశీలిద్దాం.

ముందుగా కాలాన్ని గుర్తించే అంశాలను చూద్దాం. రోజుకు 24 హోరలు (గంటలు), 6 యామాలు, 15 రోజులు ఒక పక్షము, 2 పక్షములు ఒక మాసము, 12 మాసములు ఒక సంవత్సరము. 4 లక్షలా 32 వేల సంవత్సరాలు ఒక కలియుగం, 2 కలియుగములు ఒక ద్వాపరయుగము, 3 కలియుగములు ఒక త్రేతాయుగము, 4 కలియుగములు ఒక కృతయుగము, కృత,త్రేతా,ద్వాపర,కలియుగములు నాలుగునూ కలిపి ఒక మహాయుగము(మొత్తము 4 కోట్ల 32 లక్షల సంవత్సరాలు), 71 మహాయుగాలు ఒక మన్వంతరము, 14 మన్వంతరములు బ్రహ్మకు ఒకపగలు, 28 మన్వంతరములు ఒకదినము, అలాంటి 360 దినములు బ్రహ్మకు ఒక సంవత్సరము. ప్రస్తుతము బ్రహ్మకు 50 దివ్యసంవత్సరములు అనగా బ్రహ్మకు 7,77,60,00,00,000 సంవత్సరములు నిండినది. బ్రహ్మయొక్క ఆయుర్దాయము 1,555,200,000,000 సంవత్సరములు. ప్రస్తుతం మనం 28వ కలియుగములో వున్నాము. కలియుగములో 5113 సంవత్సరములు గతించినది. ఇలా యుగానికి సంబంధించిన పూర్తి అంశాలను అధ్యయనం చేయాలి, ఆతరువాత ప్రళయములు ఎన్ని రకాలు, ఏ సమయంలో ఏ ప్రళయం వస్తుంది అన్న విషయాన్ని అధ్యయనం చేయాలి. అప్పుడుగాని యుగాంతం అన్న విషయానికి సరియైన నిర్ణయానికి రాలేము.

కలియుగము అంతమగుటకు ఇంకనూ 4 లక్షలా 26 వేల 8 వందలా 87 సంవత్సరములు కలవు. కావున ఆధునిక పరిశోధకుల వాక్యాలకు అర్థం లేదని గ్రహించాలి. శాస్త్రజ్ఞానం లేనివారు యుగానిగురించి, ప్రళయాలగురించి మాట్లాడడం హాస్యాస్పదం. వాటిని విశ్వసించడం అజ్ఞానం, మూర్ఖత్వం.

21. గురువుగారూ! సామాన్య జనులు, పూజలు, హోమాలు, యాగాలు, అభిషేకాలు చేయలేనివారు, చేయుటకు అధికారములేనివారు సుఖమయమగు జీవనము గడుపుటకు చేయదగిన పనిని, మార్గాన్ని తెలియజేయగలరని అర్థిస్తున్నాను.

శిష్యా! అందరికీ ఉపయోగపడే ప్రశ్నను వేశావు. సంతోషం దీనికి సమాధానం భగవద్గీతలో మనకు కనిపిస్తుంది. అన్నిజాతులవారు, అన్నిమతాలవారు, అన్ని కాలాలలోనూ చేయవలసిన కర్తవ్యకర్మలను శ్రీకృష్ణుడు 18వ అధ్యాయంలో తెలియజేశాడు. వాటిని పరిశీలిద్దాం.

యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।
యజ్ఞోధానం తపశ్చైవ పావనాని మనీషిణామ్ ॥

యజ్ఞం, ధానం, తపస్సు అను ఈ మూడు కర్తవ్యకర్మలూ విడువకుండా శ్రద్ధతో చేసినట్లైతే మానవజీవనం పావనమగునని తాత్పర్యం. ఈ మూడు కర్తవ్యకర్మల ద్వారా మంచి కర్మఫలములు కలుగును. ఫలాపేక్షరహితమైన నివృత్తిమార్గములో పయనించినట్లైతే జన్మరాహిత్యమైన మోక్షము కలుగును. కావున ప్రతి మనిషీ జాతి, మత భేదములేకుండా, దేశ, కాల, పరిస్తితులను అనుసరించి కఠోపనిషత్తులో చెప్పిన విధముగా శ్రేయోమార్గములో నివృత్తికర్మమును చేయదగినది. ఇది సనాతన ధర్మ వచనము, సార్వకాలీనమైన కర్తవ్యధర్మము. ఈ మూడుకర్మలను స్థూలంగా పరిశీలించినట్లైతే ఆధునిక కాలంలో ఆచరించుట అందరికి కష్టమని అనిపిస్తుంది. కాని వీటి నిర్వచనాలను తెలుసుకున్నట్లైతే ఆచరించడం పెద్ద కష్టమైన మనేమీ కాదు.

యజ్ఞ మనగా హోమగుండం ఏర్పరచి, హోమద్రవ్యములను సమకూర్చుకొని, నెయ్యి, ఆహుతుల ద్వారా ఒనర్చు క్రియ అని మనలో చాలామందికి తెలిసిన విషయం. కాని యజ్ఞం"అను శబ్దానికి నానా

అర్థాలున్నాయి. యజ్ఞమనగా దేవుడి పూజ అని అర్థం. దేవుడిని పూజించుటకు చాలా మార్గాలున్నాయి. ఇళ్ళలోనే పూజాగదిలో దేవుడికి పూలు, పళ్ళు, నైవేద్యం శ్రద్ధతో అర్పించి చేయు పూజ. గుడికి వెళ్ళి విగ్రహదర్శనము చేయడం, లేక మనస్సులోనే భగవంతుడిని భక్తితో స్మరించడం...మొదలైనవన్నీ యజ్ఞము క్రిందికే వస్తాయి. ఇక్కడ యజ్ఞం అనగా భగవంతుడిని భక్తితో పూజించడం అన్నమాట. భక్తి అనునది యాంత్రికంగా ఒనర్చు కర్మ కాదని గుర్తుంచుకోవాలి. భగవంతుడిపై ప్రేమతో పత్రమో, ఫలమో, పుష్పమో, జలమో... మొదలగునవి ఏది సమర్పించినా యజ్ఞము పరిపూర్ణమవుతుంది.

ఇక దానము విషయానికి వస్తే ఏమి దానం చేయాలి? సువర్ణదానమా? నవగ్రహ ధాన్యదానమా? ఎంత దానం చేయాలి మొదలైన ప్రశ్నలన్నీ బయలుదేరుతాయి. ఈ విషయంలో కూడా సరియైన నిర్వచనం తెలుసుకున్నట్లైతే దానం చేయడం పెద్ద కష్టమేమీ కాదు. దానం అన్న శబ్దానికి అర్థం ఏమిటంటే ఆపదలో వున్నవాడికి నీ దగ్గర పుష్కలంగా వున్నదానిని ప్రామాణికంగా అతని సమర్పించి ఆదుకోవడం అన్నమాట. దానం చేయుటకోసం ప్రాయాసపడనక్కరలేదు. మన దగ్గర ఎక్కువగా వున్నదానిని లేనివాడికి పేరుప్రఖ్యాతలకోసం ఆరాటపడక ప్రామాణికంగా దానం చేయాలి. ఇది అన్ని వస్తువులకు వర్తిస్తుంది. మనకు రెండురోజులకు సరిపడు ఆహారం వుందనుకుందాం, దానిని ఆహారముకోసం అలమటించువానికి ఒకరోజుకు సరిపడు భోజనము అందించాలి. ఒకరికొకరు పరస్పర సహాయం చేసుకొనుటకు భగవంతుడు దానం అను కర్తవ్యకర్మను లోకానికి అందించాడు. దీనినే మంచి బ్రహ్మాజ్ఞానియైన వారికి, సదాచారికి ఇచ్చినట్లైతే సత్పాత్ర దానం అని అంటారు. ఇది చాల పలప్రదమైనది. ఆపదలోవున్నవాడిని గుర్తించి ఆదుకొను దానం కూడ దానమే. కాని ప్రస్తుత కాలంలో ఈ విషయాన్ని మరచారు. వస్తువులు సంవృద్ధిగా వున్నవారు, వున్నవారికే ధానం చేస్తూ పేరుప్రఖ్యాతలకోసం ప్రాకులాడుతున్నారు. ఇది సత్పాత్రధానం అనిపించుకోదు. ఉన్నవాడు ఉన్నవాడికే సందర్భములేకుండా, అగత్యములేని వస్తువులను దానంచేయుటలో ఏవిధమైన ప్రయోజనమూ ఫలమూ ఉండదు. ఇష్టము వచ్చినవారికి సువర్ణదానం, రజతపాత్రలు దానంచేయడం, వేలకొద్దీ దక్షిణలివ్వడం సత్పాత్రదానం అనిపించుకోదు. కష్టాలలోవున్నవారిని ఆదుకోవడమే దానం యొక్క ప్రధాన లక్షణం.

తపస్సు విషయానికొస్తే మనల్ని మనం తెలుసుకోవడం అన్న మాట. ఏకాగ్రతతో మనస్సును భగవంతుడిమీద లగ్నంచేసి చేయు ధ్యానాన్ని తపస్సు అంటారు. ధ్యానం ద్వారా జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు. మనల్ని మనం గుర్తించుటలో, మనకర్తవ్యము, మోక్షమార్గము తెలుసుకొనుటలో తపస్సు సహాయపడుతుంది.

యజ్ఞం భగవంతుడిని ప్రార్థించుటకు, దానం లోకహితము కొరకు, తపస్సు జ్ఞానాన్ని పెంపొందించుకొనుటకు. ఈ మూడు కర్తవ్యకర్మలను శ్రద్ధతో చేసినవారికి ఏవిధమైన సమస్యలు దరిచేరవు. ఈ మూడు కర్మలూ ఎవరైనా చేయవచ్చు. జాతి, మత భేదంలేదు. దేశ, కాల, పరిస్థితులతో సంభందం లేదు. భగవద్గీతలో భగవానుడుచెప్పిన హితమైన మార్గముకూడా ఇదే అని గ్రహించాలి.

22. గురువుగారూ! సమస్యలనుండి శాశ్వత విముక్తి పొందుటకు గల మార్గమేమిటి? మరియు జ్యోతిషశాస్త్రం నేర్చుకోవడం వలన కలుగు ప్రయోజనాలేమిటి?

సదాచారము, ధర్మాచరణలేకుండా, అజ్ఞానంతో, శ్రద్ధ, భక్తి ప్రధానము కాకుండా ఎన్ని పూజలు, హోమాలు, ధానాలు చేసినా తాత్కాలిక ఉపశమనాన్ని పొందగలరే గాని శాశ్వతమైన సుఖాన్ని, సంతోషాన్ని పొందలేరు. జీవుడియొక్క సంచిత, ప్రారబ్దకర్మలననుసరించే సమస్యలు ఏర్పడతాయి. సమస్యలను అనుభవించిన ఎడల ఒక్కొక్క కర్మ నశిస్తాయి. ఒకవేళ కర్మను అనుభవింపక ప్రత్యమ్నాయ మార్గము వెతికిననూ ఏదో ఒక జన్మలో ఆ కర్మను అనుభవింపక తప్పదు. సమస్యలనుండి శాశ్వత విముక్తి పొందాలంటే శ్రీహరియొక్క సర్వోత్తమత్వజ్ఞానము సంపాదనే ప్రధానం. ఆ జ్ఞానంతో మనిషియొక్క జీవనశైలిలో మార్పు వస్తుంది. సదాచారానికి దగ్గరవుతాడు. ***"జ్ఞానాగ్ని దగ్ధకర్మాణి"*** అన్న వాక్యంలో విశేషమైన శ్రీహరిజ్ఞానంతో కర్మను భస్మీపటలం చేయవచ్చు. కావున శ్రీహరిసర్వోత్తమత్వజ్ఞానమున సంపాదనయే పుట్టిన జీవికి ప్రధానమైన అంశం.

జ్యోతిషశాస్త్రముకూడా అలాంటి జ్ఞానాన్ని అందించే ఒక ముఖ్యమైన శాస్త్రమే. జ్యోతిషశాస్త్రము వేదములకు కళ్ళవంటిది. దీనిని భక్తి, శ్రద్ధలతో మంచి గురువు ద్వారా అభ్యసించడం ద్వారా అపరిమితమైన శ్రీహరియొక్క మాహాత్మ్యజ్ఞానాన్ని, కాలనియమాలను తెలుసుకోవచ్చు. ఏవిధమైన పనులకు ఎలాంటి కర్మలు ఏర్పడతాయి? మంచి కర్మలు చెడుకర్మలు ఏ సమయంలో అనుభవించవలసి వస్తుంది? అప్పుడు తీసుకొనవలసిన జాగ్రత్తలేమిటి? సమస్యలు వచ్చు సమయంలో మనస్సు యొక్క స్థితి ఏవిదంగా వుంటుంది? సమస్యల ద్వారా నేను తెలుసుకొనవలసిన సత్యమేమిటి? నీతి, గుణపాటం ఏమిటి? నా ప్రయాణం ఎటు? ప్రవృత్తి మార్గమా లేక నివృత్తి మార్గమా? మొదలగు అధ్యాత్మిక విషయ జ్ఞానాన్ని కూడా జ్యోతిషశాస్త్రం ద్వారా అధ్యయనం చేయవచ్చు. మనిషి కోరికలు ఏ స్థాయివరకు తృప్తినిస్తాయి మరియు వాటి సరిహద్దులను శాస్త్రజ్ఞానంతో తెలుసుకోవచ్చు.

సమస్యలను ముందే పసిగట్టగలిగితే మనస్సును ముందుగా సిద్దపరచుట సులభము. మనిషిజీవనానికి సంబంధించిన శ్రీహరియొక్క మహాత్మ్యజ్ఞానము జ్యోతిషశాస్త్రంలో పుష్కలంగ లభిస్తుంది. కావున మహాత్మ్యజ్నానసంపాదన, మరియు సాధనకు ఉపక్రమించినవారికి జ్యోతిషశాస్త్రం ఎంతో ఉపయోగపడుతుంది. సమస్యలతో సతమతమైవారికి జీవితంలో ఊరటకలిగిస్తుంది. కర్తవ్యకర్మలు చేయువారికి పరోపకారానికి ఈ శాస్త్రం ఉపయుక్తమవుతుంది. వేదాలు, అన్నిశాస్త్రాలు తెలిపే గమ్యం మోక్షం. జ్యోతిషశాస్త్రం అన్ని శాస్త్రలకు వేదాలకు ముడిపడివుంది కావున మోక్షసాధనకు, గమ్యాన్ని తెలుసుకొనుటకు కేంద్రబిందువువలె వ్యవహరిస్తుంది.

23. గురువుగారూ! ప్రస్తుతము మనకు చాలా పంచాంగములు అందుబాటులో వున్నాయి? వాటిలో తెలిపిన తిథి, నక్షత్రము మొదలగు అంశాలు ఒక్కొక్క పంచాగములో ఒకో విధంగా సూచింపబడ్డాయి. గ్రహాల గమనములను ఖచ్చితంగా చెప్పగల ఖగోళయంత్రపరిజ్ఞానము వున్ననూ ఈ భేదాబిప్రాయాలు ఎందుకు తలెత్తుతున్నాయి? వివరించగలరు.

శిష్యా! ఇది చాలా క్లిష్టమైన ప్రశ్న. సామాన్య జ్ఞానంతో అర్థంచేసుకొనుట కొంచెం కష్టమే! ఈ ప్రశ్నకు సమాధానం అతి నిగూఢమైనది. చర్చించుటకు వీలుకానిది. తర్క-విమర్శలకు లోబడనిది. ఈ విషయం విచక్షణా జ్ఞానంతో అర్థం చేసుకొదగినది.

పురాతనకాలంలో పంచాంగం ప్రత్యేక విభాగంగా వుండేది కాదు. మనము గడియారము చూసి సమయాన్ని ఏవిధంగా చెప్పగలమో అదే విధంగా వారు తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం, గ్రహచారం, గ్రహణం, షడ్వర్గులు చూచుట మొదలైనవి అతి చిన్న వయసునుండే అభ్యసించి తెలుసుకొనేవారు. వారియొక్క వాతావరణ పరిస్థితులు, సహజీవనం ఇలాంటి విషయాలకు సహకరించేవి. తర్క-విమర్శలకు దూరంగా వుండేవారు.

ఈనాడు మనకు అటువంటి పరిస్థితిలేదు. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ అభివృద్ధిచెందుతుండడంతో జనుల వ్యాపారవ్యవహారములకు పాశ్చాత్య సమయసూచనా పద్ధతిని అనగా Seconds, Minutes, Hours, Day, Month, Year మొదలైన అంశాల ద్వారా సమయాన్ని, రోజులను తెలుకొంటున్నారు. ఇప్పటివారి జీవనవిధానం, వ్యాపారం పాశ్చాత్య సంస్కృతి ఆధారంగా నడుస్తుండడం విస్మయం. ఇచ్చట సమస్య ఏమిటంటే ప్రయాణానికి ఏ సమయం మంచిది? వివాహానికి యోగ్యమైన సమయం ఏది? ఏ రోజున వ్యాపారం మొదలు పెడితే కలసివస్తుంది? వాహనం కొనాలంటే ఏ రోజు మంచిది? డాక్టరు ఏ సమయంలో శస్త్రచికిత్సచేయాలి? ఇలాంటి వందలాది ప్రశ్నలకు పాశ్చాత్య సమయసూచనా పద్ధతి దారి చూపగలదా? వివాహానికి సెప్టెంబరు నెల మంచిదా లేక అక్టోబరా? ఉదయం 9:00 గంటలకు మంచిదా లేక 10:00 గంటలకా?

పై ప్రశ్నలకు సమాధానాన్ని పాశ్చాత్య సమయసూచనా పద్ధతి ఉపయోగపడదు. దీనికి సమాధానం కేవలం వైదిక సమయసూచనా పద్ధతిమాత్రమే ఖచ్చితంగా వివరించగలుగుతుంది. అలాంటి పద్ధతిని మనం వదలి చాలా కాలం అయ్యింది. వాటిని సమగ్రంగా తెలుసుకొని ఆచరణలో పెట్టువారు కరువయ్యారు.

మన హిందూ సాంప్రదాయ సమయసూచనా పద్ధతికి ఆదరణలేకపోవడంతో సమస్యలు వచ్చినపుడు జ్యోతిష్కులవద్దకు పరుగులు తీస్తున్నాం. ఇది ఒక భాగమైతే జ్యోతిష్కుల ద్వారా గణించిన పంచాంగాలలోని భిన్నాంశాలు మరొక భాగం. ఒక పంచాంగంలో తెలిపిన అంశాలకు ఇంకొక పంచాంగంలోని అంశాలకు పోలికే వుండదు. ఇలాంటి సంధర్భాలలో ఏ పంచాంగాన్ని ఎన్నుకొనవలెను? అన్న సమస్య మనలో చాలామందికి ఉదయిస్తుంది. విషయాన్ని లోతుగా పరిశీలిస్తే పూర్వం జ్ఞానులకు సమయాన్ని తెలుసుకొనుటకు మనకున్నట్లు కృత్రిమ ఉపగ్రహాలు, సాంకేతిక పరిజ్ఞానం వుండేవి కావు. ప్రస్తుతం మనకు రాకెట్లద్వారా అందిన గ్రహసమాచారాల ద్వారా సమయాన్ని తెలుసుకుంటున్నాము. ఉపగ్రహం అందించిన గ్రహగణిత వివరాలకు సిద్ధాంతసంస్కారాలు చేసి వాటి ద్వారా పంచాంగములను గణిస్తున్నారు. ఉపగ్రహాలు గ్రహాల అక్షాంశ, రేకాంశాల వివరాలను ఒకేవిధంగా తెలియజేసినా ప్రతి జ్యోతిషపండితుడు తనదైనశైలిలో సిద్ధాంత సంస్కారాలు చేయుట చేత పంచాంగంలోని అంశాలలో భేధాభిప్రాయాలు తలెత్తుతున్నాయి. ఇలాంటి సంధర్భములో తర్క–విమర్శలకు తావివ్వకుండా గురువును ఆశ్రయించి, గురువుయొక్క వచనాలకు కట్టుబడివుండాలి. **"స్వధర్మే నిధనం శ్రేయః"** అని భగవానుడే భగవద్గీతలో చెప్పినపుడు ఇంకా ఈ తర్క–విమర్శలేమిటి! ఎవరి ధర్మాన్ని వారు ఆచరించాలి. వారివారి గురువులు తెలిపిన పంచాగవిశేషాలను శ్రద్ధతో పాటించాలి. వేరొకపంచాగముపై గాని, పంచాంగ కర్తపైగాని తర్క–విమర్శలు చేయరాదు. మనయొక్క సాంప్రదాయాన్ని, ధర్మాన్ని మొదట మనం గౌరవించాలి. ఇలాంటి పంచాంగ విశేషాలను చర్చించుటకు సమయాన్ని వృథాచేయకుండా విశేషజ్ఞాన సంపాదనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలి. శాస్త్రాన్ని భక్తిశ్రద్ధలతో అధ్యయనం చేయగలిగితే శాస్త్రమే ఇలాంటి ప్రశ్నలకు సమాధానం తెలుపుతుందన్న సత్యాన్ని గ్రహించాలి.

24. గురువుగారూ! సాంకేతిక ప్రచారసాధనాలు జ్ఞానాన్ని శాసిస్తున్న ప్రస్తుతకాలంలో ప్రతిరోజూ ఉదయం టెలివిజన్ లోని ప్రతి చానల్ నందు "రాశిఫలాల" గురించి భిన్నమైన అభిప్రాయాలను వింటున్నాము, గ్రహాలమంచిచెడ్డలు, అనుకూలమైనసంఖ్య, విదేశీయానం, ధరించవలసిన రత్నం, జపించవలసిన శ్లోకాల సంఖ్య మొదలగు అంశాలగురించి అతి తక్కువ సమయంలో ఫోన్ ద్వారా అడిగి పరిష్కారమార్గాన్ని తెలుసుకుంటున్నాము. అతి తక్కువ సమయంలో ఫల నిర్ధారణ చేయుటకు గల మార్గమును (దొడ్డిదారి) తెలుపగలరు.

శిష్యా! నీవు అడిగిన ఈ ప్రశ్న ఆశ్చర్యకరంగానూ, హాస్యప్రదముగాను వున్నది. పైప్రశ్నయొక్క ఆంతర్యాన్ని ముందుగా తెలుసుకుందాం.

ప్రస్తుత జ్యోతిషశాస్త్రాధ్యయనము శాస్త్రశ్రద్ధకు లోబడక స్వతంత్రబుద్ధితో ఫలనిర్ణయము గావించుటకు దోహదవడుతున్నది. చాలామంది పండితులు వేదాలు, ఉపనిషత్తులు, కర్మసిద్ధాంతము తెలిపిన ధర్మసూక్ష్మాలను, హితమార్గాలనూ ప్రక్కనబెడుతూ ఐహికసుఖభోగములను ప్రేరేపించు అంశములను జ్యోతిషశాస్త్రము ద్వారా విశ్లేషించి ఫలభోదన చేయబడుతున్నది. ఇటువంటి పద్ధతి ద్వారా మనిషిలో ప్రవృత్తిమార్గాసక్తిని పెంచి తాత్కాలికమైన సుఖభోగాలపై కోరికలను పెంచి శాశ్వతమగు దుఃఖమునకు కారణమగుచున్నది. ఇక్కడ భగవానుడు భగవద్గీతలో చెప్పిన ఒక శ్లోకాన్ని తీసుకున్నట్లైతే...

శ్లో॥ జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః

మనిషికి జ్ఞానంతో కూడిన విజ్ఞానం తృప్తినిస్తుందని (Contentment) తాత్పర్యం. కాని ఈనాటి జ్యోతిర్విజ్ఞానం మనిషిని ప్రవృత్తిమార్గంలో ప్రేరేపించి, సుఖభోగాలపై ఆసక్తినిపెంచి, భోగానంతరము శాశ్వతమగు దుఃఖమును ప్రసాధించుచున్న దిశలో ఉన్నట్లు జ్యోతిష్కులు చూపుతున్నారు. శ్రీకృష్ణుడి శ్లోకం ప్రకారం జ్ఞాన,విజ్ఞానాలు రెండూ మనిషికి తృప్తినివ్వాలి. ఇచ్చట అలా జరుగుటలేదు. దీనికి కారణం శాస్త్రశ్రద్ధకు లోబడని స్వతంత్రబుద్ధితో పొందిన జ్ఞానం, వేదశాస్త్రాలతో సంబంధంలేని ఆధునిక విజ్ఞానం. వీటివలన మనిషి అతృప్తికి లోనై, అమితమైన కోరికలతో తాత్కాలికమైన లౌకిక క్షణికసుఖాలనే నిజసుఖమని భ్రమతో శాశ్వతమైన దుఃఖాన్ని పొందుతున్నాడు.

నీవు అడిగన రాశిఫలాలు విషయానికి వద్దాం. ఇచ్చట రాశియనగా జన్మరాశియని అర్థం. జననకాలమున చంద్రుడు ఏరాశియందుండునో ఆరాశి జన్మరాశియగును. ఒకవిషయాన్ని ఇచ్చటలోతుగా

పరిశీలిస్తే, వున్న రాశులు 12. అనగా ఎవరైనా 12 రాశులలో ఏదోఒక రాశిలో చంద్రుడుండగా జన్మించి ఉండాలి. అనగా పుట్టిన ప్రతి ఒక్కరికీ 12 రాశులలో ఏదో ఒకటి జన్మరాశియగును. ఇక్కడ మనకు ఒక ప్రశ్న ఉదయించాలి. రాశిఫలాల ఆధారంగా చెప్పు ఫలాలు అందరికీ ఒకే విధంగా ఎలావుంటాయి? ఈ ఫలాలు అందరిపై సమానమైన ప్రభావాన్ని చూపగలుగుతుందా? చెప్పినవి కొందరికి జరుగుటకు కొందరికి జరగపోవుటకు గల కారణాలేవి? ఇలాంటి ప్రశ్నలు టెలివిజన్ లో కార్యక్రమం చూస్తున్నవారికి కనిపించవు. ఎవరికి వారియొక్క యోగక్షేమాలు, శుభావకాశాలు వినవలెనని ఆసక్తిని కలిగియుంటారు.

జ్యోతిషశాస్త్రప్రకారం పరిశీలిస్తే చంద్రుడు మనస్సునకు కారకుడు. మనం ఏ పని చేయాలన్నా సంకల్పసిద్ధి ప్రధానం. అప్పుడే మనకు కార్యాన్ని నిర్వహించుటకు గల ఆసక్తి పెరుగుతుంది. ఆసక్తితో చేసిన పని మనయొక్క సమయానుకూలతను బట్టి నెరవేరుటకు అవకాశము కలదు. ఈ అవకాశముకూడా జీవుడియొక్క ప్రారబ్ధకర్మపై ఆధారపడియుంటుంది. ఇచ్చట ప్రారబ్ధకర్మను పరిశీలించాలంటే కేవలం జన్మరాశితో సాధ్యపడదు. అన్ని గ్రహాల స్థితిగతులు కావాలి. దీన్నే జాతకం అంటారు. జాతకంలో లగ్నం ప్రతి రెండుగంటలకు మారుతుంది. అనగా ప్రతి ఒక్కరి జాతకాలు పేరుపేరుగా వుంటాయి. కావున జన్మరాశి మానసికస్థితిని చెప్పగలుగుతుంది, కర్మను అధ్యయనం చేయలేదు. ప్రారబ్ధకర్మనాధారంగా అనుకూలత, ప్రతికూలతను తెలుసుకోవచ్చుగాని మానసికస్థితి ద్వారా సాధ్యపడదని గ్రహించాలి. కేవలం మనిషిలోని ఆత్మవిశ్వాసము పెంచుటకు మాత్రమే రాశిఫలితము" ఉపయోగపడుతుంది. ప్రతి జ్యోతిష్కుడు 12 జన్మరాశులలో పుట్టినవారి మనస్సును పేరుపేరు కోణాలలో తమదైనశైలో, అనుభవాలతో విశ్లేషించడం వలన రాశిఫలాలో భిన్నత్వం కనిపిస్తుంది. కావున రాశిఫలాలు మానసికస్థితిని మాత్రమే తెలుపగలుగుతుందని శ్రద్ధతో గ్రహించాలి.

ఇక జాతకఫలనిర్ణయము చేయవలెనన్న రాశిచక్రంలోని గ్రహబలం, భావబలం, అడిగిన విషయానికి తగిన అంశచక్రపరిశీలన, షడ్బలము, అష్టకవర్గు, మహాదశ మరియు గోచారము, ప్రశ్న మొదలగువాని ద్వారా విషయమును లోతుగా పరిశీలించి దేశ, కాల, పరిస్థితులను బట్టి హితమైన ఫలమును

తెలుపవలసివుంటుంది. పై అంశాలను పరిశీలించుటకు అతి తక్కువ సమయములో సాధ్యపడదు. వీటన్నిటికంటే ముందు పృచ్చకుడు అడిగిన సమస్యను అధ్యయనం చేసి సత్యాసత్యఅంశాలను గ్రహించాలి. ఆ తరువాత అడిగిన విషయానికి సంభందించిన కారకగ్రహాన్ని, భావాన్ని, అంశచక్రమున స్థితిని, షడ్బలము, అష్టకవర్గుల సహాయంతో పరిశీలించవలెను. ఈ తెలిపిన అంశములను పరిశీలించుటకు సమయముపట్టునని గ్రహించాలి.

25. గురువుగారూ! జాతకము ఆధారముగా ఆయుర్దాయ విషయములు విశ్లేషించవచ్చునా?

మంచిప్రశ్న! ఇచ్చట "సత్యమేవజయతే" అన్న సత్యాన్ని మరువకూడదు. ఎల్లప్పుడూ సత్యమే చెప్పవలెనని తాత్పర్యము. సత్యమనగా పరుల హితముకోరుట"అని వివరించి యున్నాను. కావున ఆయుర్దాయ విషయమున సత్యమే చెప్పవలెనని అర్థము. అనగా మరణసమయమును తెలుసుకొనుటకు ఆసక్తిగలవారికి నిజము చెప్పుట అని దీని అర్థముకాదు. ఇప్పటి జనజీవనంలో మరణవిషయము అనివార్యమని, మరణముకూడా ఒక యజ్ఞమని తలంచువారు కనిపించరు. అనగా మరణవిషయమును హితముగా చూచెడివారులేరు. ప్రతియొక్కరూ శరీరాభిమనమును పెంచుకొని ఎల్లప్పుడూ సజీవంగానే వుండాలని కోరుకొనేవారే. కావున ఇచ్చట సత్యమనగా వారికి హితమగు ఆరోగ్యాభివృద్దియని అర్థము. మరణవిషయములను, అనారోగ్యతీవ్రతల విషయమును పృచ్చకులతో చర్చించరాదు. అనారోగ్యముగా వున్నవాడికి కూడా జాతకములోని గ్రహాలు ఆరోగ్యమును పుష్కలంగా చూపుతున్నదన్న హిత–సత్యాన్ని వచించాలన్నమాట. మరణమునకు దగ్గరవుతున్నవానికి కూడా మరణము దగ్గరకు రాదన్న హితసత్యాన్ని చెప్పాలి. ఇచ్చట సత్యము సంధర్భమును బట్టి మారును. ధరిద్రజీవనముతో బాధపడుతున్నవానికి వంచనతో ధనముకోసం ఆశలు చూపడం, హోమము చేయిస్తే కుభేరుడు కాగలవని చెప్పడం అసత్యమగును. సత్యాసత్య విషయాలలో జ్యోతిష్కుడు విచక్షణా జ్ఞానంతో వ్యవహరించాలి.

ఇక మరణ విషయం గ్రహాలమీద ఆధారపడియుండబోదు. జీవుడి శ్వాసమీద ఆధారపడియుంటుంది. ప్రతియొక్క మనుజుడికి తన ప్రారబ్ధకర్మలను బట్టి ఎన్ని శ్వాసలు తీసుకొనవలెనో

పుట్టుటకు పూర్వమే భగవంతుడు నిర్ణయిస్తాడు. తొలి శ్వాస నుండి తుదిశ్వాస వరకు అతడు తీసుకొను శ్వాసంపైనే అతని ఆరోగ్యం ఆధారపడియుంటుంది. ప్రతిరోజూ నెమ్మదిగాను, తక్కువ శ్వాస తీసుకొనువాడు ఆరోగ్యవంతుడగును. అమితమైన శ్వాసతీసుకొనువానికి అనారోగ్యము దగ్గరగును. అనగా భగవంతుడు ఒసగిన శ్వాససంఖ్య తరిగిపోతున్నకొద్దీ అనారోగ్యానికి చివరకు మరణానికి దగ్గరగును. ప్రాణాయామముతో రోజుకు అతి తక్కువ శ్వాసను తీసుకుంటూ ఋషులు ఇప్పటికీ వేలాది సంవత్సరములు హిమాలయాలలో జీవించి ఉన్నారు. ప్రస్తుతం వాతావరణ కాలుష్యం, క్షణం తీరికలేని జీవనం, ఆహారపు అలవాట్లు, ధనసంపాదన కోసం అలుపెరగని శ్రమ, అహంకారం, స్వార్థం, కోపం మొదలగు విపరీత గుణాల ద్వార దూరమైన మనశ్శాంతి వలన తీసుకొను శ్వాససంఖ్య రోజురోజుకూ పెరిగి వేగంగ్‌నారోగ్యము తెచ్చుకుంటూ చివరకు శరీరమును వదలిపెట్టి వెళ్ళుపరిస్థితిని తెచ్చుకుంటూ ఉన్నాము. భగవంతుడు ఒసంగిన శరీరమును భద్రంగా అతనికే అర్పించాలి. అనగా శరీరభాగాలకు నష్టంకలుగకుండా రక్తస్రావం కాకుండా అగ్నియనెడి భగవంతునికి ఆహుతి ఇవ్వడమన్నమాట. శరీరం పాడైనా, రక్తస్రావం ఏర్పడినా రాక్షసులవలె రక్త-మద్యములను యజ్ఞములో పోసినంత పాపఫలం వస్తుంది. అందుకే మన భారత శిక్షాస్మృతియందు కూడా ఆరోగ్యముగా వున్నప్పుడే దోషికి ఉరిశిక్షను అమలుపరుస్తారు. కావున ప్రతి ఒక్కరూ శరీరమును ఆరోగ్యకరముగా, జాగ్రత్తగా చూసుకొనవలెనన్న సత్యాన్ని గ్రహించాలి.

26. జ్యోతిష్కుడు చెప్పిన ఫలము కొన్ని సందర్భములలో బెడిసికొట్టును. దీనిగల కారణములను తెలియజేయగలరు.

పై ప్రశ్నకు చాలా కారణములుగలవు.

1. జాతకమును ఏర్పరచుటకు సరియైన జననసమయము లేకుండుట. ప్రసవం జరుగునపుడు వైద్యులు తల్లిబిడ్డల క్షేమమే కర్తవ్యంగా వ్యవహరిస్తారు. జననమైన సమయాన్ని సుమారుగా తెలుసుకొనుటకు ఆస్కారము కలదు. కొన్ని సందర్భాలలో గ్రహాలు మరియు లగ్నము సంధికాలములో వున్నయెడల ఫలితనిర్ణయము కష్టతరమగును. ఈ సందర్భములో అతని గుణగణాలను, తల్లిదండులవిషయాలను

పరిగణలో తీసుకొని లగ్ననిర్ణయం, ఫల నిర్ణయం గావించాలి.

2. శస్త్రచికిత్సలతో కూడిన ప్రసవాలు (Sigerian Operations) ఎక్కువగుటచే జనన సమయాన్ని ఖచ్చితముగా నిర్ణయించుట కష్టతరమగును.

3. ధార్మికప్రజ్ఞ, సదాచారము, జనుల హితముకోరువారి కొరత ఎక్కువగాయుండుటచే సరియైన పరిష్కారమార్గం పొందలేక పోవుట.

4. పృచ్ఛకుడు అడిగిన ప్రశ్నలు హితమైనవా? లేక అనగత్యమైనవా? అని ఆలోచించకుండా అడిగిన ప్రశ్నలన్నిటికీ ఏదో ఒకవిదంగా జ్యోతిషశాస్త్రపరిభాషలో సమాధానాన్నందించడం.

5. గ్రహాలను అడ్డుగా పెట్టుకొని భయభ్రాంతులకు గురిచేయడం. వాటినివారణకు రాళ్ళు, రత్నాలు, జపాలు, విశేషమైన పూజలు, హోమాలు చేయించమని చెప్పడం.

6. శాస్త్రానికి సంభందించినంతవరకూ కనీస సామాన్య జ్ఞానం పృచ్ఛకులకు లేకపోవడం. జ్యోతిష్కుడు చెబుతున్నవి సత్యమా? హితమా? ధర్మబద్ధ మైనదా అని తెలుసుకోలేని అజ్ఞానంలో ప్రస్తుత జనం వుండటం

7. మంచి జ్యోతిష్కుడు అందించిన పరిష్కార మార్గాన్ని ఆచరించుటకు కావలసిన జ్ఞానం, ఆసక్తి లేకపోవడం. తనకొరకు కుటుంబములోనివారిచే ఆ నివారణోపాయాలకు సంబంధించిన ఆచరణలు చేయిండం.

8. నివారణోపాయాల ఆచరణ నామమాత్రంగా చేయడం, భక్తి–శ్రద్ధలు లేకుండా యాంత్రికమైన పూజా క్రియలతో ఆచరించడం.

9. సదాచారం, పరోపకారం, పెద్దలపట్ల గౌరవం, గృహస్థాశ్రమధర్మం మొదలగు ప్రాథమిక లక్షణాలు లేకుండుట.

10. దేవాలయాలలో, తన గృహములలో విశేషపూజలూ, హోమాలు చేస్తూ, మిగిలిన సమయాలలో స్వలాభం చూసుకుంటూ, మానసికంగా శారీరకంగా జనులను హింసిస్తూ, అధికార దుర్వినియోగం, పరోపకారం లేకుండుట మొదలగు పాప క్రియలు చేయడం.

11. జ్యోతిష్కుడు తెలిపిన శ్లోకం, జపం, దైవధ్యానం మొదలగు విషయాలలో సంఖ్యకు ప్రాధాన్యతనివ్వడం.

పై కారణాలు శుభఫలములను ఇచ్చుటలో విఫలమవుతున్నాయి. కావున సమస్యలు అరుదెంచినపుడు మరియు నిత్యమూ దైవధ్యానం, పరోపకారం, సదాచారం మొదలగు లక్షణములు కలిగివున్నయెడల నివారణోపాయములతో సమస్య పరిహారమగునని గ్రహించాలి.

27. గురువుగారు! తమరిచ్చిన విలువైన సమాధానములతో నాకునూ జ్యోతిషశాస్త్రమునభ్యసించవలెనని ఆసక్తిగలుగుతున్నది. దయవుంచి జ్యోతిషశాస్త్రమును అభ్యసించు పద్దతులను, జాతకమును పరిశీలించు విధానమును భోధింపమని ప్రార్థిస్తున్నాను.

శిష్యా! చాలా సంతోషము. జ్యోతిషశాస్త్రము ఒక పవిత్రమైన వేదాంగము. జ్యోతిషశాస్త్రగ్రంథము వేదములకు కళ్ళువంటిది . జ్యోతిష్యాధ్యనమునకు కేవలం ఆసక్తి, తపన అను లక్షణములు కలిగియున్న చాలదు. సమగ్రముగా జ్యోతిషశాస్త్రమును అభ్యసించుటకు శాస్త్రశ్రద్ధ, శాస్త్రశ్రద్ధకులోబడిన స్వతంత్ర వివేక బుద్ధి, గట్టి సంకల్పము వుండవలెను. జ్యోతిషశాస్త్రమును అధ్యయనము చేయుటకు ముందుగా తగు లక్షణములను కలిగియుండవలెను. సదాచారము, ధార్మికప్రజ్ఞ, గురువులయందు భక్తి, తల్లిదండ్రులయందు, పెద్దలయందు, సాంప్రదాయ మునయందు గౌరవముకలిగియుండవలెను. పై విషయములనెరిగినవాడు, లక్షణములు గలవాడు జ్యోతిషశాస్త్రాధ్యయనమునకు అర్హుడు.

28. గురువుగారు! శాస్త్రశ్రద్ధ అనగా ఏమిటి? శాస్త్రముపై ఏవిధమైన శ్రద్ధ కలిగివుండవలెనో భోదింపగలరు?

శ్రద్ధ అనగా జ్యోతిషశాస్త్రముపై నమ్మకము, ఆత్మవిశ్వాసము (Faith). శ్రద్ధ అనగా విచారణకు ముందుగా ప్రశ్న–పరీక్షలు లేకుండా కలుగు నమ్మకము. శాస్త్రం గురించి ప్రత్యక్షప్రమాణములు ఋజువులూ లేకపోయినా ఆ శాస్త్రం ఉన్నట్లు ధృవీకరించి అది పనిచేస్తున్నదనే భావనయే శ్రద్ధ"అనిపించుకుంటుంది. ఇక్కడ మనకు ఇంకొక ప్రశ్న ఉదయిస్తుంది. పైవిధంగా చూసినట్లైతే శాస్త్రముపై గల శ్రద్ధ అనునది ఒక గుడ్డి నమ్మకమే అవుతుంది కదా? ఇది బుద్ధి వికాసానికి వైరిగా కనిపిస్తుందికదా? దీనికి సమాధానం

కావలంటే ముందు మనం బుద్ధియొక్క పనితనాన్ని గురించి తెలుసుకోవాలి.

మనిషియొక్క జ్ఞానేంద్రియాలలో అతి ముఖ్యమైనది బుద్ధి అన్న సత్యం మనలో చాలామందికి తెలియనివిషయం. కాని బుద్ధి సామర్థ్యానికి కూడా పరిమితి కలదని (Limitation) గ్రహించాలి. బుద్ధి స్వతంత్రంగా ప్రవేశించని, పనిచేయని స్థానాలు, ఎన్నోవున్నాయి. జీవాత్మ, పరమాత్మ, పుణ్య–పాపాలు, జన్మాంతరం మరియు లోకాంతరం ? ఇలాంటి విషయాలలో బుద్ధియొక్క సామర్థ్యానికి స్వతంత్ర ప్రవేశము లేదు. ఎందుకంటే అవి ఇంద్రియగోచరముకానివి. ఇంద్రియాల సహాయంతో గుర్తించలేము, మనస్సు వాటిని తాకబోదు. ఇలా చూస్తే పై విషయక్షేత్రాలు బుద్ధికి దూరంగా ఉంటాయి. ఆ విషయక్షేత్రాలలో బుద్ధిప్రవేశించాలంటే, పనిచేయాలంటే ఆ విషయాల గురించి బాగా అవగాహన కలిగినవారు అక్కడికి తీసుకొని వెళ్ళాలి. అటువంటి ఆప్తప్రజ్ఞలే వేదాలు, శాస్త్రాలు, శిష్టసాంప్రదాయములు. బుద్ధి సామర్థ్యానికి గోచరించని విషయాలను వేదాశాస్త్రాలు జ్ఞానమనే వెలుగును ప్రసరింపజేసి అజ్ఞానమనే చీకట్లను తొలగిస్తాయి.

నాన్యః పంథా విద్యతేఽత్యనాయ

కావున అక్కడ గురువుమూలకంగా శాస్త్రములే మనకు దిక్కు. వారి సిద్ధాంతాలను అంగీకరించే మనోప్రవృత్తియే శ్రద్ధ అవుతుంది. శాస్త్రశ్రద్ధలేని ఉపదేశము రాతిబండపై విత్తిన విత్తనమువలె వ్యర్థమవుతుంది. కావున జ్యోతిషశాస్త్రము అవగాహన చేసుకోవాలంటే శాస్త్రశ్రద్ధ తప్పనిసరి. ఏ సందర్భములో శాస్త్రోపదేశముకు తోడుగా స్వతంత్రబుద్ధితో నిర్ధారణము మంచి విమర్శకు, తర్కమునకు తోడుబడుతాయి.

29. గురువుగారు! కాని ప్రాకృత లోకసంధర్భాలలోను, ఆధునిక కాలంలోను యధార్థజ్యోతిషశాస్త్రమునకు లౌఖిక బుద్ధికి ఐకమత్యము లోపించినది కదా! ఉదాహరణకు శని, భానువారములలో వివాహము యోగ్యము కాదు అని శాస్త్రము తెలుపుతుంది. కాని లౌఖిక బుద్ధి సమంజసమని తెలుపుతుంది. వివాహమునకు ముందు జాతక పరిశీలన అవశ్యమని శాస్త్రం తెలుపుతుంది. లౌఖిక బుద్ధి మూఢనమ్మకమని తెలుపుతుంది. తుమ్మితే, పిల్లి ఎదురైతే శకునశాస్త్రం దుష్ఫలాన్ని తెలుపుతుంది,

లౌఖికబుద్ధి అనాగరికమని కొట్టిపారేస్తుంది. అత్యాశ, భోగాలు విహితం కాదని శాస్త్రం తెలుపుతుంది. లౌఖిక బుద్ధి హితమని తెలుపుతుంది. ఇలా వందలకొద్దీ ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఇలాంటి ద్వంద్వ విషయాలలో హితమార్గము ఏది? శాస్త్రమా ? స్వబుద్ధి నిర్ణయమా?

చాలా మంచిప్రశ్న. మనయొక్క జీవనక్షేత్రమందు జ్యోతిషశాస్త్రానికి ప్రాముఖ్యత కలదు అలాగే స్వబుద్ధికి కూడా కార్యంకలదు. ఈ సందర్భములో శాస్త్రం మరియు స్వబుద్ధి ఈ రెండువిషయాలు ఒకే విషయమునందు పని చేయగలుగుతుందా? లేక వేరు వేరు విషయాలలో పనిచేయగలుగుతుందా? ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం కావాలి.

ముందుగా మనం బుద్ధియొక్క పనితనాన్ని సామర్థ్యాన్ని గురించి తెలుసుకుందాం. బుద్ధి గురించి తెలుసుకునేటప్పుడు ఒక ముఖ్యవిషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. బుద్ధి పనిచేయుటకు ముఖ్యంగా కార్యద్రవ్యములు కావాలి. అనగా కార్యానికి సంబంధించిన విషయాలను సేకరించాలి. ఎట్లనగా ఉదాహరణకు బంకమట్టి లేని చోట కుమ్మరివాడికి పని వుండదు, చెట్టు, కొయ్యదిమ్మలు లేని చోట వడ్రంగికి (Carpenter) కు పనిలేదు. రైతుకు నేల, వర్తకుడికి సరుకు, వైద్యుడికి మూలికలు – ఇలా ప్రతి ఒక వృత్తిచేయువారికి ఒక్కొక్క కార్యద్రవ్యము కావాలి. అలాగే బుద్ధికి కూడా కార్యద్రవ్యములు కావాలి. మనస్సు బుద్ధి కార్యానికి కావలసిన కార్యద్రవ్యములను సేకరిస్తుంది. మొదట జ్ఞానేంద్రియాలైనటువంటి కళ్ళు, చెవులు, ముక్కు, నాలుక మరియు చర్మము ఇవి విషయాలను సేకరించి మనస్సునకు అందజేస్తాయి. మనస్సు ఇంద్రియాలు సేకరించిన విషయాలను బుద్ధికి అందజేస్తుంది. మనస్సు తనయొక్క ఇష్టానిష్ట విషయాలను బుద్ధికి చెప్పుకుంటుంది. మనస్సుతోపాటు చిత్తము తనలో వున్నటువంటి పూర్వస్మృతులను (Past Impressions or Stored Data) బుద్ధికి అందజేస్తుంది. ఇలా ఇంద్రియాలు, మనస్సు, చిత్తము సేకరించిన విషయాలు బుద్ధికి కార్యద్రవ్యమవుతాయి. ఇప్పుడు మనం ఒక విషయాన్ని తెలుసుకోవాలి. అదేమిటంటే ఎక్కడ మనస్సు, ఇంద్రియాలు పనిచేయవో అక్కడ బుద్ధికార్యానికి పనిలేదు అన్న సత్యం తెలుస్తుంది, అంటే బుద్ధియొక్క పనితనానికి కూడా పరిమితికలదని గ్రహించాలి.

సత్యం అనునది రెండువిధాలుగా గోచరిస్తుంది. అది దృశ్యసత్యం మరియు అదృశ్య సత్యం. దృశ్యసత్యం అనగా ఇంద్రియగోచరమగునది. అది ప్రత్యక్షప్రపంచము. అదృశ్యసత్యము ఇంద్రియగోచరము కానటువంటిది. అది ప్రపంచాతీత రహస్య చైతన్యము. మనము దాన్ని చూడలేము కాని వాటి శక్తిప్రభావాన్ని మనం అనుభవించగలము. ఉదాహరణకు భగవంతుడిని చూడలేకపోయిన అతని ఉనికిని మనము తెలుసుకోగలుగుతున్నాం. ఇలా మన జీవనవ్యాపారంలో కొన్ని దృశ్యసత్యాలు అనగా ప్రత్యక్షప్రపంచక్షేత్రం బుద్ధిక్షేత్రమన్నమాట. మరికొన్ని అదృశ్యసత్యాలు అనగా ఇంద్రియగోచరము కానివి. ఇక్కడ ఇంద్రియాల ప్రవేశములేదు. బుద్ధికార్యానికి గోచరించదు. ఇలా ప్రత్యక్షప్రపంచ మరియు ప్రపంచాతీతక్షేత్రాలను వివేకంతో విభాగము చేయవచ్చును. అనగా ఏ క్షేత్రం ఇంద్రియగోచరమై బుద్ధియొక్క కార్యానికి పని కల్పిస్తుందో అక్కడ బుద్ధికి మొదటిస్థానం, శాస్త్రాచరణకు రెండవ స్థానం. ఏ క్షేత్రానికి (విషయానికి) ఇంద్రియప్రవేశములేదో, బుద్ధికార్యానికి మాత్రం గోచరించునో అక్కడ వేదశాస్త్రాలకు ప్రథమస్థానం. ఉదాహరణకు వివాహానికి వధూ–వరుల జాతక పరిశీలన, యోగ్యత, ముహూర్త విషయాలలో శాస్త్రాచరణ అనగా గురువులను, జ్యోతిష్కులను సంప్రదించి వారి నిర్ణయంపై వుంచిన శ్రద్ధ. ఇక్కడ బుద్ధికి పనిలేదని కాదు. మన బుద్ధితో ఈ వివాహ పొంతనల విషయాలను క్షుణ్ణంగా పరిశీలించలేము. అక్కడ జ్యోతిషశాస్త్రమే గొప్ప ఆధారం. కావున ముహూర్త–మాంగల్యధారణ శాస్త్రవిషయాలు. ఇక వివాహ నిర్వహణకు ధనము ఎక్కడ సేకరించాలి? అప్పు చేయాలా లేక ఆస్తి–పాస్తులను అమ్మాలా? వివాహానికి యోగ్యమైన కళ్యాణమంటపం ఏది? వియ్యాలవారి సత్కారం, పిండివంటలు వగైరా విషయాలు బుద్ధికార్యానికి చేరినవి. ఇక్కడ బుద్ధిసామర్థ్యంతో విచక్షణా జ్ఞానంతో వ్యవహరించవలసివుంటుంది. ఈ విధంగా మన నిత్యకర్తవ్యములందు శాస్త్రానికి ఒక స్థానం కలదు స్వబుద్ధికి ఒక స్థానం కలదు. ఇవిరెండు జతగా ఆయా సందర్భాలను బట్టి కార్యనిర్వహణ చేయవలసి వుంటుంది. శాస్త్రసాంప్రదాయాలకు, స్వతంత్రబుద్ధికి విరోధం అవసరం ఉండదు.

30. గురువుగారు, జ్యోతిషశాస్త్ర శ్రద్ధ మరియు ఆచరణ విషయంలో మనుష్యబుద్ధికి గల స్థానం ఏమిటో? కాస్త వివరించగలరు.

మంచిప్రశ్న. పైన మనం తెలుసుకున్నట్లుగా జీవుడు, భగవవంతుడు, పుణ్యం, పాపం, స్వర్గం, నరకం, కర్మ, అకర్మ, వికర్మ మొదలగు విషయాలు ప్రత్యక్ష వస్తువులు కావు. అవి ఇంద్రియాల చేతికి దొరకదగినవి కావు. అందువలన బుద్ధియొక్క స్వతంత్రకార్యానికి అక్కడ అవకాశం లేదు. చంద్రాదిగ్రహాలపరిధులను దాటునటువంటి ఉపగ్రహాలు (Rockets) అధ్యాత్మిక ప్రపంచాన్ని తాకలేవు, వాటి దిశను కానరావు. అధ్యాత్మికరహస్య మార్గంలో శాస్త్రం చెప్పినదానిని అర్థం చేసుకొనే అధికారం బుద్ధికి కలదు కాని తానే స్వతంత్రంగా సిద్ధాంతము చేయు అధికారము బుద్ధికి లేదు. మనిషియొక్క పూర్వాపర రహస్యాల విషయంలో బుద్ధి స్వతంత్రంగా సత్యాన్ని ధర్మాన్ని నిర్ధారించలేదు.

మనిషియొక్క బుద్ధికి రెండు లోపాలు కలవు. ఒకటి కార్యద్రవ్యాల అపూర్ణత రెండవది దృష్టిశక్తియొక్క అపూర్ణత. బుద్ధికి వున్న ముఖ్యకార్యం వస్తువును పరీక్షించడం మరియు దాని సామర్థ్య నిర్ణయం. పరీక్షచేయుటకు విషయము కావలెను. ఆ విషయాలను బుద్ధి స్వతంత్రంగా సేకరించుకోలేవు. ఎందుకంటే బుద్ధికి నేరుగా లోకంతో సంపర్కం ఉండదు. బుద్ధికి పరీక్షాద్రవ్యవిషయాలను మనస్సు, చిత్తం ముందుగానే అందించవలసి వుంటుంది. ఇలా బుద్ధికి విచారద్రవ్యాలను సేకరించి ఇచ్చునటువంటి బంటు ఇంద్రియాలు.

ఇక్కడ ఇంకొక సమస్య ఏర్పడుతుంది. ఇంద్రియాలు భోగేచ్ఛాకలుషితమైన స్వభావము కలవి. ఇంద్రియాలకు కోరికలు ఎక్కువ. మన ఇంద్రియాలు ఒక క్షణంలో ఒక పధార్థంలోని ఒకవైపు భాగాన్ని మాత్రం దర్శించగల శక్తిగలవి. వస్తువుయొక్క అన్నివైపులను ఒకే క్షణంలో చూడలేవు. ఇంకా పరిశీలిస్తే కళ్ళయొక్క దృష్టిశక్తి కొద్దిపాటి దూరానికే పరిమితమైనవి. ఎక్కువదూరంలో వున్న వస్తువులను చూడలేవు. అందువలను నేత్రశక్తి ఏకముఖమైనది మరియు పరిమితమైనది. అన్ని జ్ఞానేంద్రియాలు కర్మేంద్రియాలు కళ్ళలాగే అతి తక్కు సామర్థ్యము కలిగినవి. కావున ఇంద్రియాలు సేకరించి బుద్ధికి సమర్పించునటువంటి కార్యద్రవ్యాలు ఏకపక్షమైనటువంటివి మరియు పరిమిత ప్రదేశానికి చెందినవి,

పరిపూర్ణస్వరూపాన్ని పొందునటువంటివి కావు. ఇలా వున్నప్పుడు బుద్ధియొక్క కార్యద్రవ్యమునందు లోపము అనివార్యమగును. ఇక బుద్ధియొక్క కార్యశక్తియైన తలస్పర్శంగా పనిచేస్తుందా అంటే అదికూడా లేదు. దేహానికి జడత్వం వచ్చునట్లు బుద్ధికి కుడా జడత్వం మరియు ఆలస్యంగా పనిచేయు గుణం కలిగివుంటుంది. తనకు దొరికిన వస్తుద్రవ్యాలను పరీక్షించించునప్పుడు బుద్ధియొక్క అలశ్యత్వం–మరుపు మొదలైన దోషకారణములచేత ప్రమాదమునకు గురియగు సంభావన కలదు.

31. గురువుగారు! బుద్ధియొక్క పనితీరును మరికొంత స్పష్టంగా తెలియజేయగలరు.

మంచిది. బుద్ధియొక్క పనితీరును మనం ఇప్పుడు తెలుసుకుందాం. బుద్ధియొక్క కార్యవిధానంలో నాలుగు సంగతులున్నయి. అవి

1. వస్తువిశ్లేషణ (Analysis)

వస్తువిశ్లేషణ అనగా విచారగ్రస్తమైన వస్తువుయొక్క నిర్మాణంలో చేరినటువంటి నానా ద్రవ్యాంశములను ప్రత్యేకముగా వేరుచేయడం.

2. వర్గీకరణ (Classification)

వస్తువుయొక్క అంతర్గతమైన నానా అంశములను వాటి స్వభావములను అనుసరించి జాతులుగా వేరుచేయడం.

3. కార్యకారణ సంబంధ నిశ్చయం (Causality)

వస్తువుయొక్క ఒక్కొక్క పధార్థములోను ఏ ద్రవ్యాంశము ఎంత ప్రమాణములో ఉన్నది? అది ఇంకొక ద్రవ్యాంశముతో ఎంత జతకలిస్తే ఏమి పరిణామము చెందుతుందని నిశ్చయించడం.

4. కార్యాకార్య నిర్ణయుం (Value Judgement)

ప్రస్తుత వస్తుసంయోగమునందు కార్యాకారణములను దృష్టిలో వుంచుకొని ఉద్దేశప్రయత్నముతో వచ్చునటువంటి ఫలితాంశమునందు మంచి ఎంత? అది యోగ్యమైనదా? లేక అయోగ్యమైనదా? అన్న విషయాన్ని నిర్ణయించడం.

ఈ నాలుగు బుద్ధి సంగతులు జరుగునది బుద్ధిచేతికి వస్తువు దొరికినప్పుడు మాత్రమే కదా?

ఏ విషయము ఇంద్రియ మనస్సులకు లభ్యమో దానిని బుద్ధితో పరీక్షింపబడుతుంది. మన ప్రత్యక్షప్రపంచముయొక్క వస్తువులు అలాంటివే. పురుషబుద్ధి తనకు దొరికినటువంటి విషయములపై తర్క–సిద్ధాంతములను చేయవచ్చు. కాని బుద్ధి చేతికి చిక్కనటువంటి వస్తువుమీద బుద్ధియొక్క పని సాగదు. ఏది ఇంద్రియానుభవమునకు చిక్కదో దానిమీద బుద్ధికి అధికారములేదు. నానా అధ్యాత్మిక సంగతులు ఇంద్రియాతీతమైనవి. మన కళ్లు, చెవులు, చేతులు ఆధ్యాత్మతత్వ ప్రపంచమును తాకలేవు. ఇంద్రియాలు, మనస్సు వాటిజాడ కానరాదు. మనస్సు అధ్యాత్మవిషయాన్ని సూచించవచ్చు, దానిని బుద్ధి అంగీకరించవచ్చు అంత మాత్రం చేత అధ్యాత్మ విషయం బుద్ధికి స్వాధీనమైనట్లు కాదు.

ఆత్మతత్వమైన ఈశ్వరతత్వమూ, జీవుడియొక్క ప్రగతి–అప్రగతిశీలతా ఇంద్రియ స్పర్శకు చిక్కనటువంటివి. కాని ఇంద్రియాలు ఆ తత్వములయొక్క కార్యఫలాన్ని అనుభవించగలుగుతాయి. ఆ అనుభవాల ఆధారంగా బుద్ధి ఆయొక్క తత్వమూలమును ఊహించి గ్రహించగలుగుతుంది. అధ్యాత్మతత్వము బుద్ధిగ్రాహ్యమేకాని బుద్ధియొక్క అధీనం కాదు. బుద్ధి అధ్యాత్మ తత్వాన్ని గ్రహించేది కూడా యదార్థ శాస్త్రాన్ని అంగీకరించినపుడు మాత్రమే. నాస్తికులకు బుద్ధిలేదని కాదు కాని వారికి శాస్త్రశ్రద్ధ లేనందున అధ్యాత్మతత్వము గ్రహింపసాధ్యం కాదు. గ్రహింపగలిగినట్లైతే వారు నాస్తికులయ్యేవారు కాదు. అధ్యాత్మశాస్త్రము గ్రహింపసాధ్యమగునది శాస్త్రాన్నంగీకరించినప్పుడు మాత్రమే.

ఆత్మకు చైతన్యము కలదన్న సత్యాన్ని ఋజువుపరచుటకు బయటి సాక్షీభూతముగా ఏదియునూ లేదు. శాస్త్రవాక్యమొక్కటే అక్కడున్నటువంటి సాక్షి. శరీరములో జీవుడు వున్నట్లు చేతితో చూపి ఇంకొకరి చేతిలో పెట్టుట సాధ్యమా? స్వర్గమో నరకమో వున్నట్లు బయటిప్రపంచాన్ని చూపుతూ ఋజువుచేయుట ఎటుల? పూర్వజన్మ వున్నట్లు, జీవుడియొక్క కర్మలను సూచించే ఆధారాలు ఎక్కడ వున్నాయి? దేవుడున్నాడని ప్రహ్లాదుడు ప్రత్యక్షపరచాడని పురాణం చెబుతుంది. మనకు దేవుడిని ప్రత్యక్షంగా ఋజువుచేయగలవారు ఎక్కడున్నారు? ఈ అన్ని భావనలూ మరియు జీవుడు, దైవం, ఆత్మ, బ్రహ్మ, పుణ్యం, పాపం, స్వర్గం, నరకం ఇవన్నియూ వేదం ద్వారా మనకు వచ్చినటువంటి

వివేకప్రజ్ఞలు. ఇలాగే పరతత్వాన్ని వెదకువారికి తత్వానుసారంగా జీవితాన్ని గడపాలనుకొనేవారికి కూడా వేదమే మూలప్రమాణం. శంకించు గుణముగల మనుష్య బుద్ధిని దృష్టిలో వుంచుకొనె భగవాన్ వ్యాసమహర్షి ఈవిదంగా అన్నాడు

తర్కాప్రతిష్టానాత్ ॥

అధ్యాత్మసూత్ర విషయములందు మనిషియొక్క బుద్ధి పరమత తత్వ నిర్ధారణకు సరిపోదు అని స్పష్టంగా ధృవీకరించారు.

ప్రత్యక్షేణానుమిత్యా వా యస్తూపాయో న బుధ్య తే ।
ఏనం విదన్తి వేదేన తస్మాద్వేదస్య వేదతా ॥

ప్రత్యక్షజగద్వస్తుపరీక్షతోగాని, ప్రత్యక్ష సంగతుల ఆధారముతో చేసినటువంటి ఊహాపోహలతోగాని మనం పురుషార్థమార్గాలను తెలుసుకోలేమో, ఏ పరమోద్దేశానికై ఉపాయాన్ని కేవలం తర్కంతో తెలియసాధ్యం కాదో ఆ అలౌకిక విషయాన్ని వేదమున ఆధారంగా తెలుసుకోవచ్చు. మన ప్రశ్నలు అధ్యాత్మసంబంధం కాక ఐహిక విషయాల గురించి ఐతే అక్కడ పురుషబుద్ధియొక్క వివేకానికే ప్రథమ స్థానం.

32. గురువుగారూ! అటులైన వేదశాస్త్రాలను అవలంబించువారికి వారి మార్గంలో బుద్ధియొక్క సహకరించవలసిన అవసరం లేదా?

శిష్యా! బుద్ధియొక్క సహకారం ఖచ్చితంగా అవసరం. వేదశాస్త్రాలను అవలంబించువారికి బుద్ధియొక్క సహకారం కావాలి. కాకపోతే బుద్ధి తన కార్యాలను వేదముయొక్క ఆవరణలోనే నిర్వర్తించవలసి వుంటుంది. ఉదాహరణకు పశువులకాపరి గడ్డి మేయడానికి పశువులను గడ్డి వున్నచోట వదులుతాడు. ఆ పశువులు గడ్డిమేయడానికి స్వేచ్ఛగా తిరుగుతూ మేయచచ్చు. కాని పశువులకాపరి నిర్దేశించిన

సరిహద్దులను దాటిపోరాదు. ఒకవేళ ఆ సరిహద్దులను దాటి వెళ్ళినట్లైతే పులిబారిన వడవలసివస్తుంది.

ధర్మే ప్రమీయమాణే హి వేదేన కరణాత్మనా ।

ఇతికర్తవ్యతాభాగం మీమాంసా ~~పూరయిశ్యతి~~ ॥

ధర్మాన్ని తెలుసుకొనుటకు వేదమే సాధనము. దాని ద్వార తెలుసుకొన్నటువంటి ప్రయోగానుష్టానాన్ని మీమాంసరూపమైనటువంటి బుద్ధికార్యం తెలియజేస్తుంది. అధ్యాత్మ విషయాలకు వేదశాస్త్రములపై శ్రద్ద ప్రధానమవుతుంది, అక్కడ బుద్ధి శాస్త్రానికి సహాయపడుతుంది. ఏవిషయంలో జీవుడికి అధ్యాత్మవిషయాల అవసరం వుండదో, లౌకికమైనటువంటి లాభాలే ప్రధానమవుతాయో అక్కడ మనిషియొక్క స్వతంత్ర బుద్ధి ప్రధానమవుతుంది. ఇలా మన జీవితంలో కొన్ని విషయాలలో శాస్త్రం దాన్ననుసరించి బుద్ధి కలసివుండాలి. కొన్ని విషయాలలో బుద్ధివివేకము పటుత్వంతో, దృఢంగా వేదశాస్త్రాలకు విరోధం కాకుండా జీవనాన్ని గడపాలి.

33. గురువుగారు! నాకు మీచే వివరించబడ్డ శాస్త్రవిషయాలను, బుద్ధి విషయాలను చక్కగా అర్థంచేసుకున్నాను. కాని వీటిని జ్యోతిషశాస్త్ర విశ్లేషణ విషయంలో ఏవిదంగా దోహదవడతాయి.

మంచిది! ఇంతవరకు మనం తత్వజ్ఞానానికి శాస్త్రం, లోకవినియోగానికి బుద్ధి ప్రధానమని తెలుసుకున్నాం. ఇది జ్యోతిషశాస్త్ర విశ్లేషణ మరియు ఫలనిర్ధారణకు ఏవిదంగా దోహదపడుతుందో పరిశీలిద్దాం.

ఉదాహరణకు వివాహ విషయాన్ని తీసుకుందాం. వివాహానికి సంబందించిన సమస్యలు చాలావున్నాయి. ఇక్కడ ఒక సమస్యను పరిశీలిద్దాం. ఒక యువకుడు వివాహం ఆలస్యమవుతుండడంతో ఒకసారి ఒక జ్యోతిష్కుడిని కలిసాడు. తనయొక్క జాతకచక్రాన్ని అతనికి అందించాడు. జ్యోతిషవిషయాలు విశ్లేషించాలంటే ముందుగా శాస్త్రశ్రద్దకావాలి. లేకపోతే జ్యోతిషశాస్త్ర పండితుడు కాలేడు. అలాగే అదే జ్యోతిష్కుడికి లౌకిక విషయాలలో కూడా క్షుణ్ణంగా అవగాహనం కలిగి వుండాలి. ఎందుకంటే సమస్యలు

అడుగువారు శాస్త్రజ్ఞానంతో సంభంధం లేని విషయాలను కూడా అడగుతూ వుంటారు. కావున వివేకంతో ఆ సమస్య శాస్త్రపరిధిలో వుందా లేక లౌకిక బుద్ధినిర్ణయంతో ముడిపడివుందా అన్న సత్యాన్ని తెలియాలి. జ్యోతిష్కుడు జాతకుడి చక్రాన్ని పరిశీలించుటకు ముందు వివేకంతో అతనియొక్క సమస్యను సూక్ష్మంగా అధ్యయనం చేయాలి. అతడి సమస్యకు ఇంద్రియగోచరముకాని పూర్వకర్మ కారణమా? లేక తనయొక్క అవివేక ప్రజ్ఞయే కారణమా? అన్న విషయాన్ని ముందుగా పసిగట్టాలి. ఎందుకంటే కొన్ని సందర్భాలలో తాను తన బుద్ధి సహాయంతో తీసుకోవలసిన నిర్ణయాలను కూడా అవివేకంతో తీసుకొనలేకపోవుట జరుగవచ్చు. ఉదాహరణకు వివాహము ఆలస్యమగుటకు/కాకపోవుటకు శాస్త్రకారణము కలదు స్వబుద్ధి దోషమూ కలదు. అది ఎటులనగా యుక్త వయస్సులో వివాహసంబంధం వెదకునపుడు జాతకము మరియు నక్షత్ర పొతనములు (Compatibility Check) జతకాకపోవడము పూర్మకర్మ. మరికొన్ని చోట్ల శాస్త్ర సమ్మతమైననూ వధు/వరుడియొక్క అందం/స్థిరచరాస్తులు...వగైరా విషయాలు సంతృప్తిపరచకపోవడం స్వబుద్ధి నిర్ణయానికి సంబందించినవి. ఈ సందర్భములో శాస్త్రము యోగక్షేమాలను, గుణగణాలను ప్రాచీనకర్మలను బట్టి విశ్లేషిస్తుంది. లౌకికబుద్ధి మనస్సునకు, ఇంద్రియాభిలాష, కోరికలను బట్టి విషయ నిర్ణయం జరుగుతుంది. పైన చెప్పుకున్నట్లుగా స్వబుద్ధి జ్యోతిషశాస్త్రం యొక్క పరిధిలో పనిచేయాలి. చాలా సంధర్భాలలో జ్యోతిషశాస్త్రము వివాహానికి సమ్మతించినా మనిషియొక్క స్వతంత్రబుద్ధి తన మనస్సు, ఇంద్రియాల కోరికల విషయాలను దృష్టిలో వుంచుకొని వివాహానికి సమ్మతించకపోవచ్చు. ఇలాంటి సమస్యలు ఎదురైనపుడు జ్యోతిష్కుడి కర్తవ్యం ఏమిటి? సమస్యతో సతమతమవుతున్న వ్యక్తి జ్యోతిష్కుడిని ఎందుకు ఆశ్రయించాలి? వ్యక్తి సమస్యనుండి బయటపడుటకు గల హిత మార్గం ఏది? శాస్త్రమా? స్వబుద్ధి నిర్ణయమా? ఇలాంటి చాలా ప్రశ్నలు ఎదురవుతాయి. ఇలాంటి సంధర్భాలలో వివేకప్రజ్ఞతో వ్యవహరించాలి.

మంచి జ్యోతిష్కుడు శాస్త్రంపై శ్రద్ధ వహించి శాస్త్రాన్ని సమగ్రంగా అధ్యయనం చేస్తాడు. ఎందుకనగా జ్యోతిషశాస్త్రం వేదాంగాలలో ఒకటి, వేదాలకు కళ్ళవంటిది. కావున మనిషియొక్క పూర్వకర్మల విషయాలు ఇంద్రియాలు అందవు. మనయొక్క బుద్ధితోను, ఇంద్రియాలతో పూర్వజన్మంలో చేసిన కర్మలను తెలుసుకోలేము. ఈ సంధర్భంలో వేదాంగమైనటువంటి, వేదచక్షువైనటువంటి జ్యోతిషశాస్త్రం పై వున్న


నమ్మకమే మార్గం. జ్యోతిష్కుడు శాస్త్రశ్రద్దతో పూర్వకర్మలను, సంస్కారాన్ని వివేకప్రజ్ఞతో అర్థంచేసుకోగల శక్తికలవాడు. కావున జ్యోతిష్కుడిని సంప్రదించునటువంటి వ్యక్తి శాస్త్రంపై శ్రద్ధగల జ్యోతిష్కుడిపై శ్రద్ధవుంచి సమస్యను వివరించాలి. అంటే అతని సలహాసే వేదంగా భావించాలి. శ్రద్ధ (విశ్వాసం) వుంచి అతడు ఆదేశించిన మార్గానికి కట్టుబడి నడవాలి. అలాంటి సంధర్బములో అతడి సమస్యకు సమాధానం శాస్త్రం పరోక్షంగా జ్యోతిష్కుడి ద్వారా అందిస్తుంది.

కొన్ని సందర్భాలలో శాస్త్రం వివాహానికి సమ్మతించినా వ్యక్తియొక్క బుద్ధి శాస్త్రంపై శ్రద్ధవుంచక స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటుంది. ఇంద్రియగోచరముకాని పూర్వకర్మల విషయాలలో బుద్ధికి పట్టు వుండదు కనుక సరియైన నిర్ణయం తీసుకోక అధోగతికి పాలవుతుంది. ఇక్కడ ఒక్క విషయం గమనించాలి. మనిషి శాశ్వత ఆనందం, సుఖం పొందగలిగేది శాస్త్రాన్ని, ధర్మాన్ని ఆశ్రయించినపుడే ఎందుకంటే శాశ్వత ఆనందం, సుఖం, మోక్షం మొదలైన విషయాలు స్వతంత్రబుద్ధికి గోచరించునవి కావు. తాత్కాలిక సంతోషాన్ని కలిగించే అందం, ఆస్తి–పాస్తులు, అధికారం, కీర్తి–ప్రతిష్టలు ఇంద్రియాలకు గోచరించునవి. ఈ విషయంలో స్వతంత్రబుద్ధి నిర్ణయించగలదు కాని ఎవరు తాత్కాలిక సంతోషాన్ని కోరుకుంటారు? తాత్కాలిక సంతోషాన్ని కలిగించే విషయాలకోసం శాస్త్రశ్రద్ధగల జ్యోతిష్కుడిని సంప్రదించడం వ్యర్థం.

ఇలాంటిసంధర్భాలలో జ్యోతిష్కుడు తన వివేకప్రజ్ఞతో వ్యవహరించి అతనికి శాస్త్రముపై శ్రద్ధకలుగునట్లు చేసి, తాత్కాలిక ఆనందమును ఆశించు విషయమునుంచి మళ్ళించి శాశ్వతమైన ఆనందము పొందుటకు మార్గము సూచించాలి. సూచించుట మాత్రమే జ్యోతిష్కుడి కర్తవ్యము. సూచించిన మార్గములో నడచుట లేక నడవకుండుట అనునది జీవుడియొక్క పూర్వకర్మలపై ఆధారపడి వుంటుంది.

34. గురువుగారు! బుద్ధియొక్క కార్యనిర్వహణ కొన్ని సంధర్భాలలో ఆలస్యమవుతుంది? దాని పరిణామం దేనిపై ప్రభావం చూపుతుంది.

శిష్యా! దీనికి సమాధానం కావలంటే మనస్సు, బుద్ధి ఇంద్రియాలను లోతుగా అధ్యయనం చేయవలసి వుంటుంది. ఒక్కో విషయాన్ని నెమ్మదిగా తెలుసుకుందాం. జాగ్రత్తగా తెలుసుకొని మననం చేయాలి.



పై చిత్రంలో మనిషి జీవనానికి సహకరించే అన్ని వ్యవస్థలను వాటి పని విధానాన్ని చూడవచ్చు. ఉపనిషత్తుల ఆధారంగా "ఆత్మ" అన్న శబ్దానికి అనేక అర్థాలున్నాయి. స్థూలంగా పరిశీలించినట్లైతే ఆత్మ అనగా శరీరనియామకడు. వ్యక్తిని గుర్తించుటకు శరీరమే ప్రధాన సాధనం. ఇంకా అధ్యయనం చేసినట్లైతే "ఆత్మ" ఒక మనస్సు కలదు. శరీరం ఒక జడవస్తువు. అందులో అన్నిరకాల జీవనవ్యాపారాన్ని సాగించేది, ప్రోత్సహించేది మనస్సుతో కూడిన ఆత్మే. ఇంకా లోతుగా ఆలోచిస్తే మనస్సు కూడా ఒక యంత్రమే. మనకు తెలిసినంతవరకు కళ్ళు చూస్తాయి కాని నిజానికి కళ్ళ ద్వారా మనం చూడగలుగుతాము. ఇక్కడ కళ్ళు అనేది ఒక సాధనము వలె పనిచేస్తుంది. ఇక మనస్సుయొక్క విషయానికి వస్తే మనస్సే స్వయంగా ఆలోచించదు. జీవాత్మ మనస్సు, ఇంద్రియాలద్వారా అన్ని విషాయలను గ్రహించి అలోచనను చేస్తుంది అనేదే వాస్తవమైన కటికసత్యం. "నేను అనునది "ఆత్మకు" ఉన్న మూల రూపం. కావున ఆత్మ ఐదువిభాగము గలిగిన మనస్సు, బుద్ధి, చిత్తం,చైతన్యం, అహంల యొక్క అనుభవాలని స్వీకరిస్తుంది. జీవుడు (ఆత్మ) తన కోరికలను నెరవేర్చుకొనుటకు మనస్సు, బుద్ధి, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాల సహాయంతో బాహ్య ప్రకృతితో సంబందం పెట్టుకుంటాడు. ఇంకా లోతుగా సూక్ష్మదృష్టితో, విచక్షణాజ్ఞానంతో ఆలోచిస్తే జీవుడికి కూడా స్వతంత్రంగా కార్యనిర్వహణ చేయుటకు శక్తిలేదు. ఉదాహరణకు రైతు విత్తనము వేయుటకు సంకల్పించగానే వర్షం రాదు. వర్షం వచ్చినప్పుడు విత్తనం వేయవలసి వుంటుంది.


మనకళ్ళు ఎంత బాగా పనిచేసినా వెలుగులేని చోట కనిపించదు. అంటే అన్ని కార్యాలను స్వతంత్రంగా ఎవడు నిర్వర్తించగలడో అతడే నిజమైన ఆత్మ అన్న సృష్టిరహస్యం బోదపడుతుంది వాడే పరాత్పరవస్తుమైన భగవంత(పరమాత్మ).

జీవుడు నిర్వర్తించదలచిన విషయాలను పొందుపరచగల సామర్త్యం కలిగి వుంటుంది మనస్సు. క్రికెట్ ఆటకు మైదానం ఎంత ముఖ్యమో మనము ఆలోచించుటకు, నిర్ణయం తీసుకొనుటకు, విషయాలను స్మరించుకొనుటకు కావలసిన మైదానమువలె మనస్సు పనిచేస్తుంది. ఇంకా చెప్పాలంటే ఒక తెల్ల కాగితమువలె మనస్సు వుంటుంది. ప్రతిరోజు చేయవలసిన పనిని ఆ కాగితములో రాసుకొని క్రమపద్దతిలో కార్యాలను నిర్వర్తించుటకు ఉపయోగపడు సాధనమువంటిది మనస్సు. మనస్సు లేనిచో ఆలోచించుటకు, స్మరించుటకు తావు వుండదు. కావున మనము ఆలోచించు విషయము/వస్తువు గురించి మొదట మనస్సు అను జాబితాలో పొందుపరచబడుతుంది (Store). మనస్సుకు అన్ని జ్ఞానేంద్రియాలతో పరస్పర సంబందం కలిగివుంటుంది. జీవుడు తనయొక్క ఇంద్రియభాగాలైన కళ్ళు, ముక్కు, చెవి, నాలుక, చర్మము ...మొదలైన జ్ఞానేంద్రియాల సహాయంతో సేకరించిన విషయాలను మనస్సులో పొందుపరుస్తాడు. ఇక చిత్తం విషయాన్ని పరిశీలిద్దాం. చిత్తం మనస్సు ఎక్కువసార్లు లేక ప్రధానంగా గ్రహించిన వస్తువిషయాలను శాశ్వతంగా పొందుపరచుకుంటుంది. ఈ విధంగా పొందుపరచిన సమాచారాన్ని అవసరం వచ్చినపుడు మనస్సు ఆత్మకు అందిస్తుంటుంది. దీనినే ఆంగ్లములో Storage Chamber అని అంటాము.మనయొక్క పాత జ్ఞాపకాలు అన్ని చిత్తంలోనివే. సందర్భం ఆసన్నమైనపుడు స్మరణశక్తి చిత్తంలో దాచిన సమాచారాన్ని మనస్సు ద్వారా అందిస్తుంది.

ఉదాహరణకు మనం ఉదయం లేవగానే చేయవలసిన పనులను, అమలుపరచవలసిన సమయాన్ని మొదట మనస్సు సహాయంతో గుర్తుపెట్టుకుంటాము. తరువాత అందులో రాసిన సమయాన్ని చేయదగిన కార్యాన్ని అనుసరించి, బుద్ధి సహాయంతో నిర్ణయించి కర్మేంద్రియాల మూలకముగా పనిని నిర్వర్తిస్తాము. జీవి జ్ఞానేంద్రియాల సహాయంతో బయటి సమాచారాన్ని మనస్సులోకి, మనస్సు నుండి అమలుచేయవలసిన పనిని, చేయవలసిన పద్ధతిని బయటి ప్రపంచానికి కర్మేంద్రియాల ద్వారా చేరవేస్తాడు. విషయ నిర్ధారణకు

బుద్ధియొక్క సహాయం తీసుకుంటాడు. ఇక్కడ మనస్సు అన్ని పనులు నిర్వర్తించడంలో కేంద్ర బిందువువలె వ్యవహరిస్తుంది. ఈ వ్యవస్థను ఇంకా చక్కగా ఉదాహరించాలంటే ఈ క్రింది విషయాన్ని పరిశీలించాలి.

క్రింది భవగద్గీతోపదేశానికి సంబందించిన చిత్రంలో శ్రీకృష్ణార్జులను చూడవచ్చు. ఇందులో ఒక్కొక్క అంశాన్ని మన మనవ్యవస్థకు సంబంధించిన ముఖ్య అంగాలకు పోల్చిచూద్దాం. జ్యోతిషశాస్త్రం ప్రకారం బుద్ధికి కారకుడైన గ్రహము బుధుడు. ఆ బుధుడికి అధిదేవత శ్రీ మహవిష్ణువు. ఆ మహావిష్ణుస్వరూపమైన శ్రీకృష్ణుడు బుద్ధికి ప్రతీకగాను, కృష్ణుడి చేతిలో వున్న లగాం మనస్సుగాను, లగామునకు కట్టబడిన గుఱ్ఱాలు ఇంద్రియాలుగాను, రథము మనిషిశరీరముగాను, రథములో కూర్చున్న అర్జునుడు ఆత్మగాని, శాస్త్రం యుద్ధభూమియైనటువంటి కురుక్షేత్రం(ధర్మక్షేత్రం)గాను వర్ణించినట్లైతే మనిషిజీవనవ్యవస్థలోని సత్యాలు భోదపడతాయి. రథములోని కూర్చున్న అర్జునుడు భీష్మ,ద్రోణ,కర్ణాది అతిరథమహారథివీరుల కంటే అల్పశక్తిగలవాడు. కాని శ్రీకృష్ణుడి వివేక ప్రజ్ఞతో, ప్రోత్సాహంతో



అర్జునుడు విజయం సాధించాడు. అదేవిధంగా మనశరీరథాన్నికూడా శ్రీకృష్ణుడివలె బుద్ధి నడపగలిగితే ఈ హృదయసామ్రాజ్య విజయం మనదౌవుతుంది. బుద్ధి లాంటి శ్రీకృష్ణుడు మనస్సు అను లగాం ద్వారా ఇంద్రియాల వంటి గుఱ్ఱాములను నియంత్రించగలిగితే శరీరమను రథము సక్రమంగా నడుస్తుంది, మన ఆధీనంలో వుంటుంది. మనస్సు, ఇంద్రియాలు, శరీరం బుద్ధి ఆధీనంలో వున్నట్లైతే, బుద్ధి చెప్పినట్లు వినగలిగితే ఈ శరీరమునందు కూర్చున్న అర్జునుడివంటి మన జీవాత్మ బుద్ధివంటి శ్రీకృష్ణుడి

సారథ్యంలో విజయం సాధించగలుగుతుంది. అలాకాకుండా బుద్ధిలాంటి సారథి మనస్సు అన్న లగాంను వదిలినట్లైతే ఇంద్రియాలనెడి గుఱ్ఱాలు తనకు ఇష్టం వచ్చినట్లు, ఇష్టం ఉన్నచోటికి తీసుకువెళ్లి శరీరమను రథాన్ని తలక్రిందులు చేసి పడగొడుతుంది. రథములో కూర్చున్న జీవాత్మ ఒంటరివాడై, ఈ హృదయసామ్రాజ్యాన్ని గెలువలేక నిరుత్సాహంతో అధోగతి అను ఓటమి పాలవుతాడు. కావున ఇక్కడ స్వతంత్రబుద్ధి (శ్రీకృష్ణుడు) శాస్త్రాధీనంగా (ధర్మాధీనంగా) మనస్సును (గుఱ్ఱాల లాగాం) తనవశానికి తెచ్చుకొని ఇంద్రియాలను (కోరికలనెడి గుఱ్ఱాలను) ఆధీనంలోకి తెచ్చుకోవాలి. లేనిచో ఇంద్రియాలు తమ కోరికలను నెరవేర్చుకొనుటకు మనస్సును, బుద్ధి తన ఆధీనంలోకి తెచ్చుకొని శాస్త్రశ్రద్ధకు కట్టుబడక శరీరాన్ని కోరికలవైపుకు త్రిప్పి జీవుడిని ఆధోగతిపాలుచేస్తుంది. చివరిగా తెలియదగునది ఏవిటంటే శాస్త్రంపై విశ్వాసం కలిగిన బుద్ధియొక్క ఆధీనంలో మనస్సు, మరియు ఇంద్రియాలు వుండాలి. లేనిచో ఇంద్రియాలు మనస్సును, బుద్ధిని తన ఆధీనంలోనికి తెచ్చుకొంటుంది. ఆ తరువాత మనిషిని అధ్యాత్మప్రపంచం నుండి దూరం చేసి అధోగతి పాలు చేస్తుంది. ఎందు కంటె మనస్సుకు ఎప్పుడూ నిశ్చయాత్మకమైన జ్ఞానముండదు. ***ఇదమదోహ ఇతి సంశయాత్మకం మనః*** అని చెప్పినట్లు ఎక్కడచూసినా మనస్సునకు సంశయాలే కలుగుతాయి. కావున ఎల్లప్పుడూ మనిషియొక్క మనస్సు బుద్ధియొక్క(శాస్త్రాలపై విశ్వాసం కలిగిన) ఆధీనంలో వుండాలి. అలాంటి సమయాలలోనే శాస్త్రంలో చెప్పిన విధంగా నడుచుకోగలుగుతాం. సమస్యలనుండి శాశ్వత విముక్తిని పొందగలుగుతాం.

35. గురువుగారు! మనస్సు, బుద్ధి మరియు జీవుడికి గల పరస్పర సంబంధాన్ని, నిర్వర్తించు కార్యాలను చక్కగా తెలియజేశారు. పై ప్రశ్నలకు సమాధానం ద్వారా శాస్త్రాలపై విశ్వాసంగల బుద్ధితో ఇంద్రియాలను నిగ్రహించాలన్న సత్యాన్ని తెలుసుకున్నాను. మరి శాస్త్రజ్ఞానం లేనివారు, శాస్త్రాన్ని అధ్యయనం చేయుటకు అనర్హులైనవారి కర్తవ్యమేమిటి?

శాస్త్రజ్ఞానంలేనివారు, ధర్మసూక్ష్మాలను తెలుసుకొనుటకు వినయంతో, శ్రద్ధతో శాస్త్రజ్ఞానంగల గురువును సంప్రదించాలి. వారి మాటలను వేదంగా భావించి విచక్షణా జ్ఞానంతో వ్యవహరించాలి.

హితాన్నిచ్చే కార్యాలను గావించాలి. ఇక్కడ **"ఇష్టం"** మరియు **" హితం"** అన్న రెండు అంశాలున్నాయి. హితమనగా దేనిని ఆచరించడం ద్వారా శాశ్వత సంతోషం, జీవుడికి సద్గతి కలుగుతుందో దానిని హితం అని శాస్త్రాలు చెబుతున్నాయి. హితం అనునది శాస్త్రాల ద్వారా మనకు తెలియదగు సంగతి. ఇష్టం అనునది ఇంద్రియాల కోరికలనుద్దేశించి కలుగు అనుభవం. ఇది శాశ్వతం కాదు. సదాచారముతో, నిష్టతో, శ్రద్ధతో శాస్త్రాన్ని అధ్యయనం చేసిన లౌకికాపేక్షలేని బ్రాహ్మణుడు హితమగు విషయాలను భోదిస్తాడు. ఇక్కడ ప్రతిమనిషీ విచక్షణా జ్ఞానం కలిగిన బుద్ధితో అటువంటి బ్రాహ్మణుడిని అన్వేషించి, శ్రద్ధతో ఆశ్రయించాలి.

36. గురువుగారు! ఇంతవరకూ జ్యోతిషశాస్త్రాధ్యయనమునకు వుండవలసిన శ్రాస్త్రశ్రద్ధ మరియు స్వతంత్రబుద్ధిని గురించి తెలుసుకున్నాను. ఇప్పుడు మీ నుండి సామాన్య జాతక ఫలనిర్ణయము తెలుసుకొను విధానమును భోదింపమని అర్థిస్తున్నాను.

మంచిది. శిష్యా! జాతకము ఆధారంగా ఫలనిర్ణయము చేయుటకు ముందుగా జ్యోతిషశాస్త్ర, ఖగోళశాస్త్రమునకు సంబంధించిన అనేక అంశాలను శ్రద్ధతో అభ్యాసం చేయాలి. కాలమును, గ్రహబలమును తెలుసుకోవాలి. గ్రహాలు, రాశులు, నక్షత్రాదులు, గ్రహాలస్వక్షేత్రం, ఉచ్చస్థానం, నీచస్తానం, వక్రగమనం, అస్తంగతం, గ్రహాల లక్షణాలు, రాశులధర్మాలు. గ్రహాలమైత్రి, శుభాశుభగ్రహాలు, గ్రహాల కారకత్వం, జన్మలగ్నం, ద్వాదశభావాలు, కేంద్ర,కోణ, దుష్టస్థానాలు, యోగకారకుడు, కేంద్రాధిపత్యదోషం, గ్రహబలం, బావబలం, అవి తెలుసుకొను పద్ధతి, జాతకాన్నిబట్టి గ్రహాల ఆధిపత్యము,భావాల వర్గీకరణ మొదలగు అంశాలు తెలుసుకోవాలి.

37. గురువుగారు! జాతకఫల విశ్లేషణకు కాలాన్ని ఏవిధంగా అధ్యయనం చేయాలో భోదించమని ప్రార్థిస్తున్నాను.

జ్యోతిషశాస్త్రంలోని ఫలభాగాన్ని అధ్యయనం చేయుటకు ముందు మనం కాలాన్ని గుర్తించడం, కాలబలాన్ని తెలుసుకోవడం అవసరం. ప్రస్తుతం సమయాన్ని గుర్తించే సాధనాల విషయానికొస్తే మనకు

వాడుకలో వున్నవి గంటలు, నిమిషాలు, సెకెనులు సూచించే గడియారం మరియు క్యాలెండర్ (Wall Clock, Calendar). వీటి సహాయంతో మనం సెకెనులు, నిమిషాలు, గంటలు, రోజు, వారం, నెలలు మరియు సంవత్సరములను మాత్రమే కొలవగలము. ఇది పాశ్చాత్యులనుంచి మనం పొందిన పద్దతి. ఈ పాశ్చాత్యపద్దతియందు (western System) బలాబలాలను నిర్దేశించడం కష్టం. ఉదాహరణకు 2 గంటలు మరియు 5 గంటలలో ఏది శుభమైనది మరియు బలమైనది? January మరియు February లలో ఏనెల వివాహానికి మంచిది? మొదలగువానిని నిర్ణయించుటకు పాశ్చాత్యపద్దతి ద్వారా సాధ్యంకాదు. కావున ఫల నిర్ణయం చేయడం కష్టం.

రాశి చక్రస్య యే భాగాః సమాః సప్తద్రిసంఖ్యకాః ।
అశ్వినీ, భరణీత్యాది నామ్నాఖ్యాతా మహీతలే ॥
తదర్క్యమితభాగాస్తు జ్ఞేయా మేషాది నామకాః ।
రాశయస్స్యుస్సువిదితాః గ్రహాస్సూర్యాది సంజ్ఞకాః ॥

ప్రాచీనపద్ధతిని తీసుకున్నట్లయితే రాశులు, నక్షత్రాలు, పాదాలు, గ్రహాలు, వాటి సంచారాన్ని ఆధారంగా చేసుకొని కాలాన్ని తెలుసుకోవచ్చు. అనాదికాలం నుండి కూడా వాడుకలోవున్న పద్ధతి ఇదే. మనం ఉపయోగించే గడియారంలాగానే విశ్వచక్రంలో 12 రాశులు, 27 నక్షత్రాలు, ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదాలను కలిగివుంటుంది.

మనం చిన్ననాటి బడిపుస్తకాలలో చదువుకున్నట్లు గ్రహాలన్ని సూర్యుడి చుట్టు దీర్ఘవృత్తాకార కక్షలో తిరుగుతూ వుంటాయి. చంద్రుడు మాత్రం భూమి చుట్టూ తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతుంది. ఈ దీర్ఘవృత్తాకార చక్రం 360 డిగ్రీలు కలిగివున్నది. ఈ 360 డిగ్రీలు 12 బాగాలుగా విబజించబడి వుంటాయి.

మేషో వృషశ్చ మిథునః కర్క సింహ కుమారికాః
తులా విచాప మకరాః కుంభమీనౌ యథాక్రమం ॥

1. మేషం, 2. వృషభం 3. మిథునం 4. కర్కాటకం 5. సింహం 6. కన్య
7. తుల , 8. వృశ్చికం 9. ధనుస్సు 10. మకరం 11. కుంభం 12. మీనం

మన గడియారంలోని అంకెలవలె ఈ దీర్ఘవృత్తాకారచక్రంలో (12 రాశులలో) 27 నక్షత్రాల అమరిక వుంటుంది. ఈ నక్షత్రాలన్ని స్థిరంగావుండి తిరుగుతున్న గ్రహాలయొక్క స్థానాన్ని తెలుపుతుంది. ఒక్కొక్క నక్షత్రానికి ४ పాదాలు కలిగి వుంటాయి. 27 నక్షత్రాలు 108 పాదాలు కలిగి వుంటాయి.

కాల చక్రం	–	**360** డిగ్రీలు కలిగి వుంటాయి
ఒక్కొక్క రాశి	–	30 కలిగివుంటాయి
ఒక్కొక్క నక్షత్రం	–	13 డిగ్రీల 20 నిమిషాలు కలిగి వుంటాయి.
ఒక్కొక్క పాదం	–	3 డిగ్రీల 20 నిమిషాలు కలిగి వుంటాయి.

నక్షత్రాలు

1 అశ్విని 2. భరణి 3. కృత్తిక 4. రోహిణీ 5. మృగశిర 6. ఆరుద్ర 7. పునర్వసు 8. పుష్యమి
9. ఆశ్లేష 10. మఖ 11. పుబ్బ 12. ఉత్తర 13. హస్త 14. చిత్త 15. స్వాతి 16. విశాఖ
17. అనూరాధ 18. జ్యేష్ఠ 19. మూల 20. పూర్వాషాడ 21. ఉత్తరాషాడ 22. శ్రవణం
23. ధనిష్ఠ 24. శతభిషం 25. పూర్వాబాద్ర 26. ఉత్తరాబాద్ర 27. రేవతి

38. గురువుగారు! నక్షత్రాలు కూడా గ్రహాలవలె తిరుగుతాయా? నక్షత్రాలకు, రాశులకు, గ్రహాలకు గల సంబంధమేమిటి?

మనము ఉపయోగించే గడియారమువలె సౌరకుటుంబముయొక్క వ్యవస్థ పనిచేస్తుంటుంది. మనరోజువారి దినచర్యలను గడియారాన్ననుసరించి ఏవిదంగా నిర్వర్తిస్తామో అదేవిదంగా ఈ గ్రహ, నక్షత్ర, రాశి సంబంధితమైన విశ్వగడియారాన్ననుసరించి 3 లోకాల వ్యాపారాలు కొనసాగుతున్నాయి. గడియారములో సూచించు ౧౨ సంఖ్యలలాగే ౧౨రాశులు ఈ విశ్వగడియారంలో కలవు. గ్రహాలే సమయాన్ని గుర్తించు సూచికలు. నక్షత్రాలు రాశులయందు అమర్చబడినట్లుండి గ్రహాలయొక్క ఖచ్చితమైన స్థానాన్ని, గమనాన్ని తెలుపుతాయి.

విశ్వగడియారంలో 12 రాశులుంటాయి. 12 రాశులలో 27 నక్షత్రాల అమరిక వుంటుంది. ఒక్కొక్క నక్షత్రాన్ని నాలుగు భాగాలుగా విభజించబడియుంటాయి. దీనినే పాదాలు అంటాం. 27 నక్షత్రాలకు కలిపి 108 పాదాలు ఉంటాయి. ఒక్కొక్క రాశి 9 పాదాలు (2 నక్షత్రాలు మరియు ఒక పాదం) కలిగివుంటుంది.

1. మేషరాశి:- అశ్విని 1,2,3,4 పాదాలు, భరణి 1,2,3,4 పాదాలు, కృత్తిక 1 పాదం
2. వృషభం:- కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి 1,2,3,4 పాదాలు, మృగశిర 1,2 పాదాలు
3. మిథునం:- మృగశిర 3,4 పాదాలు, ఆరుద్ర 1,2,3,4 పాదాలు, పునర్వసు 1,2,3 పాదాలు
4. కర్కాటకం:- పునర్వసు 4 పాదం, పుష్యమి 1,2,3,4 పాదాలు, ఆశ్లేష 1,2,3,4 పాదాలు
5. సింహం:- మఖ 1,2,3,4 పాదాలు, పుబ్బ 1,2,3,4 పాదాలు, ఉత్తర 1పాదం
6. కన్య:- ఉత్తర 3,4,5 పాదాలు, హస్త 1,2,3,4 పాదాలు చిత్త 1, 2 పాదాలు
7. తుల:- చిత్త 3,4 పాదాలు, స్వాతి 1,2,3,4 పాదాలు, విశాఖ 1,2,3 పాదాలు
8. వృశ్చికం:- విశాఖ 4 పాదం, అనూరాద 1,2,3,4 పాదాలు, జ్యేష్ఠ 1,2,3,4 పాదాలు
9. ధనుస్సు:- మూల 1,2,3,4 పాదాలు, పూర్వాషాడ 1,2,3,4 పాదాలు, ఉత్తరాషాడ 1 పాదం
10. మకరం:- ఉత్తరాషాడ 2,3,4 పాదాలు, శ్రవణం 1,2,3,4 పాదాలు, ధనిష్ఠ 1,2 పాదాలు
11. కుంభం:- ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం 1,2,3,4 పాదాలు పూర్వాబాద్రా ౧,౨,౩ పాదాలు
12. మీనం:- పూర్వాబాద్ర 4 పాదం, ఉత్తరాబాద్ర 1,2,3,4 పాదాలు, రేవతి 1,2,3,4 పాదాలు






రాశులు, నక్షత్రాల అమరిక ధీర్ఘవృత్తాకారంగా స్థిరముగా వుంటుంది. గ్రహాలు రాశులు, నక్షత్రాల ధీర్ఘవృత్తాకార కక్షలో సూర్యుడి చుట్టూ తిరుగుతాయి. గ్రహాలనెడి సూచికల ద్వారా సమయాన్ని తెలుసుకోవచ్చు. గ్రహాలు సంచరిస్తూ తామున్న రాశి, నక్షత్రం పాదం ఆధారంగా కాలాన్ని కాలబలాన్ని తెలుసుకుంటాం.

39. గురువుగారూ! మరి రాహుకేతువుల మాటేమిటి? అవి చాయాగ్రహాలని చాలా పుస్తకాలలో చదివాను. వాటిగురించి వివరించగలరు.

పురాణాలలో రాహుకేతువులకు సంబందించిన ఒక కథ వున్నది. బహుశః అది అందరికీ తెలిసిన విషయమే. క్షీరసాగరమథనంలో లక్ష్మీదేవి, కామదేనువు, కాలకూటవిషం, అమృతం మొదలగునవి ఆవిర్భవించాయి. మోహినీరూపధారుడైన శ్రీమహావిష్ణువు అమృతాన్ని దేవతలకు మాత్రమే వడ్డిస్తున్నాడన్న విషయాన్ని గమనించిన స్వర్భాను అను రాక్షసుడు దేవతల వరుసలో కూర్చున్నాడు. వరుసక్రమములో వున్న తనకు కూడా అమృతములభించినది. సూర్యచంద్రాదులు ఈ విషయాన్ని తెలుపడంతో మోహినీరూపదారుడైన శ్రీమహావిష్ణువు తనచక్రముతో స్వర్భానువు యొక్క శిరస్సును ఖండించాడు. అమృతపానము చేసినందున మరణమునుండి తప్పించుకొని తల, మొండెము వేరయిననూ సజీవంగానే బ్రతికాడు. శాస్త్రంలో తల బాగం రాహువుగాను మొండెము కేతువుగాను పరిగణించబడ్డాయి.

ఖగోళశాస్త్రప్రకారం చూసినట్లైతే సూర్యుడు ప్రయాణించు కక్ష మరియు చంద్రుడి కక్ష రెండు బిందువుల వద్ద ఖండించుకొనును. చంద్రుడు క్రిందివైపు ప్రయాణించు బిందువునకు కేతువుగాను, పైకి

ప్రయాణించు బిందువు రాహువుగాను సూచించబడ్డాయి. శరీరములేని రాహువు మోహకారకుడిగాను, తలలేని కేతువు మోక్షకారకుడిగాని జ్యోతిషశాస్త్రంలో పరిగణించబడ్డారు. రాహుకేతువులు జాతకచక్రమందు అపసవ్యదిశయందు సంచరిస్తుంటారు. రాహువుకు సరిగ్గా 180 డిగ్రీలలో అనగా సరిగ్గా 7వ రాశిలో కేతువు వుంటాడు.



40. గురువుగారూ! గ్రహం సంచరిస్తున్న రాశి, నక్షత్రం, పాదం ఆధారంగా కాలాన్ని తెలుసుకోవచ్చని సెలవిచ్చారు. మరియు కాలబలాన్ని తెలుసుకొను పద్ధతిని వివరించండి.

గ్రహాలన్ని కూడా దీర్ఘవృత్తాకార నక్షత్ర పరిధిలో సంచరిస్తూ వుంటాయి. ఈ విదంగా తిరుగుతున్న గ్రహాలు ఒక నిర్దిష్టమైన స్థానాన్ని చేరుకోగానే అత్యధికమైన బలం ఏర్పడుతుంది. దీనిసే ఉచ్ఛస్థితి (Exaltation) అని అంటాం. ఉచ్ఛస్థితికి చేరువలో ప్రయాణిస్తున్న గ్రహం ఉచ్ఛబలం కలిగివుంటుంది. ఏ గ్రహానికైన ఉచ్ఛస్థితికి వ్యతిరేక దిశాగా (180 Degrees - opposite point) వున్న స్థానం బలహీనంగా వుంటుంది. దీనిసే నీచ స్థితి అంటాం (Debilitation).

అజో వృషో మృగశ్చైవ కన్యాకర్కో ఝషస్తులా ।
సూర్యాదీనాం క్రమాదేతే గదితాస్తుంగరా శయః ॥
దశాగ్ని మనుయుక్తి థ్యక్ష నక్షత్ర నఖాః క్రమాత్ ।
భాగాః సప్తమభం తేద్యో నీచం త్రైరేవ భాగకైః ॥

ఈ ఉచ్చ, నీచ స్థానాల ఆధారంగా గ్రహాలయొక్క బలాలను తెలుసుకోవచ్చు. గ్రహలక్షణాలను కూడా తెలుసుకోవడానికి ఒక్కొక్క రాశికి కొన్ని నిర్దిష్టమైన ధర్మాలను కూడా ఇవ్వబడింది. జాతక పరిశీలన విషయంలో ఈ ధర్మాలను ఉపయోగించి విషయ స్వభావాన్ని తెలుసుకోవచ్చు.

రాశులు – అధిపతులు

మేష, వృశ్చికములకు	– కుజుడు
వృషభ, తుల	– శుక్రుడు
మిథున, కన్య	– బుధుడు
కర్కాటం	– చంద్రుడు
సింహం	– సూర్యుడు
ధనుస్సు, మీనము	– గురువు
మకరము, కుంభము	– శని

గ్రహాలు – ఉచ్చ స్థానాలు

సూర్యుడు	–	మేషం
చంద్రుడు	–	వృషభము
కుజుడు	–	మకరము
బుధుడు	–	కన్య
గురువు	–	కర్కాటకము
శుక్రుడు	–	మీనము
శని	–	తుల

గ్రహాలు	**–**	**నీచస్థానములు**
సూర్యుడు	–	తుల
చంద్రుడు	–	వృశ్చికము
కుజుడు	–	కర్కాటకము
బుధుడు	–	మీనము
గురువు	–	మకరం
శుక్రుడు	–	కన్య
శని	–	మేషము

గ్రహల - లక్షణాలు

పురుషగ్రహాలు = సూర్యుడు, గురువు, కుజుడు

స్త్రీగ్రహాలు = శుక్రుడు, చంద్రుడు

నపుంసక గ్రహాలు = శని, బుధుడు

గ్రహాలు - అధిదేవతలు

రవి - అగ్ని

చంద్రుడు - వరుణుడు

కుజుడు - సుబ్రమణ్యస్వామి

బుదుడు - మహా విష్ణువు

గురువు - ఇంద్రుడు

శుక్రుడు - శచీదేవి

శని - బ్రహ్మ.

గ్రహాలు - వర్ణములు

సూర్య, కుజులు - క్షత్రియులు

చంద్రుడు,బుధుడు - వైశ్యుడు

గురు, శుక్రులు -బ్రాహ్మణులు

శని - శూద్రుడు

రాహువు, కేతు - చండాల వర్ణము

రాశులు - లింగభేదాలు

పురుషరాశులు - మేషము, మిథునము, సింహము, తుల, ధనుస్సు, కుంభము

స్త్రీరాశులు – వృషభము, కర్కాటకము, కన్య, వృశ్చికము, మకరము, మీనము

రాశులు – స్వభావాలు

చర రాశులు – మేషము, కర్కాటకము, తుల, మకరము
స్థిరరాశులు – వృషభము, సింహము, వృశ్చికము, కుంభము
ద్విస్వభావరాశులు– మిథునము, కన్య, ధనస్సు, మీనము

రాశులు – వర్ణాలు

క్షత్రియ – మేషము, సింహము, ధనుస్సు
వైశ్య – వృషభము, కన్య, మకరము
శూద్ర – మిథునము, తుల, కుంభము
బ్రాహ్మణ – కర్కాటకము, వృశ్చికము, మీనము

రాశులు – తత్వాలు

అగ్ని – మేషము, సింహము, ధనుస్సు
పృథ్వి – వృషభము, కన్య, మకరము
వాయు – మిథునము, తుల, కుంభము
జల – కర్కాటకము, మీనము
ఆకాశ – వృశ్చికము

రాశులు – పురుషార్థాలు

ధర్మం– మేషము, సింహము, ధనుస్సు
అర్థం– వృషభము, కన్య, మకరము
కామం– మిథునము, తుల, కుంభము
మోక్షం– కర్కాటకము, వృశ్చికము, మీనము

41. గురువుగారు! గ్రహాల సంచారమును ఏవిదంగా తెలుసుకోవాలి? వాటి సంచారమునకు పట్టు సమయాన్ని తెలియజేయగలరు.

ధీర్ఘవృత్తాకారకక్షలో సంచరించు గ్రహాలకు ఒకరాశినుండి ఇంకొకరాశికి సంచరించుటకు ఈ క్రింద తెలిపిన సమయము పట్టును.

చంద్రుడు	–	2.5 రోజులు
బుదుడు, శుక్రుడు	–	30 రోజులు
సూర్యుడు	–	30 రోజులు
కుజుడు	–	45 రోజులు
గురువు	–	1 సంవత్సరము
రాహు/కేతువు	–	1.5 సంవత్సరము
శని	–	2.5 సంవత్సరములు.

గ్రహసంచార విషయములను పంచాంగము ద్వారా ప్రతిరోజూ తెలుసుకొనవలెను.

42. గురువుగారూ! గ్రహాలు కొన్ని సమయాలలో "వక్రగమనమని" పంచాంగములో చూపెదరు. మరి వక్రగమనముగూర్చి తెలుపగలరు.

వక్రి"యనగా వెనుదిరిగి ప్రయాణించడం అని అర్ధం. గ్రహాలు కొన్ని సందర్భాలలో వక్రగమనంలో సంచరిస్తాయి. ఖగోళశాస్త్రం ప్రకారం పరిశీలిస్తే గ్రహాలకు ఇది వర్తించదు. గ్రహాలు వెనుదిరిగి ప్రయాణించవు. గ్రహాలన్నీ ఎల్లప్పుడూ సవ్యదిశలోనే ప్రయాణిస్తాయి. రాహు,కేతువులు మాత్రం ఎల్లప్పుడూ అపసవ్యదిశలోనే ప్రయాణిస్తారు.

ఇక్కడ చాలామందికి ఇంకొక ప్రశ్నలు ఉదయిస్తుంది. ఖగోళశాస్త్రం ప్రకారం పరిశీలిస్తే సౌరకుటుంబంలో గ్రహాలతో పాటు మన భూమి కూడా కనిపిస్తుంది. సూర్యుడు స్థిరంగా వుండు నక్షత్రంగా పరిగణిస్తారు. మరి జ్యోతిషశాస్త్రంలో భూమి ఎందుకు కనిపించదు? సూర్యుడిని గ్రహాలలో ఎందుకు చేర్చారు? అన్న అనుమానం వస్తుంది. జ్యోతిషశాస్త్రప్రకారం గ్రహాల ఆధారంగా కాలాన్ని గుర్తించేది భూమిపైనుండే కదా! అంటే భూమిని ఆధారంగా చేసుకొని గ్రహగతులను సూచిస్తామన్నమాట (Geocentric) . మనం భూమిపై వుండుటచే ఇచ్చట జ్యోతిషశాస్త్రంలో భూమి ప్రస్తావన వుండదు. జ్యోతిషశాస్త్రంలో భూమికి బదులుగా సూర్యుడిని మనం గ్రహంగా తీసుకొని బలనిర్ణయం, ఫలనిర్ణయం గావిస్తాము.

ఇక వక్రి విషయానికి వద్దాం. ముందుగా ఒక చక్కటి ఉదాహరణను తీసుకుందాం. మనం

కారులో ప్రయాణిస్తున్నాము అనుకుందాం. మన ఎదురుగా ఒక పెద్ద బస్సు వెళ్తున్నది. ఇప్పుడు కారు వేగాన్ని పెంచినట్లైతే అది బస్సువేగాన్ని అధిగమించి, బస్సును దాటుతూ కారు ముందుకు వెళ్తుంది. ఆసమయాన కారులో ప్రయాణించువారికి బస్సు వెనుకకు వెళ్తున్నట్లు కనిపిస్తుంది. నిజానికి బస్సు ముందుకే ప్రయాణిస్తుంటుంది కాని కారులోవున్నవారికి కొద్ది సమయం పాటు వెనుదిశగా వెళ్తున్నట్లు కనిపిస్తుంది. గ్రహాల విషయంలో కూడా ఇదే దోరణి కలిగియుంటుంది. భూమి గ్రహాల వేగాన్ని చేదించినపుడు భూమిపై వున్న మనకు ఆ గ్రహం వెనుదిశగా ప్రయాణిస్తున్నట్లు కనిపిస్తుంది. దీనినే వక్రి అంటాం. జ్యోతిషశాస్త్ర ఫలనిర్ణయంలో వక్రియైన గ్రహాల యొక్క ప్రభావం ఎక్కువగా వుంటుంది.

43. గురువుగారూ! గ్రహాల అస్తంగతమంటే ఏమిటో వివరించగలరు?

సూర్యుడికి అతి సమీపంగా సంచరించు గ్రహం అతని ప్రఖరకిరణాలా ధాటికి దాని శక్తిని కోల్పోతుంది. దీనినే "అస్తంగతం" అంటాం. చంద్రుడు సూర్యుడికి దగ్గరగా సమీపిస్తే వెలుగును కోల్పోతుంది. దానినే మనం అమావాస్య అంటాం. దీని ప్రభావం ఫలభాగంలో అధ్యయనం చేయవచ్చు. పంచగ్రహాలు ఎప్పుడు అస్తంగతమవుతాయో ఈ క్రింది డిగ్రీలాఅధారంగా తెలుసుకోవచ్చు

కుజుడు 17 డిగ్రీల దూరంలో, గురువు 11 డిగ్రీలు, శుక్రుడు 8 డిగ్రీలు, శని 15 డిగ్రీలు, బుదుడు 14 డిగ్రీలు వక్రియైన 12 డిగ్రీలు.

44. గురువుగారు! గ్రహాల మిత్రత్వ-శత్రుత్వ విషయాలను భోదించగలరు.

మంచిప్రశ్న. ఇక్కడ గ్రహాల శత్రుత్వం, మిత్రత్వం అనాగా ఆ గ్రహాలు తెలియజేసే విషయాలకు శత్రుత్వం మరియు మిత్రత్వం అని గ్రహించాలి. గ్రహాలు మనకంటే చాలా ఉన్నతస్థాయిని, గుణగణాలు కలిగిన దేవతలు. వారియందు మనకున్నట్లు భేదాభిప్రాయాలు ఉండవు. వారు తెలియజేయు అంశాలకు మాత్రమే ఈ మిత్రత్వ-శత్రుత్వ విషయాలు వర్తిస్తాయన్న విషయం గ్రహించాలి. ఇక్కడ గ్రహాల యొక్క మైత్రి రెండువిధాలుగా తెలువబడింది.

1. సహజ మైత్రి 2. తాత్కాలిక మైత్రి

క్రింది పట్టిక ద్వారా సహజ మిత్రత్వ–శత్రుత్వ విషయాలను తెలుసుకోవచ్చు.

గ్రహము	మిత్రులు	సములు	శత్రువులు
రవి	చంద్రుడు, కుజుడు, గురువు;	బుధుడు	శుక్రుడు, శని
చంద్రుడు	రవి, బుధుడు	కుజుడు, గురువు, శుక్రుడు, శని	–
కుజుడు	రవి, చంద్రుడు, గురువు	శుక్రుడు, శని	బుధుడు
బుధుడు	రవి, శుక్రుడు	శని,గురువు,కుజుడు	చంద్రుడు
గురువు	రవి, చంద్రుడు, కుజుడు	శని	బుధుడు, శుక్రుడు
శుక్రుడు	బుధుడు, శని, కుజుడు	గురువు	రవి, చంద్రుడు
శని	బుధుడు, శుక్రుడు	గురువు	రవి, చంద్రుడు, కుజుడు

తాత్కాలిక సంబంధం:–

వ్యక్తి జాతకచక్రంలో ఏదైనా ఒక గ్రహం తానున్న రాశినుంచి 2,3,4 మరియు 10,11,12 రాశులలో వున్న గ్రహాలు తాత్కాలిక మిత్రులగుదురు. జాతక చక్రంలో ఏదైనా గ్రహం తానున్న రాశినుంచి 1,5,6,7,8,9 రాశులలో వున్న గ్రహాలు తాత్కాలిక శత్రువులగుదురు.

పంచద మైత్రి:–

గ్రహాల సహజ మైత్రి మరియు తాత్కాలిక మైత్రిని సమన్వయం చేయగా ఏర్పడు మైత్రి. జాతకంలోని గ్రహాల మైత్రిని అధ్యయనం చేయునపుడు ప్రధానంగా పంచధామైత్రినే చూడాలి.

నైసర్గిక మిత్ర	+	తాత్కాలిక మిత్ర	=	పరమ మిత్ర
నైసర్గిక మిత్ర	+	తాత్కాలిక సమ	=	మిత్ర
నైసర్గిక మిత్ర	+	తాత్కాలిక శత్రు	=	సమ
నైసర్గిక సమ	+	తాత్కాలిక మిత్ర	=	మిత్ర
నైసర్గిక సమ	+	తాత్కాలిక శత్రు	=	శత్రు
నైసర్గిక శత్రు	+	తాత్కాలిక శత్రు	=	పరమ శత్రు

కుజ	రాశిచక్రం-2		కేతువు
రాహువు			లగ్నం గురు
	బుధ	రవి	శుక్ర చంద్ర

పై ఉదాహరణ జాతము ఆధారంగా కొన్ని గ్రహాలకు మిత్ర–శత్రుత్వ విషయాలను తెలుసుకుందాం.

గురువు–శుక్రుడు: గురువునకు సహజ శత్రువు శుక్రుడు. ఉదాహరణ జాతకమందు గురువు నుండి శుక్రుడు **2** వస్థానం నందు తాత్కాలిక మిత్రుడైనాడు. రెండింటిని అనుసందానించినట్లైతే అనగా పంచదమైత్రి:– సహజ శత్రువు + తాత్కాలిక మిత్రుడు = సముడు.

45. గురువుగారు! గ్రహాలయొక్క దృష్టి గురించి భోధించగోరుతున్నాను.

రాశులలో సంచరిస్తున్న అన్ని గ్రహాలకు తానున్న రాశినుండి ఏడవ (7th or 180 opposite house) రాశిని మరియు అందులో వున్న గ్రహంపై దృష్టి కల్గివుండును. ప్రత్యేకముగా గురుగ్రహమునకు సప్తమ దృష్టితో పాటు పంచమ, నవమ దృష్టి; శనికి సప్తమ దృష్టితో పాటు తృతీయ మరియు దశమదృష్టి, కుజునికి సప్తమ దృష్టితో పాటు చతుర్థ మరియు అష్టమదృష్టి విశేషముగా కలిగి వుండును. గ్రహదృష్టివలన పరిశీలించు విషయములలో మార్పులు సంభవించును. శుభగ్రహములు చూసినచో శుభదృష్టియనియు, అశుభగ్రహములు చూసినచో పాపదృష్టియనియు తెలియవలెను.

46. గురువుగారు! గ్రహ, భావ కారకత్వమనగానేమి? వివరించగలరు.

జాతక ఫలమును తెలుసుకొనుటకు ప్రతియొక్క గ్రహమునకు సహజ మరియు ఆధిపత్య కారకత్వములు భగవంతుడు ఒసంగినాడు. కావున గ్రహముల బలమును, కారకత్వమునసరించి ఫలమును తెలుసుకొనవచ్చును. సహజ కారకత్వమనగా శాశ్వతమైన భాధ్యతను (Permanent Duty) తెలుపునని అను అర్థము. ఇది దేశ, కాల, పరిస్థితులను బట్టి మారదు. మనిషియొక్క సహజ గుణాలను, సంస్కారమును మరియు నైపుణ్యాన్ని తెలుపును. గ్రహముయొక్క సహజ లక్షణమును బట్టి అనుభవించుయోగము, నైపుణ్యమును, భావముయొక్క కారకత్వమును బట్టి (భావాధిపతి) వస్తువును, లాభాన్ని పొందడం అని గ్రహించాలి. ధనమున్నవారికెల్ల సుఖముండదు. ఆ ధనమును అనుభవించు అదృష్టము కొందరికి మాత్రమే వుంటుంది. బ్యాంకులోని క్యాషియర్ వద్ద చాలా డబ్బు ఉంటుంది. కాని ఆ ధనమును అనుభవించుయోగము వుండదు. ధనము వుండుట, ఆర్జించుట వ్యక్తియొక్క కర్మను బట్టీ వుంటుంది. కాని వాటివలన ప్రయోజనం పొందుట అనగా విద్యను అభ్యసించుట, ఉద్యోగములో ప్రతిభ చూపుట, భార్యాసౌఖ్యము పొందుట ఇవన్నియూ కొద్దిమంది మాత్రమే అదృష్టాన్ని కల్గియుంటారు. సహజకారకత్వం అనునది మనిషి అనుభవానికి వచ్చు అంతర్గత అనుభూతి (Inner experience). కావున సహజకారకత్వం జాతకపరిశీలనలో అతిప్రధానమైనది. ప్రతి ఒక గ్రహం కూడా కొన్ని విషయాలకు కారకత్వం వహిస్తుంది. మనం ఇప్పుడు గ్రహాలయొక్క కొన్ని ముఖ్యమైన కారకత్వవిశేషాలను తెలుసుకుందాం.

రవి:– ఆత్మ, పిత (తండ్రి), తనువు, రాజ్యము, స్వభావము, ధైర్యము, అధికారము, పిత్తము.

చంద్రుడు:– మాత, మనస్సు, బుద్ధి, సౌందర్యము, జల, సౌఖ్యము, బలము, సత్యము.

కుజుడు:– సోదరసోదరీమణులు, భూమి, పరాక్రమము, కోపము, అహంకారము, తర్కశాస్త్రము, శస్త్ర విద్య, శత్రు వృద్ధి, ఉష్ణము, స్ఫోటకములు (Blastings).

బుదుడు:– జ్యోతిష్యము, గణితము, వ్యవహారము, వర్తకము, యుక్తి, జ్ఞాతులు, తంత్రము, వేదాంత విచారము, విష్ణు భక్తి, పరిహాసము, వైద్యము.

గురువు:– ధనము, విద్య, పుత్రులు, జ్యోతిష్యము, వేదశాస్త్రము, స్వర్ణము, ఆచారము, సత్కర్మ, శాంతము, ధర్మము, దైవ భక్తి, సత్యము.

శుక్రుడు:– కళత్రము, వివాహము, సాహిత్యము, స్త్రీ సౌఖ్యము, కామము, భోగము, వ్యభిచారము, వాహన సౌఖ్యము, నృత్యము, హాస్యము.

శని:– ఆయుర్దాయము, నీచ విద్య, మరణము, అధర్మము, దుఃఖము, బందనము, స్ఫోటకము, దుష్ప్రవర్తన, పాపము, నరకము, నీచ జీవనము.

రాహువు:– మాతామహ చింత, మోహము, కామము, విష వైద్యము.

కేతువు:– మోక్షము, పితామహ చింత, వేదాంత విచారణ, దైవభక్తి, వైరాగ్యము, జ్ఞానము.

ఆధిపత్య కారకత్వము అనగా జీవికి సంబందించిన పూర్వకర్మ(సంచిత, ప్రారబ్ధము ఆగామి). పూర్వపుణ్యా విషయాలను (అద్యాత్మిక మరియు లౌకిక సంబంధ విషయాలు) భావాలకు నిర్దేశించబడింది. జాతకాన్ని బట్టీ 12 భావాలకు ఏ ఏ గ్రహం ఆధిపత్యం వహిస్తుందో ఆ గ్రహం ఆవిషయాలకు బాధ్యత వహించి ఫలాన్ని యివ్వడం జరుగుతుంది. భావకారకత్వములను లగ్నమున సహాయంతో తెలుసుకోవాలి. ఇప్పుడు మనం లగ్నం గురించి తెలుసుకుందాం.

లగ్నమనగా (Ascendant) ఏదైనా సంఘటన/క్రియ జరిగినపుడు పూర్వదిక్కులో భూమికి తాకుతూ ఉదయిస్తున్నటువంటి రాశిని లగ్నంగా గుర్తిస్తాం. లగ్నము అనునది అక్షాంశానుసారం ప్రాంతాలవారిగా భేదమగును. కావున జాతకంలో జన్మస్థలం అనేది లగ్నం గణించుటలో ప్రధానమైనది. జననకాలమున ఏరాశి లగ్నమగునో అది ప్రథమ భావమవుతుంది. లగ్న రాశికి రెండవరాశి ద్వితీయ భావమవుతుంది. ఈ విదంగా లగ్నమునననుసరించియే ద్వాదశభావములను తెలియవలెను.

1. **తనుభావము** (లగ్నము):– శరీరము, ఆత్మ, రూపము, మనస్సు, స్వభావము మరియు వ్యక్తిత్వము.
2. **ధన భావము**:– ధనము, కుటుంబము, వాక్కు, నేత్రము, ముఖము, విద్య మరియు మారకము.
3. **భ్రాతు భావము:–** సోదరులు, ధైర్యము,చెవి, కోపము, ఉపాయము, మిత్రుడు, ఆయువు.
4. **సుఖభావము:–** మాత, విద్య, వాహనము, భూమి, గృహము,ముఖము, కూపము, వ్యవసాయము, పశువృద్ధి, సస్యవృద్ధి, బంధువులు.

5. **పుత్ర భావము** (పుణ్య భావము):– సంతానము, విద్య, పాండిత్యము, బుద్ధి, ప్రజ్ఞ, మంత్రము, సంచిత కర్మ.

6. **రుణ, రోగ, రిపు భావము**:–మేనమామ, పూర్వజన్మ పాపము, రోగము, శత్రువులు, జ్ఞాతులు, ఋణము

7. **కళత్రభావము:**– వివాహము, ప్రయాణము,కామము, భోగము, వ్యభిచారము, మారకము.

8. **ఆయుర్భావము:–** నిధి, సట్టా–లాటరి,పూర్వజన్మ పాపస్థానము, మరణము, జీవనము, దుఃఖము, పాపము, నరకము,అపఘాతము,

9. **భాగ్య భావము:–** తండ్రి, వంశము, పూర్వజన్మ పుణ్యము, ప్రారబ్ధకర్మ, తపస్సు, భక్తి, దయ, తీర్థయాత్ర.

10. **కర్మ భావము:–** రాజ్యము, ఆగామికర్మ, జీవనము, ఉద్యోగము, అధికారము, మానము, కీర్తి, వ్యాపారము.

11. **లాభము:–** లాభము, జేష్ఠ సోదరీసోదరులు, మిత్రులు, ధనార్జన, జయము.

12. **వ్యయము:–** ఐషారామజీవితము, రహస్యసుఖము, మోక్షము, జన్మాంతరము, నాశనము, దుర్వ్యయము, దుష్కార్యము, పాపము, నరకము.

47. గురువుగారు! త్రికోణము, కేంద్రం, దుష్టస్థానములగురించి వివరించగలరు.

1,5,9 భావాలను త్రికోణస్థానములనియు, లక్ష్మీ స్థానములనియు, పూర్వజన్మ పుణ్యస్థానములనియు, ఆధ్యాత్మిక స్థానములనియు అందురు. గతజన్మలో ఏ ఫలాన్ని ఆశించకుండా కర్తవ్యకర్మలను చేస్తూ జీవితాన్ని కొనసాగిస్తాడో అతని జాతకంలో కోణస్థానాలు బలంగా వుంటాయి. ఇవి మానసిక ఆనందాన్ని, తృప్తిని, జ్ఞానాన్ని కలుగజేస్తాయి. జీవికి ఈ జన్మలో సత్కామకర్మలను చేయుటకు తోడ్పడతాయి.

1,4,7,10 భావాలను కేంద్రస్థానములనియు, విష్ణుస్థానములనియు, లౌకిక స్థానములనియు, సుఖ స్థానములు అందురు. గతజన్మలో ఫలాన్నాశించి చేసిన మంచికర్మలవలన కేంద్రస్థానాలు బలపడతాయి.

ఇవి లౌకిక జీవనమునకు పునాదులువంటివి. ఆస్తి, ఐశ్వర్యం, భార్య, కీర్తిప్రతిష్టలు మొదలగు లౌకికభోగాలకు సంబంధించిన అంశాలను అనుగ్రహిస్తాయి.

6, 8, 12, 3 భావాలను దుష్టస్థానాలనియు, పూర్వజన్మ పాపస్థానములనియు, నరకస్థానములనియు పిలుస్తారు. గతజన్మలో పాపసంబంధమైన కార్యాలు చేసినవారికి, జనులను మానసికంగా శారీరకంగా హింసించినవారికి, అనాచారులకు, అధర్మమార్గములో నడుచువారికి, దుర్వ్యసనాలుగలవారికి, అధికారదుర్వినియోగము చేయువారికి, స్వలాభం చూసుకొనువారికి దుష్టస్థానాలు బలంగా వుంటాయి. దీని ప్రతిఫలంగా అనారోగ్యం, మానసిక వొత్తిడి, అప్పులు, శత్రువులు, బంధనము, వియోగం, నష్టం, కోపం, అహంకారం, మరణం మొదలగునవి కాలానుగుణంగా సంభవిస్తాయి.

48. గురువుగారు! శుభగ్రహాలు-పాపగ్రహాలని రెండుగా వర్గీకరించబడినది. దీని ఆంతర్యమేమిటో తెలియజేయగలరు.

శుభ-అశుభ గ్రహాలను రెండు రకాలుగా వర్గీకరించబడినది. శుభఫలమును ఇచ్చు గ్రహాలను శుభగ్రహములనియు. పాపఫలమునిచ్చు గ్రహాలను పాపగ్రహములనియు తెలియదగినది. ఇచ్చట గ్రహాలకు ఎటువంటి శుభ-పాప లక్షణములను ఆపాదించరాదు. మనుజుడు చేసిన శుభ-పాప కర్మలకు సూచకాలుగా గ్రహాలు వ్యవహరిస్తాయి. ఇక్కడ దోషము మనుజుడిదేకాని గ్రహాలు కారణము కాదని గ్రహించాలి. ఇక్కడ రెండు విధాల శుభ-అశుభ విషయములు తెలుపు గ్రహాలు కలవు.

గురువు, శుక్రుడు, శుభగ్రహములతో చేరిన బుదుడు, వృద్ధి చంద్రుడు సహజ శుభులు.

శని, కుజుడు, రాహువు, కేతువు, పాపులతో కలసిన బుదుడు, క్షీణ చంద్రుడు సహజంగా పాపము తెలుపు గ్రహములు. సూర్యుడు సహజ కౄర గ్రహము.

లగ్నం నుండి 1,5,9,4,7,10 భావాధిపతులు శుభులు

లగ్నం నుండి 6,8,12 భావాధిపతులు అశుభులు.

సహజంగా శుభులుగా-పాపులుగా ఉన్న గ్రహాలు లగ్నాన్నిబట్టి శుభుడు పాపిగానూ, పాపుడు శుభుడిగానూ మారగలరు.

49. గురువుగారూ! జాతకంలోని గ్రహాలయొక్క బలాబలాలను కనుగొను విధానమును తెలియజేయగలరు.

1. ఏదైనా ఒక గ్రహం ఉచ్ఛ స్తితిలో వున్నప్పుడు సంపూర్ణ బలం కలిగివుంటుంది (100 %)

2. ఏదైనా ఒక గ్రహం స్వక్షేత్రంలో వున్నట్లైతే బలం కలిగివుంటుంది (75 %)

3. ఏదైనా ఒక గ్రహం మిత్ర క్షేత్రంలో వున్నప్పుడు బలం కలిగివుంటుంది (50 %)

4. ఏదైనా ఒక గ్రహం సహజ శుభగ్రహంతో కలసివున్న లేదా శుభగ్రహాల దృష్టి వలన ఎక్కువ బలం చేకూరుతుంది.

5. ఏదైనా ఒక గ్రహం సమ క్షేత్రంలో వున్నప్పుడు తక్కువ బలాన్ని కలిగి వుంటుంది.

6. ఏదైనా ఒక గ్రహం శత్రు క్షేత్రంలో వున్నప్పుడు బలహీనంగావుంటుంది.

7. ఏదైనా ఒక గ్రహం నీచ స్తితిలో వున్నప్పుడు, సూర్యుని తో అస్తంగతమైనా మిక్కిలి బలహీనంగా వుంటుంది.

8. ఏదైనా ఒక గ్రహం వక్ర గమనంలో వున్నప్పుడు మిక్కిలి బలంగా వుంటుంది.

9. ఏదైనా ఒక గ్రహం సహజ పాపగ్రహములతో కలసివున్న లేదా పాప గ్రహాల దృష్టి పడినా ఎక్కువ బలహీనమవుతుంది.

భావాలకు మరియు భావాధిపతులకు కూడా ఇవే నియమాలు వర్తిస్తాయి.

1. ఏ భావాధిపతి ఆ భావంలో వున్నను లేదా తన భావాన్ని చూచినను ఆ భావం వృద్ధి అగును.

2. శుభ గ్రహాలు ఏదైనా భావంలోనైన వున్న లేదా చూసినను ఆ భావానికి బలం చెకూరుతుంది.

3. భావాధిపతి త్రికోణస్తానలలో(1,5,9) కాని కేంద్ర స్తానాలలో(1,4,7,10) కాని వున్నను లేదా కేంద్ర కోణాధిపతులు ఆ భావంలో వున్నను ఆభావం బలంగా వుంటుంది.

4. ఏ భావానికైనా భాగ్యాధిపతి సంబంధం వచ్చినా (స్థానం, సంయోగం, దృష్టి) ఆ భావం పరిపక్వత చెందును.

5. ఏదైనా భావంలో ఒక శుభగ్రహం మరియు ఒక అశుభగ్రహ సంబందం వచ్చినయెడల మిశ్రమ బలము కలిగివుండును.

6. ఏ భావానికైనా లేదా భావాధిపతికైనా పాప గ్రహ సంబంధం వచ్చినా ఆ భావం అశుభ ఫలములనిచ్చును.

7. జాతకంలో ఏదైనా భావాధిపతి ఉచ్చ స్థితిలో కాని లేదా స్వక్షేత్రంలోకాని వుండి పాపగ్రహ సంబందం లేకున్నను శుభఫలమును ఇచ్చువాడైతే శుభ ఫలములనిచ్చును.

8. జాతకంలో ఏదైనా భావాధిపతి నీచ స్థితిలోకాని, అస్తంగతమైనను, పాప గ్రహ సంబంధం కలిగినను అశుభ ఫలములనిచ్చును.

50. గురువుగారు! "యోగ కారకుడు" అనగా ఎవరు? తెలుసుకొనుట ఎటుల? మరియు కేంద్రాధిపత్యదోషము గూర్చి తెలుపగలరు.

ఒకే గ్రహానికి ఒక కేంద్రాధిపత్యము ఒక కోణాధిపత్యము వచ్చినచో ఆ గ్రహం ఆ జాతకునికి యోగకారకుడు" అగును. యోగకారకుడైన గ్రహం జాతకునికి శుభపలితములనిచ్చును. యోగకారకుడు పాపమును తెల్పెడి గ్రహమైననూ ఆజాతకుడికి మిక్కిలి శుభపలితములనిచ్చును. యోగకారకుడు కేవలం ఈ క్రింది లగ్నములకు మాత్రమే గలడు.

- వృషభలగ్నమునకు నవమ–దశమాధిపతియైన శని యోగకారకుడు.
- తుల లగ్నమునకుకు చతుర్థ–పంచమాధిపతియైన శని యోగకారకుడు.
- మకర లగ్నమునకు పంచమ–దశమాధిపతియైన శుక్రుడు యోగకారకుడు.
- కుంభ లగ్నమునకు చతుర్థ–నవమాధిపతియైన శుక్రుడు యోగకారకుడు.
- కర్కాటక లగ్నమునకు పంచమ–దశమాధిపతియైన కుజుడు యోగకారకుడు.
- సింహ లగ్నమునకు చతుర్థ–నవమాధిపతియైన కుజుడు యోగకారకుడు.

తక్కిన లగ్నములకు ఏగ్రహమూ యోగకారకులు కాజాలరు.

కేంద్రాధిపత్య దోషం అనగా ఏదైనా ఒక శుభగ్రహానికి(గురువు, శుక్రుడు, బుదుడు) రెండు కేంద్రాధిపత్యములు (4, 7 & 10) వచ్చినచో ఆ గ్రహానికి కేంద్రాధిపత్య దోషము వచ్చును. కేంద్రాధిపత్య దోషము వచ్చిన గ్రహం శుభ ఫలము యివ్వజాలదు. క్రింద తెలిపిన లగ్నములకు మాత్రం ఇది వర్తించును.

– ధనుర్లగ్నమునకు సప్తమ–దశమాధిపతియైన బుధునకు,

– మీనలగ్నమునకు చతుర్థ–సప్తమాధిపతియైన బుధునకు,

– మిథునలగ్నమునకు సప్తమ–దశమాధిపతియైన గురునకు,

– కన్యలగ్నమునకు చతుర్థ–సప్తమాధిపతియైన గురువుకు కేంద్రాధిపత్య దోషము వచ్చును. కేంద్రాధిపత్యముదోషము కలిగిన గ్రహము శుభఫలమిచ్చుటలో బలహీనమగునని గ్రహించాలి.

51. గురువుగారూ! మీయొక్క అమూల్యమైన సమాధానాలతో గ్రహాలు, నక్షత్రాలు, రాశులు, ఉచ్చ, నీచస్థానాలు, గ్రహాల లక్షణాలు, గ్రహ–భావ కారకత్వాలు, గ్రహాల దృష్టి, మొదలగు విషయాలగురించి తెలుసుకున్నాను. ఇప్పుడు మీనుండి జాతకాన్ని చూడగానే ముందుగా పరిశీలించవలసిన అంశాలను, పరిశీలనా పద్ధతిని తెలియగోరుచున్నాను.

శిష్యా! ఇప్పటివరకూ జాతక పరిశీలనకు ఉపయుక్తమగు అంశాలను శ్రద్దగా వర్గీకరించగలిగితే జాతకపరిశీలన సులభమగును. జాతక పరిశీలనకు ముందుగా తెలుసుకోదగిన అంశాలను మంఴయొకసారి తెలుసుకుందాం. జాతకమును చదువుటకు ముందుగా గ్రహాలు, రాశులు, నక్షత్రాలు, మరియు ఏరాశిలో ఏ నక్షత్రము, ఏపాదము వచ్చునో అన్న అంశాలు, గ్రహాల స్వక్షేత్రం, ఉచ్చ–నీచస్థానాలు, వక్రి అస్తంగత వివరాలు, గ్రహాల దృష్టి, గ్రహ–భావ కారకత్వాలు, గ్రహాలయొక్క బలాలు తెలియు అంశాలు నేర్చుకొని మనస్సులో పదిలపరచుకొనియుండవలెను.

ముందుగా ఒక ఉదాహరణ సహాయంతో జాతకాన్ని చదువుట తెలుసుకుందాం.

		లగ్నం గురు	చంద్ర
కేతువు శని			
కుజుడు			రాహువు
బుదుడుR	శుక్ర రవి		

జాతక పరిశీలన:–

పై ఉదాహరణ జాతకం ఆధారంగా క్రింది పట్టికనందు శ్రద్ధగా గ్రహాలను వర్గీకరణ చేయవలెను.

1. మొదటివరుసను అనుసరించి రెండవ వరుసలో (2) గ్రహములపేర్లు వ్రాయవలెను.
2. గ్రహాలు వున్న భావల సంఖ్యను (3) లో పట్టికలో చూపిన విదంగా వ్రాయవలెను
3. అధిపతులు కలసివున్న ఇతర గ్రహముల పేర్లను (4) లో వ్రాయవలెను.
4. అధిపతులపైగల ఇతర గ్రహ దృష్టులను (5) లో వ్రాయవలెను
5. అధిపతి ఉచ్చ, నీచ, స్వక్షేత్రం, వక్రి, అస్తంగతమైన (6) లో వ్రాయవలెను.

(1) భావము	(2) అధిపతి	(3) స్థానం	(4) సంయోగం	(5) దృష్టి	(6) బలము
లగ్నాధిపతి	శుక్రుడు	7	రవి (చతుర్ధాధిపతి)	గురువు	
ద్వితీయ	బుధుడు	8	–	చంద్రుడు	వక్రి
తృతీయ	చంద్రుడు	2	-	బుధుడు	
చతుర్థ	సూర్యుడు	7	శుక్రుడు (లగ్న, షష్టాధిపతి)	గురువు	
పంచమ	బుధుడు	8	-	చంద్రుడు	వక్రి
షష్ట	శుక్రుడు	7	రవి (చతుర్ధాధిపతి)	గురువు	
సప్తమ	కుజుడు	9	-	గురువు	ఉచ్చస్థానం
అష్టమ	గురు	1	-	శుక్ర, రవి	
నవమ	శని	10	-	రాహు	స్వక్షేత్రం
దశమ	శని	10	కేతువు	రాహు	స్వక్షేత్రం
ఏకాదశ	గురు	1	కేతువు	శుక్ర, రవి	
ద్వాదశ	కుజుడు	9	-	గురువు	ఉచ్చస్థానం

పట్టికనాధారంగా ఈ విధంగా చదవుట నేర్చుకొనవలెను.

1. లగ్నాధిపతి మరియు షష్టాధిపతియైన శుక్రుడు సప్తమ భావంలో చతుర్థభావాధిపతియైన రవితో కలసివున్నాడు. గురువు చూస్తున్నాడు.

2. ద్వితీయ మరియు పంచమభావాధిపతియైన బుధుడు అష్టమంలో వక్రియై వున్నాడు. చంద్రుడు చూస్తున్నాడు.

3. ఇలా అన్ని గ్రహాలకు వాక్యాల రూపంలో చదువుటకు రావలెను.

52. గురుగువారూ! మీరు భోదించినవిదంగా జాతకాన్ని ఏవిదంగా చదవాలో తెలుసుకున్నాను. మరి జాతకఫల విశ్లేషణ ఏవిధంగాచేయాలో తెలుపగలరు.

జాతకాన్ని చదవడం అభ్యాసంచేసిన తరువాత సామాన్య ఫలనిర్ధారణకు ఈ క్రింది సూత్రాలను పాటించాలి. జ్యోతిషశాస్త్రాన్ని అభ్యాసం చేయునపుడు జాతకాన్ని స్థూలంగా పరిశీలించవలెను. సూక్ష్మంగా ఫలనిర్ణయం చేయుట తగదు. జాతకంలో ఫలముతెలుసుకోవలసిన విషయానికి సంబందించిన గ్రహాన్ని, భావాన్నిమాత్రం పరిశీలనలోకి తీసుకోవాలి. మిగిలిన గ్రహాలు పరిశీలనకు అప్రస్తుతంగా భావించాలి.

సామాన్యమైన భావఫలం తెలుసుకోవడానికి క్రింద తెలుపబడిన మూడు బలాలను పరిశీలించవలెను

1. స్థాన బలం 2. కారక భలం 3. ఆధిపత్య బలం

1. స్థాన బలం:– స్థానబలం అనగా పరిశీలించవలసిన భావంలో వున్న గ్రహాలు మరియు ఆ భావంపై వున్న గ్రహాల దృష్టిని పరిశీలించడం. స్థాన బలాన్ని బట్టి ఆ భావం యొక్క స్వరూపం, వాతావరణాన్ని పరిశీలించవచ్చు (Environment).

– పరిశీలించవలసిన భావంలో సహజ శుభగ్రహాలు (గురువు, శుక్రుడు, బుదుడు) వున్నను, శుభ గ్రహాల దృష్టి పడినను స్థానబలం"శుభప్రదం అవుతుంది.

– పరిశీలించవలసిన భావంలో పాప గ్రహాలు (శని, రవి, కుజుడు, రాహువు, కేతువు) వున్నను, పాప గ్రహాల దృష్టి వడినను స్థానబలం అశుభప్రదం అవుతుంది.

2. కారకుడి బలం:– జాతకం ద్వారా పరిశీలించవలసిన విషయాలకు సహజ కారకులైన గ్రహాలయొక్క బలాన్ని తెలుసుకోవడం. కారకబలం అనునది పరిశీలించు విషయముయొక్క సంస్కారాన్ని, అంతరస్థితిని (Internal Qualities or skill) తెలుపుతుంది.

పరిశీలించవలసిన విషయం		**కారకుడు**
జాతకుడి స్వభావం	–	సూర్యుడు
జాతకుడి మనస్సు	–	చంద్రుడు
జాతకుడి బుద్ధి, విద్య	–	బుదుడు
జాతకుడి వుద్యోగం	–	రవి/శని
జాతకుడి వివాహం	–	శుక్రుడు
జాతకుడి సంతానం	–	గురువు
జాతకుడి కుటుంబం, ప్రశాంత జీవనం	–	గురువు
జాతకుడిధైర్యం, కోపం	–	కుజుడు
జాతకుడి విదేశీయానం	–	రాహువు
జాతకుడి వైరాగ్యం, మోక్షం	–	శని, కేతువు

3. ఆధిపత్య బలం:– ఆధిపత్య బలమనగా పరిశీలించవలసిన భావాదిపతి యొక్క బలాన్ని తెలుసుకోవడం (స్థితి, సంయోగం, దృష్టి). ఆధిపత్య బలాన్ని బట్టి భావం యొక్క శుభ–అశుభ ఫలాన్ని తెలుసుకోవచ్చు. ఇచ్చట భావాధిపతితో పరిశీలించు విషయానికి సంబంధించిన పూర్వ శుభాశుభ కర్మలను తెలుపుతాడు. పై మూడు సూత్రాల ద్వారా జాతకాన్ని పరిశీలించి బలాబలాలను తెలుసుకొని ఫలనిర్ణయం చేయవలెను. జాతకంలో ఏ భావాన్నైనా పరిశీలించడానికి ముందు జాతకుని లగ్న బలాన్ని తెలుసుకోవాలి. లగ్న బలాన్ని బట్టి జాతకుని మిగిలిన విషయాలు ఆధారపడి వుంటుంది.

ఇప్పుడు లగ్న పరిశీలనచేయు విధానం తెలుసుకుందాం. లగ్న భావం ద్వారా జాతకుడి పుణ్యం, శరీరలక్షణం, వర్ణం, మనోబలం, బుద్ధిబలం, కర్మస్వాతంత్రం మొదలగు విషయాలు తెలియదగినవి. లగ్న భావం బలంగా వున్నచో జాతకుడు అదృష్టవంతుడగును. లగ్నం శుభప్రదమైన జాతకుడు అదృష్టవంతుడు, ఆరోగ్యవంతుడు, ఆత్మవిశ్వాసం కలవాడు, సుఖసంతోషాలు కలవాడు, కీర్తి ప్రతిష్ఠలు పొందువాడు, అన్ని అనుకూలములుకలవాడగును.

పరిశీలించవలసిన అంశాలు:-

1. లగ్నస్థానబలం పరిశీలించునపుడు లగ్నరాశియందుగల గ్రహాలు మరియు లగ్నం పై ఇతర గ్రహాలదృష్టిని అధ్యయనం చేయాలి. లగ్నంలో శుభగ్రహాలున్నచో లేక శుభగ్రహాల దృష్టిపడినచో జాతకుడు మంచి అనుకూలమైన వాతావరణంలో జన్మించినాడని తెలియవలెను. దీనికి విపరీతంగా పాప గ్రహాలు లగ్నరాశిలో వుండడం లేక పాపగ్రహాల దృష్టియున్నచో ఏవిదమైన అనుకూలములేని వాతవరణంలో జన్మించాడని, పరిస్తితులు అనుకూలముగా ఉండబోదని తెలియవలెను. ఒకవేళ శుభ, పాప రెండు గ్రహముల సంబంధములేర్పడిన మిశ్రమఫలమని, శుభ-పాపగ్రహములలో దేనికి ఎక్కువ బలముకలదో వాటిప్రభావము అధికమని తెలియవలెను.

2. లగ్నకారకుడిబలం జాతకుడి సంస్కారాన్ని తెలుపుతుంది. జాతకుడి స్వభావం, మనస్సు, బుద్ధిబలం మొదలగు అంశాలు తెలియజేస్తుంది. పూర్వ సంస్కారం పై కారకబలం ఆధారపడియుంటుంది. ప్రతిజన్మలోనూ మనస్సు, బుద్ధి, జ్ఞానాలలో జాతకుడి సాధనాన్నిబట్టి మార్పు చెందుతు ఉంటుంది. మంచి కర్మలు ఎక్కువ చేయుట ద్వారా శుభసంస్కారాన్ని (నైపుణ్యతను), పాపకార్యాలు అధికముగా చేసిన పాపసంస్కారమధికమవుతుంది. శుభసంస్కారాల ద్వారా మనస్సు, బుద్ధియొక్క పనితనంలో ఎక్కువ నైపుణ్యతను జాతకుడు కలిగియుంటాడు. అంటే మనస్సు, మరియు బుద్ధి మంచి మార్గంలో నడచుకొనుటలో ఎక్కువ నైపుణ్యతను ప్రదర్శించగలదని అర్థం. పాపసంస్కారాల ద్వారా మనస్సు, బుద్ధియొక్క పనితనం చెడువిషయాలు ఆచరించుటలో ఎక్కువ నైపుణ్యతను జాతకుడు కలిగియుంటాడు. కావున జాతకుడి

మనస్సు, బుద్ధి మంచిపనులు/చెడుపనులు చేయుటకు మక్కువచూపగలదో కారకుడిబలం ద్వారా తెలియవచ్చు.

- సూర్యుడిని పరిశీలించుట ద్వారా జాతకుడి స్వభావం
- చంద్రుడి ద్వారా మనస్సు
- బుదుడి ద్వారా బుద్ధి
- గురువు ద్వారా జ్ఞానం, శుభ సంస్కారం
- కుజుడి ద్వారా ధైర్యం, కోపం, అహంకారం మొదలగు అంశాలను పరిశీలించవచ్చు.

3. **లగ్నాధిపతియొక్క బలం** తెలుసుకొనడంలో భాగంగా లగ్నాధిపతియున్న భావం, లగ్నాధిపతితో కలసివున్న గ్రహం, లగ్నాధిపతిపై గల గృష్టి ఈ అంశాలను అధ్యయనం చేయాలి. భావాధిపతి పూర్వజన్మలో తానొనర్చిన శుభాశుభకర్మల గురించి తెలియజేస్తాడు. లగ్నాధిపతి బలంగా వున్నయెడల ఆరోగ్యం, ఐశ్వర్యం, అదృష్టం మొదలగునవి ప్రాప్తిస్తాయి.

– లగ్న భావానికి కోణ సంబంధము కలిగిన(5,9) మంచి సంస్కారం, దైవ భక్తి, ఆధ్యాత్మిక దోరణి కలవాడు అగును.
– లగ్న భావానికి కేంద్ర సంబందము కలిగిన (4, 7, 10) మంచి నేర్పరి, చాకచక్యం, లౌకిక సుఖము కలవాడు, ధనవంతుడు, కోరికలు నెరవేర్చుకొనుటకు ప్రయత్నించువాడు అగును
– లగ్న భావానికి 6,8,12 భావాల సంబంధము కలిగినను రోగగ్రస్తుడు, సంస్కారములేని వాడు, సంతోషములేనివాడు అగును.

లగ్నభావ పరిశీలనను ఈ క్రిందితెలిపిన జాతకచక్రం ఆధారంగా పరిశీలిద్దాం

		లగ్నం గురు	చంద్ర
కేతువు శని			
కుజుడు			రాహువు
బుధుడుR	శుక్ర రవి		

1. స్థాన బలం:– స్థాన బలాన్ని పరిశీలించినట్లైతే లగ్నస్థానంలో శుభ గ్రహమైన గురువు వున్నాడు మరియు రెండు శుభ గ్రహాల (బుదుడు, శుక్రుడు) దృష్టి లగ్నంపై వున్నందువలన లగ్నస్థానానికి సంపూర్ణ బలం చేకూరింది. లగ్న స్థానాన్ని బట్టి జాతకుడు మంచి వాతావరణంలో, మంచి స్థలంలో జన్మించి వుండవచ్చు.

2. కారకుడి బలం:–

– పై జాతకంలో స్వభావానికి కారకుడైన సూర్యుడు రెండు శుభ గ్రహాలతో కలసి మిత్ర క్షేత్రంలో వున్నాడు మరియు శుభ గ్రహమైన గురుదృష్టి కలిగి వున్నది. కావున మంచి స్వభావము, సంస్కారము కలవాడని తెలియుచున్నది.

– మనోకారకుడైన చంద్రుడు మిత్రక్షేత్రమైన మిథునంలో వున్నాడు. కావున మంచి సహకార స్వభావం కలిగిన మనస్సుతో వుంటాడు.

– బుద్ది కారకుడైన బుదుడు శుభ గ్రహాలైన శుక్ర, గురువుల సంబంధం కలిగివున్నందున మంచి బుద్ధి, తెలివితేటలు కలిగివుంటాయి.

3. ఆధిపత్య బలం:–

లగ్నాధిపతియైన శుక్రుడు కేంద్రస్థానంలో వుండి శుభ గ్రహాల దృష్టి వలను అతను మంచి ఆరోగ్యాన్ని కలిగి, మంచి సంస్కారం, కీర్తి ప్రతిష్ఠలు వున్నవాడై ఆనందమైన జీవితాన్ని అనుభవించాడు అని తెలుసుతున్నది. మరియొక ఉదాహరణ జాతకాన్ని పరిశీలిద్దాం

పేద చక్షుః

కుజ			కేతువు
రాహువు			లగ్నం గురు శని
	బుద	రవి	శుక్ర చంద్ర

1. స్థాన బలం:– లగ్న స్థానంలో గురువు మరియు శని వున్నందున లగ్నానికి సగం బలం యేర్పడింది. లగ్నాన్ని పాప గ్రహమైన కుజ దృష్టి వలన లగ్న స్థానం బలహీనపడింది. కావున ఈ జాతకుడు మంచి వాతావరణంలో జన్మించలేదు. శత్రు వాతావరణంలో జీవించడం జరిగింది.

2. కారకుడి బలం:– కారకబల పరిశీలన ద్వారా వ్యక్తియొక్క స్వభావం, మనస్సు, బుద్ధి, జ్ఞానం మొ॥ వ్యక్తిగత అంతర లక్షణాలను తెలుసుకోవచ్చు.

– పై జాతకంలో స్వభావానికి కారకుడైన రవి నీచయందుండుటవలన జాతకుడి స్వభావం బలహీనపడింది. మంచి స్వభావములేదని చెప్పవచ్చు.

– మనోకారకుడైన చంద్రుడు నీచ శుక్రుడితో కలసి వున్నాడు, పాప గ్రహమైన కుజ దృష్టి కూడా వున్నందున మంచి మనస్సుకూడా లేదని చెప్పవచ్చు.

– బుద్ధి కారకుడైన బుదుడు శత్రు క్షేత్రంలో వున్నందున బుద్ధి పనిచేసినా జాతకుడికి సహకరించ లేదని చెప్పవచ్చు.

3. ఆధిపత్య బలం:– లగ్నాధిపతియైన రవి నీచయందున్నందున, రవిపై శుభ దృష్టి లేకపోవడంవలన జాతకుడు ధనహీనుడై, అనారోగ్యం కలిగి అల్పాయుష్కుడు అయినాడు.

53. గురువుగారు! వివాహం గురించి మరియు పరిశీలించవలసిన అంశాల గురించి తెలియజేయగలరు?

ధర్మార్థకామమోక్షాలను నాలుగు పురుషార్థాలలో ఒకటైన కామాన్ని ధర్మ బద్ధం చేసి సంతానం, వంశాభివృద్ధిని చేయటానికి పెద్దలు, ఋషులు ఎంచుకున్న ఏకైక మార్గం వివాహం. వివాహ ప్రక్రియతో స్త్రీ పురుషుల కర్తవ్యనిర్వహణా మార్గం సుగమం చేయబడింది. వివాహానంతరం స్త్రీ పురుషులకు అనేక సంప్రదాయక విధులు నిర్వహించే అర్హత కలుగుతుంది. ఉదాహరణగా బాలసారె నుండి వివాహం వరకు ఉన్నా అనేక సుసంస్కారములు జరిపించటానికి హిందూ ధర్మశాస్త్రం ప్రకారము వివాహం జరగని వారుకాని, వివాహానంతరం అనేక కారణాలవలన ఒంటరిగా మిగిలిన స్త్రీ, పురుషులయిననూ ఈ సంప్రదాయక కార్యక్రమములు నిర్వహించటకు అనర్హులు. దంపతులైన స్త్రీ పురుషులు మాత్రమే సంప్రదాయక విధి నిర్వహణకు అర్హులౌతారు. కనుక హిందూ సంప్రదాయంలో వివాహానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. తీర్థయాత్రల సమయంలో చెప్పే సంకల్పం, దేవతామూర్తుల కళ్యాణం, సత్యనారాయణ వ్రతం, హోమం, యజ్ఞం, యాగం లాంటివి నిర్వహించటానికి గృహస్థుడు ధర్మపత్ని సమేతంగా జరపాలని నియమం ఉన్నది. వివిధ కులాలను బట్టి, ప్రాంతాలను బట్టి కొద్ది తేడాలున్నప్పటికీ, స్థూలంగా భారతదేశంలో జరిగే హిందూ వివాహాలన్నీ ఒక పద్ధతిలోనే ఉంటాయి. జీవితంలో మరపురానిది వివాహం. ఇది స్త్రీ పురుషులకు జీవన మైత్రి నిచ్చునది. శారీరక మానసిక స్థితిగతులలో విడదీయరానిది. వివాహము సర్వమతాల వారికి, వారి వారి సంప్రదాయాలను అనుసరించి ఆమోదయోగ్యమైనది. గృహస్థాశ్రమనిర్వహణ, ధర్మరక్షణ, వంశాభివృద్ధి కోసం వివాహం తప్పనిసరిగా అవసరం అవుతుంది.

హిందూసాంప్రదాయంలో స్త్రీ పురుషులు దంపతులనిపించుకొనుటకు జరగవలసిన సంస్కారం వివాహం. షోడశసంస్కారాలలో వివాహం చివరిది. హిందూమతంలో వివాహం కేవలం దైహికావసరాలకోసం కాదు. సత్సంతాన సౌభాగ్యం కొరకే వివాహమని స్మృతులు తెలుపుతున్నాయి.

బ్రాహ్మోద్దైవస్తథైవార్షః ప్రాజాపత్యస్తథాసురః ।
గాంధర్వోరాక్షసశ్చైవ పైశాచశ్చాష్టమోమతః ॥

– అను యాజ్ఞవల్క్య స్మృతిని అనుసరించి పూర్వీకుల ఎనిమిది విధములైనటువంటు వివాహాలను వివరించారు.

1. బ్రాహ్మం	2. దైవం	3. ఆర్షం	4. ప్రాజాపత్యం
5. అసురం	6. గాంధర్వం	7. రాక్షసం	8. పైశాచం

1. బ్రాహ్మం:– ఏలోపములేని అలంకరించిన, సుందరియైన, అరోగ్యవంతురాలైన మంచికులములో పుట్టిన కన్యను పండితుడు, శీలవంతుడు, ఆరోగ్యవంతుడు, సుందరడు,మంచికులోత్పున్నుడైన వరుని ఆహ్వానించి కన్యాదానం చేస్తే బ్రాహ్మ వివాహమౌతుంది. (ఉదా: శాంతా ఋష్యశృంగుల వివాహం)

2. దైవం:– యజ్ఞంలో ఋత్విక్కుగా వున్న వారికి – దక్షిణగా కన్యను ఇచ్చి వివాహం చేస్తే అది దైవ వివాహమౌతుంది.

3. ఆర్షం:– వరుని నుండి గోవుల జంటను తీసుకొని కన్యను ఇవ్వటం ఆర్ష వివాహం. ఇది ఋషులలో ఎక్కువగా వుండేది గనుక ఆర్షం అయింది.

4. ప్రాజాపత్యం:– వధూవరులిద్దరు కలిసి ధర్మాన్ని ఆచరించండి అని చెప్పి కన్యాదానం చేయటం ప్రాజాపత్యం అవుతుంది. (సీతారాముల వివాహం)

5. అసురం:– వరుని వద్ద డబ్బు తీసుకుని కన్యను యిస్తే అది అసుర వివాహం. (ఉదా: కైకేయీ దశరథుల వివాహం)

6. గాంధర్వం:– పరస్పరం అనురాగంతో (మంత్ర విధానం లేకుండా) చేసుకునేది గాంధర్వ వివాహం. (ఉదా: శకుంతలా దుష్యంతులు)

7. రాక్షసం:– యుద్ధం చేసి, కన్యను అపహరించి, ఎక్కడికో తీసుకువెళ్ళి చేసుకొనే వివాహం రాక్షసం

అంటారు. (ఉదా: మండోదరి రావణులు)

8. పైశాచం:- కన్యను నిద్రావస్థలో అపహరించి చేసుకున్నది పైశాచం.

పై వివాహాలలో బ్రాహ్మం శ్రేష్ఠం, ప్రాజాపత్యం ధర్మబద్ధం, రాక్షసం, పైశాచం నిషిద్ధం అని గ్రహించాలి. ఇచ్చట వివాహమెందుకు చేసుకోవాలన్న ప్రశ్న చాలామందిలో ఉదయిస్తుంది. ఈ ప్రశ్న చాలా ముఖ్యమైనది. దీనికి సమాధానం ప్రతివారూ తెలుసుకోవాలి. ప్రతీ మనిషీ మూడు ఋణాలతో పుడతాడు. అవి

1. ఋషిఋణం 2. దేవఋణం 3. పితృౠణం.

ఈ ఋణాలను తీర్చడం ప్రతి వ్యక్తి యొక్క విధి. ఈ ఋణాలు తీర్చకపోతే మరల జన్మ ఎత్తవలసి వస్తుంది. మానవజన్మకు సార్థకత జన్మరాహిత్యం. కావున ప్రతివాడు ఋణ విముక్తుడు కావాలి. దానికి ఏంటి మార్గం? మన పెద్దలు చెప్పారు

"బ్రహ్మచర్యేణ ఋషిభ్యః" యజ్ఞేన దేవేభ్యః "ప్రజయా పితృభ్యః"

1. ఋషి ఋణం:- బ్రహ్మచర్యం ద్వారా ఋషి ఋణం తీర్చాలి. అంటే బ్రహ్మచర్యంలో చేయవలసిన వేదాధ్యయనం చేయాలి. అలాగే పురాణాలు మొదలైన వాఙ్మయాన్ని అధ్యయనం చేసి తరువాత తరం వారికి వాటిని అందించడం ద్వారా ఈ ఋణాన్ని తీర్చుకోవాలి.

2. దేవఋణం:- యజ్ఞ యాగాది క్రతువులు చేయడం, చేయించడం ద్వారా ఈ ఋణాన్ని తీర్చుకోవాలి. యజ్ఞం అంటే భక్తితో చేసేపూజ. యజ్ఞాలవల్ల దేవతలు తృప్తి చెందుతారు. సకాలంలో వర్షాలు కురుస్తాయి. పాడిపంటలు వృద్ధి చెందుతాయి. కరువు కాటకాలు తొలగిపోతాయి. నీరు, గాలి, వెలుతురు, ఆహారాన్ని ప్రసాదిస్తున్న వారందరికి మనమెంతో ఋణపడివున్నాం. కనుక ఆ ఋణాన్ని తీర్చకపోతే మనం కృతఘ్నులం అవుతాం.

3. పితృౠణం:- సత్సంతానాన్ని కనడం ద్వారా ఈ ఋణాన్ని తీర్చుకోవాలి. తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు, మనకు జన్మనిచ్చి పెంచి పోషించినవారు. వంశాన్ని అవిచ్ఛిన్నంగా కొనసాగించడం ద్వారా, పితృ

దేవతలకు తర్పణాది క్రియలు నిర్వహించే యోగ్యులైన సంతానాన్ని కనడం ద్వారా పితౄణం తీర్చుకోవాలి. సంతానం కనాలంటే వివాహం చేసుకోవాలి గదా! **ప్రజాతంతుం మావ్యవత్సేత్సీః।** అంటుంది వేదం. అంటే వంశపరంపరను త్రెంచవద్దు. వేదాధ్యయనం, యజ్ఞం చేయడం, సంతానము కనడం ఇవి మానవుడు తప్పని సరిగా చేయవలసిన విధులుగా వేదం చెపుతున్నది.

ఈనాడు వివాహవిషయాలను జాతకము ద్వారా ఏవిదంగా పరిశీలించాలో తెలుసుకుందాం. జాతకుడి వివాహం (భర్త/భార్య), భాగస్వామి, కామం, వ్యభిచారం మొదలగు విషయాలను కళత్రభావము ద్వారా తెలియవలెను. కళత్ర భావం బలంగా వున్నచో మంచి భర్త/భార్య, మంచి వైవాహిక జీవనం కలవాడు అగును. గతజన్మలలో వివాహానంతరము గృహస్థాశ్రమ ధర్మాన్ని చక్కగా అనుష్టించి సంతానం, ధర్మరక్షణ, వంశాభివృద్ధి మొదలగు కర్మలు శ్రద్ధతో ఆచరించినవారికి కళత్రభావం బలపడుతుంది, శుభప్రదమవుతుంది. కళత్రభావం శుభప్రదమైన మంచి భార్య లేక భర్త, సత్సంతానము, గృహస్థాశ్రమమును చక్కగా నిర్వర్తించుటకు తగిన వాతావరణపరిస్థితులు నెలకొంటాయి. దీనికి విపరీతంగా భార్యను/భర్తను హింసించడం, గృహస్థాశ్రమ ధర్మాన్ని ఉల్లంఘించడం, పరస్త్రీ వ్యామోహం, సంగమం చేసినవాడికి కళత్రభావం బలహీనమై అశుభప్రదమగును. దీని ఫలితంగా వివాహము ఆలస్యమగుట, కలహాలు, అశాంతి, సంతానం లేకుండుట మొదలగు విపరీతాలకు గురియగును.

54. గురువుగారూ! అవైదీకమైన వివాహాలు అనగా ప్రేమ వివాహాలకు గల సామాన్య కారణములను గురించి వివరించగలరు.

ఆధునిక జీవనవిధానంలో వైధీక సాంప్రదాయాలు కేవలం నామమాత్రంగానే ఆచరించబడుతున్నాయి. మన ధర్మం సనాతనము, సార్వదేశికము, సార్వకాలికము, సార్వజనీనకము, మహిమాన్వితము, సర్వోత్తమము, ఆచరణలో నిగ్గు తేలినది. ఈనాటికీ మనదేశం సంస్కృతి, ధర్మం, ఆధ్యాత్మికత, నీతి మొదలగు విషయాలలో ప్రపంచానికి గురు స్థానం లోనే ఉన్నది. శాంతి, సౌభ్రాతృత్వముల కొరకు ప్రపంచదేశాలు భారతదేశం వైపు చూస్తున్నది. విజ్ఞానంలో కూడా మన దేశం గొప్పదే. అనేక

మంది విదేశీయులు మన ప్రాచీన విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందారు.

కానీ నేటి మన స్థితిని పరిశీలిస్తే పరాయి పాలనలో మన జాతి ఆత్మవిస్మృతి చెందినది. తన గొప్పతనాన్ని, తన వారసత్వాన్ని మరచి పోయింది. పరాయి వాళ్లు రాసిన రాతలను నమ్మి తన అస్థిత్వాన్నే కోల్పోవు చున్నది. మన ఆచారాలు మూఢాచారాలని, మనవి గుడ్డి నమ్మకాలనీ, మనము అనాగరికులమనీ విదేశీయులు మనకు అన్నీ నేర్పారని పాఠ్య పుస్తకాలలో రాసి మన పిల్లల చేత చదివించుచున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా మనలో చైతన్యం కనిపించుట లేదు. విదేశీయులు మన ఆచారాలను అధ్యయనం చేసి వాటి లోని గొప్పదనాన్ని వారు మనకు చెపితే గాని నమ్మలేని స్థితిలో మనం ఇప్పుడు ఉన్నాం. పాశ్చాత్యులు చెప్పినదే మనకు వేదంగా మారింది.

మన కుటుంబాలలో వివాహాలు ఆడంబరంగా చేస్తున్నాం. విరివిగా డబ్బు ఖర్చు పెడుతున్నాం. తరచుగా అప్పుల పాలవుతున్నాం. అధికమైన కట్నాలు, మర్యాదలు, లాంఛనాలు కావాలంటున్నాం. వాటి కొరకు అలకలు, తగాదాలు, వేధింపులు చూస్తున్నాం. ఎందుకీ మంత్రాలు? ఏమిటి వీటి అర్థాలు? అని తెలుసు కుందామనే కోరిక ఎక్కడా కనిపించదు. వాటిపై ఆసక్తి, ప్రయత్నం, కృషి జరుగుటలేదు. వివాహ మహోత్సవ ఆహ్వానం అని అందరికీ పంపుతాం. కానీ వివాహమనేది ఉత్సవం కాదు. అది మానవుని వికాసానికి ఏర్పరచిన షోడశ సంస్కారాలలో ప్రధానమైనదని చాలామందికి తెలియదు. సాన పెట్టుట వలన వజ్రం ప్రకాశించునట్లు సంస్కారాల వల్ల ఆత్మ ప్రకాశిస్తుంది. జీవితం సార్థకం, సుఖవంతం, ఆనందమయం అవుతుంది. వివాహం లోని మంత్రాల అర్థం పరమార్థం తెలియక, ఏదో విధంగా త్వరగా పూర్తి చేయండని పురోహితుని తొందర పెడుతూ ఉంటారు ఇప్పటి పెళ్ళిపెద్దలు. దాని వల్ల నష్టపోయేది నూతన దంపతిలేనని గ్రహించరు. ఫోటోలు, వీడియోలు, విందులకు ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమైన సంస్కారాన్ని విడిచిపెడుతున్నారు. వివాహానంతరం కుటుంబంలో సమస్యలను, చికాకుకలి, ఫలితం బాగా లేదని బాధపడతారు.

ఈనాటి కాలంలో ప్రేమవివాహాలు మెండుగా కనిపిస్తాయి. ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తే మనహిందూ వివాహవ్యవస్త ప్రాజాపత్యం నుండి అసుర, గాంధర్వ వివాహవ్యవస్తలకు దిగజారింది. తల్లిదండ్రులు నిర్ణయించిన వివాహసంబందమును చేసుకొనిడివారు అరుదు. గృహస్తాశ్రమధర్మం, సదాచారం అన్నపదాలే ప్రస్తుత వివాహవ్యవస్థలో కనిపించదు. ఇక వధూవరుల విషయానికొస్తే అందం, ఆస్తి, ఐశ్వర్యం, విద్య, హోదా మొదలగు విషయాలే ప్రధానంగా తామే స్వయంగా సంబంధాలను చూసుకొనటం, వెళ్ళాడటం జరుగుతోంది. పైకి మాత్రం తల్లిదండ్రులు చేసిన వివాహమని గొప్పలు చెప్పుకుంటున్నారు. నామ మాత్రంగా జ్యోతిష్కునకు, వివాహ ముహూర్తమునకు, మంత్రాలకు, వాద్యాలకు ప్రాధాన్యతనిస్తున్నాడు. వస్త్రాలంకరణ, ఆభరణాలు, బందువులు, స్నేహితులు, ఫోటోలు, వీడియోలు, విందులు, వినోదాలకు అతిగా ప్రాధాన్యతను కల్పిస్తున్నారు. ఆచార, సంస్కారములులేని వివాహాలు ఎక్కువకాలం వర్ధిల్లవు. తల్లిదండ్రుల హితాన్ని కాదని గాంధర్వ వివాహాలకు (ప్రేమవివాహాలకు) మొగ్గుచూపుతున్నందునే విడాకులచట్టం ఈకాలంలో ఎక్కువ ప్రధానపాత్రను పోషిస్తోంది.
ఇచ్చటప్రేమ వివాహాల గురించి కొన్ని సామాన్య జాతకపరిశీలనా సూత్రాలను తెలుసుకుందాం

– సప్తమ భావానికి రాహు సంబందం కలిగినా, సప్తమానికి పాప గ్రహ సంబందం యేర్పడిన ప్రేమ వివాహములు దారితీయును.

– లగ్నాధిపతి మరియు ద్వితీయాదిపతి కలసి శుభగ్రహాలచే చూడబడుతున్న ప్రేమ వివాహాలకు దారితీయును.

– సప్తమాధిపతి పంచమ, నవమాధిపతుల సంబందము కలిగి షుభగ్రహాలచే చూడబడూన ప్రేవవివాహములకు దారితీయును, పాపగ్రహములతో సంబందమేర్పడినా ప్రేమఫలించదు, వివాహమునకు దారితీయదు.

– సప్తమ భావము పరిశీలించునపుడు, జాతకుడి పూర్వజన్మ పుణ్యాము (1, 5 9 భావములు), నవమ అంశ, కళత్ర దోషములు (కుజ దోషము, సర్ప దోషము, మాంగల్యా దోషము) మొదలగు అంశాలను పరిశీలించవలెను.

అన్యోన్యదాంపత్యమునకు, సత్సంతానముకొరకు వివాహానికి ముందు జాతకుల మైత్రి మరియు నక్షత్ర కూటములను పరిశీలించవలెను. నక్షత్రకూటములయొక్క ఫలమును తెలుసుకొనుట, ముహూర్తము, *సంతానము, ఆరోగ్యము మొదలగు అంశములు వేదచక్షువు యొక్క రెండవభాగములో చూడగలరు.*

55. గురువుగారూ! కుజదోషము గురించి, దాని ప్రభావము గురించి భోదించగలరు.

కుమారుడుగాని, కుమార్తెగాని యుక్తవయసునకు చేరుకోగానే వారి వివాహవిషయాలను, దోషాలను తెలుసుకోవాలనే కుతూహలం ఈనాటిజనులలో చాలా కనిపిస్తుంది. వివాహ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నట్లైతే లేక వివాహమైన తదుపరి సమస్యలు తలెత్తుతున్నా వెంటనే గుర్తుకువచ్చేది కుజదోషం గురించి. "కుజదోషం వున్నవారు కుజదోషం వున్న వారినే వాహమాడాలన్న" అభిప్రాయం ప్రస్తుత దైవజ్ఞజనుల అభిప్రాయం. జాతకం సహాయంతో ఈ కుజదోషం ఉన్నవారిని గుర్తించడం తెలుసుకోవాలి. కొన్ని సందర్భాలలో ఉన్నకుజదోషాన్ని లేనట్లుగానూ, జాతకంలో కనిపించని కుజదోషం ఉన్నట్లుగాను తేల్చిచెప్పే జ్యోతిష్కులు లేకపోలేదు. ఏ చిన్నపాటి సమస్యకైనా, ఓ జ్యోతిష్కుడిని దంపతులు గానీ, దంపతుల తల్లితండ్రులు గానీ విచారించగానే, ముందుగా ఆ జ్యోతిష్కుడు వారికి సెలవిచ్చేది కుజదోషం వుందని లేక కాలసర్పదోషముందని, ఈ కుజదోషం వలన భార్య భర్తలలో ఒకరికి మరణం త్వరలో వుందని, భయభ్రాంతులయ్యే సంభాషణలతో జ్యోతిష్కుడు చెప్పడం చాలా సంధర్భాలలో కనిపిస్తూ వుంటుంది. కావున ప్రతిఒక్కరూ కుజదోషం గురించిన సంపూర్ణ పరిజ్ఞానాన్ని పొందగలిగితే కుజదోషవిషయంలో భయపడాల్సిన అవసరము వుండదు.

జాతకచక్రములో మేష, వృశ్చిక రాశులకు అధిపతి కుజుడు, అగ్నితేజో సంపన్నుడు. జాతక చక్రములో జన్మ లగ్నమునుండిగాని, చంద్రలగ్నమునుండిగాని (చంద్రుడున్నరాశినుండి), శుక్రలగ్నమునుండిగాని(శుక్రుడున్నరాశి నుండి) 2, 4, 7, 8, 12 స్థానాలలో కుజుడు వుంటే కుజదోషం వుందని భావం. 2 వ స్థానంలో కుజుడు వుంటే... కుటుంబ ధన సంపత్తునకు , 4 వ స్థానంలో కుజుడు వుంటే స్థిరాస్థులకు, 7 వ స్థానంలో కుజుడు వుంటే కళత్రసుఖము, భోగభాగ్యములకు, భార్యాభర్తల

మధ్య భేదాభిప్రాయములకు; 8 వ స్థానంలో కుజుడుంటే ఆయుర్భాగ్యమునకు, పూర్ణ ఆయుర్దాయమునకు , 12 వ స్థానంలో కుజుడు వుంటే మితములేని రతిరసుఖము, ఆరోగ్యమునకు ఆటంకము కలుగునని విశ్వసించాలి. కుజుడు ఆయా స్థానాలలో వుండిన పురుషునికి భార్య వలన ఆటంకము, భార్యకు భర్త వలన ఆటంకమేర్పడునని గ్రహించాలి.

ఈ ఆటంకాలు ఎప్పుడు కలుగుతాయి? వివాహానంతరమా? లేక కొన్ని సంవత్సరాలు దాంపత్యం జరిగిన తదుపరా? ఈ ప్రశ్నలకు జాతకుడి దశలను పరిశీలించాలి. కుజ మహాదశ నడుస్తున్న సమయంలోనే కుజదోషముయొక్క ప్రభావముంటుంది. జాతకంలోని గ్రహస్థితి ఆధారంగా కొన్ని సంధర్భాలలో కుజదోషముయొక్క ప్రభావము జాతకుడిపై వుండదు. వాటి గురించి తెలుసుకుందాం.

– గురువు, శని, బుధుడు, సూర్యుడు ఈ గ్రహములలో ఏదైనా ఒక గ్రహంతో కుజుడు కలసివున్ననూ లేక వారి దృష్టి కుజుడిపై పడిననూ కుజదోష ప్రభావముండదు.
– కుజుడు ఉచ్చస్థానంలోగాని, నీచస్థానంలోగాని, స్వక్షేత్రములో వున్ననూ లేక ఆ స్థానాలు లగ్నములైననూ (మకర, కర్క, మేష, వృశ్చికం) కుజదోష ప్రభావముండదు
– కుజుడియొక్క లగ్నాలలో జన్మించిన కుజదోష ప్రభావముండదు
– కుజగ్రహానికి మిత్రులైన రవి గురుల రాశులైన సింహ, ధనుస్సు, మీన రాశులలో గానీ, వారి లగ్నములలో జన్మించిననూ కుజదోష ప్రభావముండదు.
– పైపేర్కొన్న అన్ని అంశాలను పరిశీలిస్తే మేష, వృశ్చిక, కర్కాటక, సింహ, ధనుస్సు, మకర, మీన రాశులలో గానీ, లగ్నాలలో జన్మించిన వారికి కుజదోష ప్రభావముండదని గ్రహించాలి.
– మిథునము లేక కన్య లగ్నమై రెండవ స్థానంలో కుజుడున్ననూ దోష ప్రభావముండదు
– మేషం లేక వృశ్చిక లగ్నమై కుజుడు నాల్గవస్థానమున వున్నయెడల దోష ప్రభావముండదు
– మకర లేక కర్కాటకము లగ్నమమై కుజుడు సప్తమస్థానమునందు వున్నయెడల దోష ప్రభావముండదు
– ధనుస్సు లేక మీనము లగ్నమై కుజుడు అష్టమస్థానమందున్నయెడల దోష ప్రభావముండదు

– అశ్విని, మృగశిర, పునర్వసు, పుష్యమి, ఆశ్లేష, ఉత్తర, స్వాతి, అనూరాధ, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ, శ్రవణం, ఉత్తరాభాద్ర, రేవతి అను పదమూడు నక్షత్రములలో జన్మించిన వారికి కుజుడు ఏ స్థానంలో ఉన్ననూ కుజదోష ప్రభావముండదని శాస్త్రాలు చెబుతున్నాయి.

జ్యోతిషశాస్త్రప్రకారం కుజుడు విజ్ఞాన కారకుడు, అహంకారం, కోపం, ధైర్యం, శక్తి, కలహప్రియుడు, కుతంత్రాలు మొదలగు అంశాలకు కారకత్వం వహిస్తాడు. సుఖమయమగు వైవాహిక జీవితమునకు పై కుజుడి లక్షణములు సహకరించలేవు. కుజుడు విశేషంగా ఆధునిక విజ్ఞానమునకు కారకుడగుతచే సాంకేతికవిద్యలందు అమితమైన ఆసక్తిని కలుగజేస్తాడు. ఉన్నతమైన సాంకేతిక విద్యనభ్యసించిన యువతీయువకులలో పై లక్షణములు ఎక్కువగా కనిపిస్తాయి. కోపం, అహంకారం ద్వారా విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతారు. వివాహానంతరం అనేక సమస్యలకు లోనవుతారు. జాతకములో గురువు బలహీనపడితే సదాచారము, సంస్కారము, సంయమనము మొదలగు గుణాలు లోపించి కోపం, అహంకారం అన్న విపరీతలక్షణాలకు గురియై వైవాహికజీవితంలో అశాంతికిలోనవుతూ కాలం గడుపుతూ, వైవాహిక సంబంధమునుండి వేరుపడుటకు ప్రయత్నిస్తారి. దీనిసే శాస్త్రప్రకారం వియోగమనియు, చట్టప్రకారం విడాకులనియు గ్రహించాలి.

56. గురువుగారూ! కుజదోష విషయములను చక్కగా భోదించారు. ప్రస్తుతము జన్మించువారి జాతకాలలో కుజదోషము అధికముగా కనిపించుచున్నది. 10-20 సంవత్సరముల క్రితం జాతకాలలో కుజదోషప్రభావం చాలా తక్కువగా ఉండేది. కాలానుగుణంగా కుజుడియొక్క ప్రభావం జాతకములలో ఎక్కువగా కనిపించుటలోని మర్మమేమిటి? మీ చే తెలియగోరుచున్నాను.

శిష్యా! ఇంతవరకూ కుజదోషమును జాతకము ద్వారా తెలుసుకొను పద్ధతిని వివరించాను. ఇప్పుడు కుజదోషము కొందరి జాతకములో వుండుట, కొందరి జాతకాలలో లేకుండుటకు గల కారణములను చర్చిద్దాం. కర్మసిద్ధాంతము ప్రకారం గతజన్మలలో చేసిన శుభ/పాప కర్మలకు ఫలాన్ని ఈ జన్మలో ప్రారబ్దకర్మగా అనుభవించవలసి వుంటుంది. వ్యక్తి జాతకంలోని సహజ పాపగ్రహాలైన శని, కుజుడు, రాహుకేతువులు,

ఆధిపత్యపాపగ్రహాలైన 6, 8, 12 అధిపతులు బలంగా వుండుటకు కారణమేమిటి అన్న విషయాన్ని ఆలోచించాలి. దీనికి కారణం ఆ పాప గ్రహాలు తెలిపెడి పాపకర్మలను గతజన్మలలో చేశామన్నమాట. లేనిచో అవి బలపడవలసిన అవసరం లేదుకదా. పాఠశాలలోని విద్యార్థి పరీక్షలు బాగా రాయకపోతే ఏమవుతుంది. తక్కువ మార్కులు రావడం లేక ఉత్తీర్ణత పొందకపోవడం జరుగుతుంది కదా! ఈ ప్రతిభా ఫలితాలకోసం విద్యార్థి ఒక సంవత్సరం పాటు వేచివుండాలికదా! అతడి ప్రతిభనాధారంగా ఉన్నత చదువులు పొందటకు అవకాశముంటుంది. అదేవిధంగా గతజన్మ కర్మలకు ఫలితంగా ప్రస్తుత జన్మలో కర్మఫలాలను అనుభవించవలసివుంటుంది. మనిషి పొనర్చు శుభ–పాపకర్మలకు ప్రతిభాపత్రంలాంటిది జాతకచక్రం. ఇప్పుడు కుజదోష విషయాన్ని పరిశీలిద్దాం. వెనుకటి ప్రశ్నలో కుజుడు విజ్ఞాన కారకుడు, అహంకారం, కోపం, ధైర్యం, శక్తి, కలహప్రియుడు, కుతంత్రాలకు కారకుడని తెలుసుకున్నాం. గతజన్మలలో భార్య భర్తనుగాని లేక భర్త భార్యనుగాని హింసకుగురిచేసినట్లయితే ఈ జన్మలో కుజదోషమేర్పడుతుంది. తత్ఫలితంగా అతడు గతజన్మలలో చేసిన హింసలను తాను ఈ జన్మలో అధేవిదంగా అనుభవించవలసివుంటుంది.

100 ఏళ్ళకు పూర్వం అధ్యయనం చేసినట్లైతే పురుషుల ఆధిపత్యం అధికంగా ఉండేది. గృహిణులు మానసికంగాను, శారీరకంగాను అనేక హింసలకులోనయ్యేవారు. అప్పట్లో చూసినట్లైతే కుజదోషంవున్నవారు చాలా అరుదు. కుజుడు విజ్ఞానకారకుడూ అగుటచే సాంకేతిక విద్యనభ్యసించేవారు చాలా తక్కువ. కుజదోషం ఉన్నవారి జాతకాలకు వివాహమవడం చాలా కష్టతరంగా మారేది. వివాహంచేసుకొనుటకు ఎవరూ ముందుకొచ్చేవరు కాదు. అందువలన స్త్రీలకు వివాహం చాలా ఆలస్యంగాను, కష్టతరంగాను జరిగేవి. పురుషులు అప్పుడు ఒనర్చిన హింసలకు ఈ జన్మలో పాపఫలాన్ని అనుభవిస్తున్నారు. ఇప్పటివారిలో స్త్రీల ఆధిపత్యం ఎక్కువ. పురుషులతో సమానంగా స్త్రీలు పోటీపడుతుండడంతో వివాహానికి కన్యలు దొరకడం కష్టతరంగా మారింది ఈ నాటి పురుషులకు. వారికోరికలను, షరతులతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు నేటి కుర్రకారు. ఇప్పటి జాతకాలలో కుజదోషంలేనివారి జాతకాలు అరుదు. ఈ వైజ్ఞానిక యుగంలో సాంకేతిక విద్యనభ్యసించువారు నూటికి తొంబైతొమ్మిదిమంది. కుజుడు విజ్ఞానమునకు,

కోపము, అంకారములకు కారకుడుగావున ఇప్పటికాలంలో ఇంజినీర్లు, డాక్టరులు ఎక్కువ. వారికి కోపము, కోరికలుకూడా ఎక్కువే. కుజుడు కలహప్రియుడు, యుద్ధప్రియుడు అయినందున కుజదోషము అధికముగా ఉన్నఎడల అహంకారముతో కుటుంబమును సంగ్రామముగా మార్చగలుగుతున్నాడు. న్యాయస్థానములనాశ్రయించి విడాకులు తీసుకుంటున్నారు.

ఈ ఆధునిక కాలంలో కన్యామణులు నిశ్చితార్థమయిననూ అత్యాశ/అనుమానాలతో వివాహముపై విముఖత చెంది వివాహమును రద్దుపరచి వేరొకరితో మరల వివాహమునకు సంసిద్ధులగుచున్నారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తూ, విదేశీవ్యవహారాలను ఆచరిస్తూ వివాహం జరిగి పట్టుమని ఒకసంవత్సరం కూడా కాకుండానే విడాకులకు ధరఖాస్తు చేస్తూ న్యాయస్థానాల చుట్టూ, జ్యోతిష్కుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు ఈ నాటి యువతరం.

కుజదోషం వున్నవారు, ఆ దోషం వున్నవారినే వివాహం చేసుకోవాలని తెలిపినా వివాహవ్యవస్థమీద, సాంసారిక జీవితంమీద, గృహస్థాశ్రమధర్మమీద సరియైన అవగాహనలేనివాడు, సంయమనం లేనివాడు వైవాహిక జీవితాన్ని సుఖంగా, ఆనందంగా గడపలేడు. వివాహం కేవలం శారీరక, మానసిక కామవాంఛను తీర్చుకొనెడి సంబంధంగల వ్యాపారజీవితం కాదని ఈ నాటి యువతరం తెలుసుకోవాలి. తల్లిదండ్రులను, తాతముత్తాతలు గడిపిన ప్రాచీన జీవనవిధానాన్ని, సత్సాంప్రదాయములను ఆదర్శంగా తీసుకోనంతవరకూ ఏజ్యోతిష్కుడూ మార్గం చూపలేడు, ఏభగవంతుడూ ఆదుకోలేడు అన్న సత్యాన్ని తెలుసుకోవాలి.

57. గురువుగారూ! వైవాహిక ఆనందమగు జీవితమును గడుపుటకు కావలసిన జ్ఞానాన్ని అందించారు. కొని సందర్భాలలో సర్పదోషం, కాల-సర్పదోషం, సర్పదోషం వివాహానికి, సంతానానికి, కార్యనిర్వహనకు అడ్డుపడి ఆలస్యంగావస్తుంటాయని అంటారు. కొందరు సర్పదోషం వుందని పూజలు, హోమాలు చేయిస్తారు. ఈ సమస్యకు కర్తవ్యభోదన చేయమని అర్థిస్తున్నాను.

మంచిప్రశ్న అడిగావు! ప్రస్తుత జ్యోతిష్కులలో పుస్తకం ద్వారా శాస్త్రాన్ని అధ్యయనం చేసినవారే

ఎక్కువ. గురుముఖాంతరముగా శాస్త్రశ్రద్ధతో జ్యోతిషశాస్త్రాన్ని అభ్యసించి, సమాజంలో చైతన్యం తీసుకురావాలని కోరుకొనేవారు చాలా అరుదుగా వుంటారు. జ్యోతిష్కుడి శాస్త్రశ్రద్ధకు, స్వతంత్రబుద్ధికి సమన్వయం లోపంవలన ఇలాంటి సమస్యలు ఎదురవుతుంటాయి. పుస్తకాలలో అనుభవాలను నింపలేము, భోధించలేము. శాస్త్రశ్రద్ధ, సదాచారము, అధ్యాత్మికజీవనము గడుపు గురువు ద్వారా జ్యోతిష్యశాస్త్రమును అభ్యసించినా ఇలాంటి సమస్యలు భాదించదు.

జ్యోతిషశాస్త్రం ప్రకారం అన్నిగ్రహాలు(లగ్నం, చంద్రుడు తక్క) రాహువు కేతువుల మధ్య బంధించబడితే దానిని కాల–సర్పదోషముగా పరిగణిస్తారు. అధర్మము, అనాచారము, భ్రష్టత్వము, వర్ణసంకరము, విదేశీసాంప్రదాయములయందు మక్కువ, దొంగతనము, ఆలస్యము, అతియైన వ్యామోహం మొదలగు విషయములకు రాహువు కారకుడు. జాతములోని అన్ని గ్రహములను రాహు–కేతువులు బందించినచో పై రాహు కారకత్వాల ప్రభావము అధికముగా వుండునని గ్రహించవలెను. జాతకంలో కాల–సర్పదోషం వున్నయెడల చేయదలచిన కార్యాలు వివాహం చివరినిమిషంలో వాయిదాపడుట, సంతానం ఆలస్యమగుట, విదేశీయానమున కొరకు ప్రయత్నించుట మొదలగు అంశాలు బలపడతాయి.

విదేశీయానమును కొంతమంది యోగమనిను భావించెదరు. కాని హిందూ ధర్మశాస్త్రం ప్రకారం విదేశీయానం దోషముగా పరిగణించబడినది. దీనికి కారణములు చాలా కలవు. సమాజ, సంఘవిద్రోహచర్యలకు పాల్పడినవారికి పూర్వము గ్రామబహిష్కరణ, దేశభహిష్కరణ, వెలివేయడం అను శిక్షలను విధించేవారు. పూర్వము దీనిని అవమానముగా, దోషముగా చూసేవారు. వారితో ఎవరూ మాట్లాడేవారుకాదు, వారికి ఏరకమైన సహాయసహకారాలనందించేవారు కాదు. ఈనాటి యువతరం తమకు తామే శిక్షవేసుకొని దేశాన్ని వదలిట్టి విదేశాలకు పోవుటకు ఆసక్తికలిగి వున్నారు. విదేశమునందు ధనసంపాదనకు, అమితమైనకామమునకు, వ్యభిచారమునకు నియంత్రణలేదు. అనాచారమైన జీవనము గడుపుటకు అనుకూలమైన వాతావరణము అచ్చట లభింపును. పూర్వం భారతదేశం నుండి వెలివేస్తే వారితో ఎవరూ సత్సంబందాలు కలిగియుండేవారు కాదు. ఈనాడు విదేశాలలో కూడా అదే పరిస్థితి నెలకొన్నది. అచ్చట కూడా ఒకరిని ఒకరు పట్టించుకోరు. ఎవరికివారే యమునాతీరే అన్నట్లు వ్యవహరిస్తారు.

58. గురువుగారూ! మన ధర్మశాస్త్రాలు, ఆచారవ్యవహారాలు విదేశాలను చులకనాగా చూచుటలో గల ఆంతర్యమేమిటి?

శిష్యా! మంచి ప్రశ్న వేశావు. మనం నివసించు గృహమునందు దేవుడిగది, వంటగది, శయనగది, శౌచాలయము మొదలైనవి ముఖ్య గదులు కలిగియుంటాయి. అదేవిదంగా విశ్వం నందు భూమి ఒక గృహములాంటిది. భూమియను ఈ గృహమునందు సాంప్రదాయం, సంస్కృతిగల భారతదేశము పూజగదిలాంటిది. పూజగదిలో దేవుడువున్నట్లు భారతదేశములోనే భగవంతునియొక్క సమస్త అవతారములు జరిగినవి. దేవతలు, జ్ఞానులు, ధర్మము మొదలగు అంశాల అధ్యాత్మిక ప్రభావం మనభారతదేశమునందు మాత్రమే కలదు. మిగిలిన దేశాలు వంటగది, శయనగది, వరండాలాంటివి. అక్కడ భోగమేతప్ప భక్తియొక్క ప్రభావము వుండదు. భగవంతుడి ప్రభావము, ఉనికి చాలా తక్కువగాయుంటుంది. కావున జ్ఞానులు, దేవతలు, మునులు భరతభూమియందు పుట్టువలెనని మిక్కిలి ఆసక్తిని కలిగియుండేవారు. అలాంటి పవిత్రమైన భూమినుండి దూరముగా వెళ్ళుట కేవలం సుఖభోగాలకేగాని శాంతి, ఆనందప్రదమైన జీవనము గడుపుటకు కాదని గ్రహించాలి. మనం నిద్రలేవగానే పూజగదికిగాని, గుడికిగాని వెళ్లాలంటే స్నానంగావించి శుచిగా బయలుదేరుతాం. వంటగదికి, శయనగృహమునకు ఆ పద్ధతులు అవసరం లేదు. భారతభూమియందే ఆచారవిచారముల ఆవశ్యకత తక్కిన దేశాలలో వాటి అవసరం వుండదు. శయనగృహమునందు, వంటగదియందు కూడా దైవధ్యానం చేయవచ్చును. కాని దైవధ్యానమును చేసుకొనుటకు వంటగదికి, శయనగదికి వెళ్ళనవసరంలేదు, పూజగదియందు చేయడం మంచిది. విదేశములకు వెళ్ళుట ధన సంపాదనకు, సుఖభోగములననుభవించుటకు. అచ్చట కూడా దైవధ్యానము చేయవచ్చును. కాని దైవధ్యానము, సదాచారము ప్రథమ కర్తవ్యమైతే విదేశాలకు వెళ్ళనవసరంలేదని గ్రహించాలి. ప్రస్తుత జనులు భోగాలననుభవించుటకు కావలసిన ధనసంపాదనకే సమయాన్ని కేటాయిస్తున్నారేగాని ధర్మాచరణకు, సదాచార సహజీవనముచేయుటకు కావలసిన సమయాన్ని కేటాయించుటకపోవడం విస్మయం. కష్టములనుండి బయటపడుటకు భగవంతుడిని ఆరాధిస్తున్నారు. ఆ కష్టములు దరిరాకుండా వుండుటకు

భగవంతుడు సృష్టించిన ధర్మ–సదాచారములను ప్రక్కనపెడుతున్నారు. వేదశాస్త్రాల సారాన్ని, గురువు తెలిపిన మార్గన్ని, పెద్దలమాటలను అనుమానపరచువానికి, అనుసరింపనివానికి మానసిక, శారీరకసుఖశాంతులు దరిచేరవు. తాత్కాలికమైన సుఖభోగములొచ్చిననూ శాశ్వతమైన ధుఃఖమునకు గురియగుటలో ఎటువంటి సందేహమూలేదు.

59. గురువుగారూ! మరి సర్పదోషమనగానేమి? దీని ప్రభావమెట్టిది.

సర్పదోషముయొక్క విషయానికి వస్తే చాలా వదంతులు వినిపిస్తాయి. "జాతకుడి వంశమునందు ఎవరో ఒకరు సర్పాన్ని చంపారని దోషమునకు కారణమయ్యారని" చాలామంది జ్యోతిష్కుల ద్వారా వినవచ్చు. జ్యోతిషశాస్త్రము ద్వారా ఈ విషయాన్ని పరిశీలిస్తే కుజుడు ఆయుధము, రక్తపాతమునకు కారకుడు. రాహువు సర్పమునకు, అమితమైన కోరికలకు, అనాచారమునకు కారకుడు. కుజరాహువుల కలయిక సర్పదోషముగా పరిగణించబడుతుంది. ఆయుధము ద్వారా సర్పమునకు హానియైనదని ఊహించవచ్చు. ఇచ్చట సర్పదోషమనగా సర్పాన్ని చంపాడని అర్థంకాదు. వెయ్యిసంవత్సరాలు ఆయుర్దాయముగల సర్పాన్ని చంపితే ఏవిధమైన పాపముగలుగుతుందో దానికి సమానమైన పాపము చేశాడని అర్థము. బ్రహ్మహత్యాపాతకమనగా బ్రహ్మను చంపాడని అర్థముకాదు, దానికి సమానమైన పాపము చేశాడని అర్థము. పాపతీవ్రతను కొలుచుటకు బ్రహ్మహత్యాపాతకము, గోహత్యాపాతకము, సర్పదోషము, కాలసర్ప దోషము మొదలైన తూనికలను వాడబడుతాయని మర్మము. వివాహానంతరం జీవితభాగస్వామిని గృహహింసలకు లోనుచేయడం, అగ్నిసాక్షిగా వివాహధర్మాలను సూత్రాలను నిర్వర్తిస్తానని వివాహమాడిన పతినిగాని/భార్యనుగాని మానసికంగా క్షోభపెట్టడం, తండ్రిస్థానంలోవుండి సంతానాన్ని సంరక్షించవలసిన కర్తవ్యాన్ని విస్మయించినవాడికి, అనువంశికంగా ధర్మాన్ని భోదించి, శరీరాన్ని ప్రసాదించిన తల్లిదండ్రులను మరియు ధర్మాచరణకు సహాయపడునని కన్యాదానం చేసిన అత్తమామలను మానసికంగా హింసించినవారికి, అగౌరవపరచినవారికి ఈ సర్పదోషము చుట్టుకుంటుంది. రాశిచక్రములలోకాని, షడ్వర్గులలోగాని కుజుడు–రాహువు కలసిననూ ఈ వైచర్యలకు భాద్యుడని తెలియవలెను. ప్రతిఫలంగా ఈ జన్మలో సంసారదుఃఖమును, నరకప్రాయమైన వైవాహికజీవితమును, సత్సంతానము లేకుండుట,

ధర్మహీనమగు, అశాంతియగు జీవనమును గడుపును. కుజుడియొక్క అధిదేవతయైన సుబ్రమణ్యస్వామిని, రాహువుయొక్క అధిదేవతయైన దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో ఆరాధించినయెడల సమస్యల తీవ్రత తగ్గునని గ్రహించాలి.

60. గురువుగారూ! మాంగల్యదోషము అనగాఏమి? తెలుసుకొనుట ఎటుల? భోదింపగలరు.

శుక్ర, రాహువుల సంయోగము మాంగల్యదోషమగును. లోతుగా గమనింపగా రాహువుతో కలసిన గ్రహాల కారకత్వమునకు దోషమని తెలియవలెను. గురువుతో రాహువు కలసినయెడల ధర్మబ్రష్టుడు, జ్ఞానబ్రష్టుడు అగును. ఇక్కడ బ్రష్టుడనగా ఆసక్తిలేనివాడని అనాచారియని అర్థము. శుక్రుడు కళత్రమునకు, మైథునమునకు, జననాంగములకు కారకుడు. రాహువు మోహమునకు, అతియైన కామమునకు, దొంగతనమునకు, అనాచారమునకు కారకుడు. వీరిద్దరి సంయోగమువలన జాతకునికి కళత్రబ్రష్టత్వమేర్పడుతుంది. అనగా అతియైన కామం, మోహంతో వివాహేతర సంభందములకు కారణమగునని గ్రహించాలి. హిందూసమాజంలో వివాహమునకు విశేషమైన స్థానం కలదు. వ్యభిచారం, వివాహేతర సంబంధముల వలన హిందూ వివాహ వ్యవస్థకు బ్రష్టత్వమేర్పడగల ప్రమాదము కలదు.

జాతకములో శుక్రరాహువుల సంబంధమెట్లేర్పడును. గతజన్మలలో స్త్రీగాని/పురుషుడుగానీ వివాహేతర సంబంధములకు పాల్పడితే ఈ జన్మలో మాంగల్యదోషమేర్పడును. తత్ఫలితంగా ఈ జన్మలో అలాంటి సన్నివేశమే ఎదుర్కొనవలసి వచ్చును. గతజన్మలో స్త్రీ తప్పిదముచేసిన ఈ జన్మలో మంచి భర్తను పొందలేదు, పురుషుడు తప్పిదము చేసినా మంచి కన్యను పొందలేడు. దోషముయొక్క తీవ్రతను బట్టి ఈ కర్మఫలము ప్రతిజన్మలోనూ పునరావృతమగుతూ ఉండును. జాతకములో శుభగ్రహాల సంబంధమున్నయెడల సుఖప్రదమైన సంసారమును అనుభవించగలడు.

మనిషియొక్క కామావేశములను ధర్మబద్దంగా నియంత్రించుటకు గల ఏకైకమార్గం వివాహం. ధర్మపత్ని యనగా పతియొక్క సహజసిద్ధమైన కామావేశాన్నితనయొక్క సహకారంతో నియంత్రించునదని అర్థము. భార్యాభర్తల మధ్య సంగమమును సంసారం అని పిలుస్తారు. ఇచ్చట కామం అన్న పదం

వర్తించదు. అన్యపురుషస్త్రీలమధ్య పుట్టు కామాన్ని వ్యభిచారమని, అతికామమని వ్యవహరిస్తారు. ఇది ధర్మపరంగా, సుఖమైన జీవితమునకు మంచిదికాదు. కాలబద్ధంగా, ధర్మబద్ధంగా భార్యతో కూడిన భర్త నిత్యబ్రహ్మచారియే అగును. అతడు దైవంపై శ్రద్ధ, భక్తి కలిగియుండి సంసారాన్ని ఒక యజ్ఞంగా, కర్తవ్యంగా చేస్తాడు. ధర్మాచరణ, సదాచారము, దైవధ్యానం లేనివాడు తన భార్యతో సంగమించిననూ అది అమితమైన కామముగా పరిగణించబడుతుంది. ఇలాంటివారు కాలాంతరమున మళ్ళీమళ్ళీ సంసారమను నరకమున పడి దుఃఖముపాలగుదురు.

61. గురువుగారూ! జాతకము ద్వారా వివాహము యోగకాలమును తెలుసుకొనుట ఎటుల? బోధింపగలరు.

శిష్యా! వివాహయోగ్య కాలము తెలుసుకొనవలెనన్న దశలు, గోచారము, గురుబలము, వర్షఫలము మొదలగు అంశాలను పద్ధతిపూర్వకంగా అధ్యయనం చేయవలెను.

సూర్యాస్తమయం కావస్తోంది. సంధ్యావందనాది క్రియలకు వేళ అయినందున మిగిలిన ప్రశ్నలకు సమాధానం రేపటిరోజున తెలుసుకుందాం. అంతవరకూ శెలవు. సర్వేజనా సుఖినోభవంతు.

పై ప్రశ్నకు సమాధానాన్ని మరిన్ని శాస్త్రవిషయాలను మనోజ్యోతిర్విజ్ఞానశాస్త్రం యొక్క రెండవభాగంలో ప్రచురించబడుతుంది. వీటితోపాటు విద్యాభ్యాసం, విద్యార్థి లక్షణము తెలుసుకొనుట, ఉన్నతవిద్య, వేదవిద్య, ఉద్యోగం, ఉద్యోగయోగ్య కాలం, మరికొన్ని వివాహవిశేషాలు, వాహనం, స్థిరాస్థి, సంతానం, ఆరోగ్యం, ప్రశ్న, ముహూర్తం మొదలగు విషయాలను రెండవభాగంలో చూడవచ్చు.

ఈ పుస్తకానికి సంభందించిన మీ అమూల్యమైన అభిప్రాయాలను

క్రింది

ఈ-మెయిల్ విలాసమునకు పంపగలరు.

vaiswanara@gmail.com

ఋషి-మునులు జ్యోతిషశాస్త్రాన్ని మనఃశ్శాస్త్రంగా, ప్రత్యక్షజీవనధర్మశాస్త్రంగా పరిగణించి మోక్షగమనమును తెలుసుకొనుటలో ప్రయోజనము పొందేవారు. ప్రస్తుతం జనులు ఈ అత్యాదునిక కాలంలో లౌకికసుఖ-భోగాలు తెలుసుకొనుటకు, అనగత్యమగు ధనము, కీర్తి, ప్రతిష్టలు పొందుటకు, శ్రమలేని ఫలితాలను ఆశించుటకు, ప్రారబ్ధకర్మలనుండి తప్పించుకొనుటకు, అదుపులేని కోరికలను-వాంచలను నెరవేర్చుకొనుటకు తగు మార్గాన్ని అన్వేషించుటకు ఈ జ్యోతిషశాస్త్రము యొక్క ప్రయోజం పొందుతున్నారు. లౌకికసుఖభోగములనుద్దేశించి ప్రయోజనము పొందుటయే ప్రస్తుత కాలములోని జనుల అభిలాష. ఇలాంటి సంధర్భములో జనులకు సనాతనధర్మసహిత జ్యోతిషశాస్త్రమును భోదిస్తూ, హితమార్గాన్ని తెలుపుతూ, మానసిక సమస్యలను అధిగమించుటకు కావలసిన సామాన్య జ్ఞానాన్నిస్తూ, ధైర్యాన్ని నింపుటలో ఈ ప్రబంధము సహాయపడగలదు.

ఈ ప్రబంధములోని అంశాలన్నియూ గురు-శిష్యులమధ్య ఏర్పడిన సంభాషణారూపముగా రచించబడినది. ఈ రచనలోని సన్నివేశాలన్నియూ నా పాటకులు అడిగిన ప్రశ్నలు దానికి నానుండి భగవంతుడు పలికించిన సమాధానాలు. ఈ ప్రబంధములో తెలిపిన ప్రశ్నలు ప్రస్తుత జనుల మనస్సులలో వున్నవే! ఈ ప్రబంధములోని సారాంశమంతయూ భగవద్గీత, ఉపనిషద్పురాణాలనుండి గ్రహించిన జ్ఞానాన్ని జ్యోతిషశాస్త్రమునకు అనుసంధానము చేయుట ద్వారా కలిగిన అనుభవపూర్వక సమాధానాలు. ఈ ప్రబంధము ఈనాటి యువతరానికి అర్ధమగునట్లు ఉదాహరణలతో వివరించబడినది. సమగ్రజ్యోతిషశాస్త్ర అధ్యయనమునకు ఈ పుస్తకము ప్రయోజనకారికాజాలదు. జ్యోతిష్కుల పరిభాష మరియు వారు చెప్పిన ఫలమును అర్ధంచేసుకొనుటకు కావలసిన సామాన్య జ్ఞానం ఈ పుస్తకమునందు పొందుపరచబడినది. అనుభవాలు పుస్తకాలద్వారా అర్ధంచేసుకొనుట కష్టము. కావున సమగ్రజ్యోతిషాధ్యయనము గురుముఖాంతరముగానే అభ్యసించవలెనని గ్రహించవలెను. భగవంతుడు నాకు ప్రసాధించిన ఈ చిన్నపాటి జ్ఞానంతో రచింపబడ్డ ఈ పుస్తకాన్ని సావధానచిత్తముతో చదవి, అర్ధముచేసుకొని, సత్యాంశమునుగ్రహించి, సమాజాన్ని జాగృతపరచుటలో మీవంతుకృషిని ప్రదర్శిస్తారని ఆశిస్తూ...

– జ్యోతిష్యాచార్య ధర్మవరం శ్రీకాంతాచార్

